
KISS ME DARLIN
MADHU
BAABU

# కిస్ మీ డార్లింగ్

రచన

మధుబాబు

ప్రధమ ముద్రణ:జూన్, 1973

"సార్! మీకోసం ఎవరో వచ్చారు."

బేరర్ మాటలు విని, షాడో పక్కకు చూశాడు. నవ్వుతూ రెస్టారెంట్ సెక్షన్ చివర నిలబడి వున్నాడు ముఖేష్.

"బిందూ, ఎవరొచ్చారో చూడు" అంటూ బిందుకు అతన్ని చూపించాడు షాడో.

"కమాన్ బ్రదర్, కమాన్. ఈ మధ్య దర్శనాలే లేవు" చిరునవ్వుతో ముఖేష్ ని ఆహ్వానించింది బిందు.

"క్షేమమా బిందూ? మా వాడిని కొంగుకు ముడి వేసుకొని తిరుగుతున్నావటగా? సి.ఐ.బి. అంతా ఒకటే గోల." నవ్వుతూ కుర్చీ లాక్కుని కూర్చున్నాడు ముఖేష్.

"నేనేం కొంగుకు కట్టుకొని తిరగటంలా? ఆయనే వదలకుండా వెంట పడుతున్నారు." ముచ్చటగా మూతి మూడువంకర్లు తిప్పింది.

షాడో సి.ఐ.బి. లో సీక్రెట్ ఏజెంట్. ముఖేష్ అతని సహచరుడు. ఒకసారి చైనా పోయినప్పుడు పెంగాల్ మిలటరీ గారిజన్ లో బిందు తారసపడింది. అప్పటికి షాడో అలియాస్ రాజు, ఇంకా సి.ఐ.బి. లో చేరలేదు. ఇండియా తిరిగి రాగానే ఏజెంట్ గా మారిపోయాడు. అతనితో

పాటు, భారతదేశం వచ్చిన బిందుకూ, అతనికీ పరిచయం వృద్ధి అయింది. పరిచయం మూడుమెట్లు ఎక్కి ఇంకా గాఢతరమయింది.

"రాజు! నిన్ను అర్జంటుగా లాక్కురమ్మన్నారు కులకర్ణిగారు. ఇంకెవరినయినా పంపండి, నేను పోను అన్నా వినకుండా నన్నే తరిమారు." కోపంగా కనుబొమ్మలు ముడిచి చూస్తున్న బిందువైపు తన తప్పేంలేదన్నట్లు చూస్తూ వచ్చిన పని బయటపెట్టాడు ముఖేష్.

"ఏమిటిది? మీ బాస్ సంగతి నాకు అర్థం కావటంలేదు. కులసాగా ఒక గంట కూడా గడపనియ్యడేం? పదండి. నేను వచ్చి అడుగుతాను" చిరాకును వ్యక్తం చేసింది బిందు.

"ముఖేష్! ఏమిటి అసలు విషయం?" సిగిరెట్ వెలిగించుకుంటూ అడిగాడు షాడో.

"ఏమో భాయ్ నాకేం తెలియదు. బహుశా నిన్న అస్సాం ఫారెస్ట్ లో కూలిపోయిన ఎయిర్ ఇండియా విమానాన్ని గురించి కావచ్చు. నాకు క్లియర్ గా తెలియదు."

సర్వర్ తెచ్చిన కాఫీ సిప్ చేసి తల ఎత్తిన బిందుకు, లేచి నిలబడిన షాడోను చూడగానే కోపం ముంచుకు వచ్చింది.

"ఐయామ్ సారీ బిందూ. నేను అలా పోయి విషయం ఏమిటో తెలుసుకు వస్తాను. నువ్వు ఇంటికి వెళ్ళిపో" అంటూ ఆమె

సమాధానం ఇచ్చేలోపులోనే వెళ్ళిపోయాడు. మౌనంగా అతన్ని అనుసరించాడు ముఖేష్.

*        *        *

గలగలా ప్రవహిస్తున్న శృంగానది శబ్దాలను వింటూ కాబిన్ ముందు కూర్చున్నాడు మాధవ్. మూడు పదుల వయస్సు వుండవచ్చు, మంచి పర్సనాలటీ. దట్టంగా పెరిగిన గడ్డం, మీసాలు అతనికి ఒక వింత అందాన్ని ఇస్తున్నాయి.

అస్సాంలో వున్న అరణ్యం మధ్యలోవుంది ఆ కాబిన్. పట్టణాలలో నివసించటం ఇష్టంలేక అలా అడవిలో వుంటున్నాడతను. చెట్లలో చెట్టు అయి, జంతువులలో జంతువై కాలం గడుపుతున్నాడు.

కాబిన్ తలుపుకు ఆనుకొని కూర్చున్నవాడు కాస్తా వులిక్కిపడి లేచి కూర్చున్నాడు. దూరంగా ఆకులు గలగల లాడిన శబ్దం వినవస్తోంది. అదేదో మానవులు చేసిన శబ్దమే. అడవి జంతువులు అంత శబ్దం చేయవు. కాబిన్ తలుపు తెరిచి లోపలకు అడుగు పెట్ట బోయేలోగా, ముందున్న ఖాళీ స్థలంలోకి వచ్చారు కొందరు వ్యక్తులు.

ఇద్దరు మగవాళ్ళు, ఒక పదునెనిమిది సంవత్సరాల యువతి.

"హల్లో మిస్టర్ మాధవ్! హౌ డూ యూ డూ?" విష్ చేసిందామె.

ఆమె ఎవరో తెలియక బిత్తరపోయాడు మాధవ్. ఎప్పుడూ చూసిన గుర్తులేదు. ఒకసారి చూస్తే మరిచి పోలేనంత అందం ఆమెది. గుండ్రటి ముఖం, ఎత్తైన వక్షోజాలు, ఎర్రటి పెదిమలు....చాలా అందంగా వుంది.

"నన్నప్పుడే మర్చిపోయారా? అవునులెండి సహజమే గదా!" గునుస్తూ అన్నది. గుర్తు తెచ్చుకోవటానికి విపరీతమైన ప్రయత్నం చేశాడు మాధవ్. లాభంలేక పోయింది.

"క్షమించాలి, మీరు...మీరు...!" అన్నాడు నానుస్తూ.

"ఆనాడు విమాన ప్రమాదం నుంచి మీరు రక్షించిన షీలా నండి!"

వెన్నుమీద ఎవరో చరిచినట్లు వులిక్కిపడ్డాడు మాధవ్. తను ఎవరో ఒకరు వస్తారని గత పదిహేను రోజులుగా ఎదురు చూస్తున్నాడు. మరి ఈమె రావటానికి కారణమేమిటి? కలవరపాటు ను కప్పిపుచ్చుకుంటూ కాబిన్ లోకి ఆహ్వానించాడు ఆ ముగ్గుర్నీ.

"మాధవ్, ఇతను జాన్సన్, మా ఫాదర్ స్నేహితుడు. ఇతను స్పైడర్ అనీ, జాన్సన్ స్నేహితుడు!" అంటూ వారిద్దరినీ పరిచయం చేసింది షీలా.

"నమస్కారం!" అంటూ వారిని గమనించాడు మాధవ్.

ఇద్దరూ బలాఢ్యులే. జాన్సన్ లావుగా గుండ్రాయిలాగా వున్నాడు. స్పైడర్ కొంచెం సన్నగా ఎత్తుగా వున్నాడు.

స్పైడర్ ను చూస్తుంటే దొంగదెబ్బ వేసే కట్లపాము గుర్తుకు వచ్చింది మాధవ్ కు. అతనితో జాగ్రత్తగా వ్యవహరించాలని నిశ్చయించుకున్నాడు.

"నీతో కొన్ని విషయాలు మాట్లాడదామని వచ్చారు మాధవ్" అంది షీలా.

"మాట్లాడండి!" అంటూ గోడ కానుకొని కూర్చొని సిగిరెట్టు వెలిగించాడు.

"అదే! పదిహేను రోజులనాడు జరిగిన విమాన ప్రమాదాన్ని గురించి మాట్లాడదామనీ...!"

"అందులో మాట్లాడేదాని కేముంది? సమయానికి నేను ఆ పరిసరాల్లో వుండబట్టి ఒక్కరినైనా రక్షించగలిగాను!" అన్నాడు మాధవ్ నిర్లిప్తంగా.

నెలరోజుల క్రితం, శృంగానది ముఖద్వారం వద్ద ఒక ఎయిర్ ఇండియా విమానం కూలిపోయింది. దట్టమైన అడవి ప్రాంతం కావటం చేత "రెస్క్యూ ఆపరేషన్స్" వెంటనే మొదలు కాలేదు. ఆ సమయంలో మాధవ్ ఆ చుట్టుపట్ల తిరుగుతున్నాడు. ఏదో విమానం కూలిపోవటం చూసి, ఆ ప్రదేశానికి పరుగెత్తుకెళ్ళాడు. ఒక్క యువతి తప్ప అందరూ మరణించారు. స్పృహతప్పి పడిపోయిన ఆమెను అక్కడినుంచి

తప్పించేసరికి, ఆ విమానం పెద్ద మోతలతో పేలిపోయింది. ఎంత ప్రయత్నించినా ఆమెకు స్పృహ కల్పించలేకపోయాడు.

తను తయారు చేసుకున్న "డింగీ" మీద ఆమెను తీసుకొని, అరణ్యం బయటవున్న ఒక రెడ్ ఇండియన్ హాస్పిటల్లో వప్పచెప్పి వచ్చాడు. తను అక్కడ క్రాస్ కాగానే ఆమెకు తెలివి వచ్చింది. ఒక్కసారి మాత్రం చూసి థాంక్స్ చెప్పింది. తన పేరు, తను వుంటున్న చోటు చెప్పి వచ్చేశాడు.

ఇప్పుడు హఠాత్తుగా ఈ దొంగకోళ్ళను పట్టేవారితో ఆమె రాకలోని ఆంతర్యం?

చిన్నగా దగ్గుతూ గొంతు సవరించుకున్నాడు జాన్సన్.

"పడిపోయిన విమానంలో ఒక ప్యాకెట్టు వుంది. అది షీలా తండ్రి పేర వున్నది. కాని, రెస్క్యూ ఆపరేషన్స్ లో ఆ ప్యాకెట్టు కనిపించలేదు...."

యధాలాపంగా వారి మాటలు వింటున్న మాధవ్ కొంచెం ముందుకు వంగి ఒళ్ళంతా చెవులు చేసుకొని వినసాగాడు. 'అనుకున్నట్లుగానే ఈ ముఠా బయట పడుతున్నది!" అనుకుంటూ—

"మీ వుద్దేశ్యం? నేను తీశానంటారా?" చిరుకోపంతో ప్రశ్నించాడు.

"సీ హియర్ మాధవ్! అంత చిరాకు వద్దు. మేము స్నేహ పూర్వకంగా, అసలు విషయం తెలుసుకుందామని వచ్చాము" అన్నాడు జాన్సన్ తొందరగా.

"నువ్వు చూసివుంటావేమోనని అనుకున్నాం మాధవ్! నన్ను రక్షించటంలో బిజీగా ఉండి వుంటావని తెల్సనుకో! కానీ ఏమయినా!.." మాధవ్ వంక మత్తుగా చూస్తూ సర్దిచెప్పింది షీలా.

చిరునవ్వు నవ్వాడు మాధవ్. "ఆ ప్యాకెట్టు సంగతి పదిహేను రోజుల తర్వాత గుర్తుకు వచ్చిందా! ఆ సమయంలో నాకేమీ కనపడలేదు. ఎక్కడ ప్లేను పేలిపోతుందో అన్న భయంలో వున్నాను" అన్నాడు.

"వుయార్ నాట్ బ్లేమింగ్ యూ మాన్! షీలాను రక్షించినందుకు మేమెంతో ఋణపడివున్నాము. కాని, మరెవ్వరికీ ఆ పాకెట్టు కనపడలేదు. అందరినీ ప్రశ్నించాము. ప్రయోజనం లేకపోయింది" అన్నాడు జాన్సన్.

"విచారించ తగ్గ విషయమే! ఇంతకీ అందులో ఏముంది?" వచ్చే సమాధానం తెలిసి కూడా ప్రశ్నించాడు మాధవ్ చిలిపిగా.

ఒక్కసారి వారందరూ మౌనం వహించారు. షీలా వంక చూశాడు జాన్సన్.

"ఆ విషయం నీకు చెప్పకూడదు మాధవ్!" అన్నది మెల్లిగా.

విసురుగా లేచి నిలబడ్డాడు మాధవ్. రెండు బలమైన దమ్ములు లాగి సిగిరెట్టును నేలమీద వేసి కాలితో తొక్కాడు.

"మీరేం మాట్లాడుతున్నారో, మీకైనా అర్థం అవుతున్నదా? ఆ చిన్న పాకెట్టులో అంతపెద్ద రహస్యం ఏముంటుంది? డబ్బా? వజ్రాలా? నల్లమందా?" ప్రశ్నించాడు నోటిలో వుండిపోయిన పొగ వదులుతూ.

"నువ్వు మాతో సహకరిస్తావని ఆశించాం. నీకు సరియైన బహుమతి..." "గెటవుట్!" అన్నాడు కోపంగా జాన్సన్ మాటల మధ్యలోనే మాధవ్.

అంతవరకూ ఒక్కమాట కూడా మాట్లాడకుండా మౌనంగా కూర్చునివున్న స్పైడర్ లేచి నుంచున్నాడు. అతని కుడిచెయ్యి పాంటు జేబులోకి పోతుంది.

జాన్సన్ తొందరగా లేచి, స్పైడర్ భుజంమీద చెయ్యివేసి కనుసైగ చేశాడు. షీలా నాలికతో ఎండిపోయిన పెదవులు తడుపుకుంటూ బెదురు చూపులు చూస్తోంది. వాళ్ళు ప్రవేశించిన క్షణంనుండీ మాధవ్ స్పైడర్ ను గమనిస్తూనే వున్నాడు. జాన్సన్ సైగలను చూసి నవ్వుకున్నాడు.

"నీ బాడీగార్డా?" జాన్సన్ తో అన్నాడు కేర్లెస్ గా.

మింగేసేటట్లు చూశాడు జాన్సన్. మాటలు సౌమ్యంగానే వున్నాయి.

"పొరపాటు పడుతున్నావ్ మాధవ్! నువ్వు వెళ్ళిపొమ్మన్నావని, స్పైడర్ లేచి నుంచున్నాడు. అంతకంటే ఏమీలేదు. నేను చెప్పింది మరోసారి ఆలోచించు" మరోసారి ద్వారంవైపు చెయ్యి చూపించాడు మాధవ్.

"మా రిక్వెస్ట్ గాదని, మమ్మల్ని అవమానిస్తావా?" అంటూ జాన్సన్ బయటికి పోయాడు. స్పైడర్ అతన్ని అనుసరించాడు.

మాధవ్ వంక అదోరకంగా చూస్తూ షీలా వారి వెనకాలే బయలు దేరింది.

జాన్సన్ ప్రవర్తనను అర్థం చేసుకోగలిగినా, షీలా చూపులు అతన్ని కలవర పరిచాయి. ఆమె కూడా వీరి గాంగ్ లో మనిషేనా?

వారు కనుమరుగయ్యేదాకా ద్వారంలోనే నుంచొని వున్నాడు మాధవ్. కొంతసేపటికి, నదిలో మోటార్ బోటు స్టార్టయిన ధ్వని వినపడింది. క్రమ క్రమంగా దూరమైపోయిందా ధ్వని. తిరిగి ఆ ప్రదేశమంతా నిశ్శబ్దం ఆవరించింది.

కాబిన్ లోకి వచ్చి తలుపు గడియ పెట్టాడు మాధవ్.

* * *

లోపల షెల్ఫ్ లో వున్న పుస్తకం ఒకటి తీసుకొని కూర్చున్నాడు, మాధవ్. అడవిలో జీవించినా, రకరకాల పుస్తకాలు తెచ్చుకొని, పెట్టుకున్నాడు.

అడవి బాపిరాజుగారి "హిమబిందు" అది. పుటలు తిరగవేస్తూ పుస్తకంలో లీనమైపోయాడు.

"సువర్ణశ్రీ మహాబలగొండునితో అడవిలో ప్రయాణిస్తున్నాడు. పక్కనున్న పొదకదిలి, శబ్దం వినవచ్చింది."

పుస్తకం మూసి, చెవులు రిక్కించుకొని వినసాగాడు మాధవ్. బయట ఏవో రాళ్ళు కదిలిన శబ్దం వినవచ్చింది. బూటుకాలు, తగలటం వల్ల గులకరాళ్ళు జారాయి.

ఆ కాబిన్ కు రెండే రెండు కిటికీలు వున్నాయి. ఒకటి తూర్పువైపు రెండవది పడమరకు వుంది. గతరాత్రి పడుకోబోయే ముందు తను కిటికీ తలుపులు వేశాడు. ఎందుకనో ప్రొద్దుటనుంచి వాటిని తెరవలేదు.

అడుగుల చప్పుడు పడమర వైపునుండి వస్తున్నది. అంటే నది వైపు నుంచి. సెమ్మదిగా లేచాడు. తూర్పువైపు కిటికీ చేరుకున్నాడు. శబ్దం కాకుండా మెల్లిగా తలుపులు తెరచాడు. కిటికీ చువ్వలేం లేవు. నిశ్శబ్దంగా బయటికి జారాడు. గోడ కానుకొని, పొంచి కూర్చున్నాడు.

సూర్యుడు అస్తమించి చాలాసేపు కావస్తున్నది. అడవి క్రమంగా చీకట్లతో నిండుకుంటున్నది. ఆ మసక చీకటిలో వేటగాడిలాగా మాటువేసి కూర్చున్నాడు మాధవ్. నదిమీదనుంచి చల్లటిగాలి వీచసాగింది. చెట్ల ఆకులు కదిలి చిరుశబ్దం చేయసాగాయి. ఆ శబ్దంలో

అడుగులు కలిపి పొదలను చాటు చేసుకొని కాబిన్ ముఖద్వారం వైపు అడుగులు వేశాడు. నాలుగడుగులువేసి కాబిన్ ద్వారంవైపు తిరిగాడు.

కాబిన్ డోరుకు పది అడుగుల దూరంలో ఒక నల్లని ఆకారం పొంచి చూస్తున్నది. పడమటి కిటికీ సందులనుంచి కొద్దిగా లైటు బయటికి వస్తున్నది. మాధవ్ ఇంట్లోనే వున్నాడనే నమ్మకంతో, ద్వారంవైపు అడుగులు వేస్తోంది, ఆ ఆకారం.

కుడిచెయ్యి ముందుకు పెట్టివుంచిన విధానాన్ని బట్టి రివాల్వర్ అయివుండవచ్చని అనుమానించాడు మాధవ్.

అతని వద్ద ఒక కత్తి తప్ప ఇంకేం ఆయుధాలు లేవు. ఒక పిస్టలు వుంది కాని, అది కాబిన్ లో వుండిపోయింది.

బెస్ బాల్ సైజ్ లో వున్న ఒక రాయిని తీసి పట్టుకున్నాడు మాధవ్. పదిహేను రోజులనుంచీ, చిన్న చిన్న జంతువులను, రాళ్ళతోనే వేటాడుతున్నాడు. అందువల్ల బాగా ప్రాక్టీసయిపోయింది.

నెమ్మదిగా చెయ్యెత్తి రాయి విసిరాడు—బలం కొద్దీ.

ఆ చీకటిలో రాయి ఎటువెళ్ళిందీ అతనికి కనపడలేదు. రాయి తగిలి, కిందపడిన శబ్దం వినపడింది. ఎదురుగావున్న ఆకారాం, చిన్న మూలుగుతో, కిందికి జారిపోవటం చూశాడు. కాస్సేపు తన్నుకొని లేచి కూర్చోవటానికి ప్రయత్నించింది ఆ ఆకారం.

అదే సమయంలో వెళ్ళి మీద పడ్డాడు మాధవ్. పాపం, ఆ ఆకారానికి మీద పడింది, మనిషో, జంతువో తెలుసుకోవటానికి వీలు లేకపోయింది.

అతని భుజాలు పట్టుకొని, చేతిలోవున్న రివాల్వర్ ను, లాగిపారేశాడు. కిందపడిన మనిషిని లేపి నిలబెట్టాడు. ఆ ఆకారం పోట్లాడటానికి ప్రయత్నం చేయలేదు. బహుశా రాయి బలంగా తగిలి వుంటుంది. బాధతో వెన్ను నిమురుకుంటూ అబ్బా, అమ్మా అంటున్నాడు.

అతనివద్ద ఇంకేమయినా ఆయుధాలు వున్నాయేమోనని వెతికాడు మాధవ్.

మెడదగ్గర పట్టుకొని, బరబరా కాబిన్ లోకి ఈడ్చుకుపోయాడు. లైటు వెలుగులో అతన్ని గుర్తించి ఆశ్చర్యపోయాడు. స్పైడర్!

అతన్ని ఒక కుర్చీలో పడేసి కాబిన్ తలుపులు గడియపెట్టాడు.

కళ్ళు మూసుకొని, నడుము సవరించుకొంటూ బాధతో మెలికలు తిరుగుతున్నాడు స్పైడర్. ఆ రాయి ఇంకా కొంచెం పైకిలేచి, తలమీద తగిలివుంటే, వెంటనే మరణించి వుండేవాడు. పక్కనేవున్న కూజా వంచి గ్లాసులో పట్టి, అతని ముఖంమీద నీళ్ళు కొట్టాడు. వులికిపాటు తో కళ్ళు తెరిచి చూచాడు స్పైడర్. ఎర్రబడి, కోపంతో మండిపోతున్నాయా కళ్ళు.

"నీ జాతకం బాగోలేదు చిన్నాడా! ఇంకెప్పుడూ చీకటి పడింతర్వాత నా కాబిన్ చుట్టూ వెతుకులాడకు. ఈసారి నీ వళ్ళు తూట్లుపడేలా పిస్టల్ తో కాల్చిపారేస్తాను." అన్నాడు నవ్వుతూ.

అసహ్యంతో మింగేలా చూశాడతను.

"నా ప్రశ్నలకు సమాధానం చెపుతావా? స్పైడర్!" అని ప్రశ్నించాడు.

మౌనంగా వుండిపోయాడు స్పైడర్. సమాధాన మివ్వలేదు.

ఒక్కగంతులో ముందుకుపోయి చొక్కా పట్టుకొని, స్పైడర్ ని ముందుకు లాగాడు. చొక్కా బిగుసుకొని అతని గొంతు నరాలు వుబ్బి ఆ లైట్ కాంతిలో దారాల్లా కన్పించసాగాయి.

"నిన్నెవరు పంపారు?"

"స్పైడర్ మాట్లాడకుండా రెండు చేతుల్తోను చొక్కా విడిపించు కోవటానికి ప్రయత్నించసాగాడు.

"మాట్లాడు. యూ బిచ్! లేకపోతే ఇల్లాగే గొంతు పిసికి చంపేస్తాను." అంటూ ఇంకా కొంచెం చెయ్యి బిగించాడు మాధవ్.

స్పైడర్ గొంతులో నుంచి, వింత శబ్దాలు రాసాగాయి. గుండెలు గాలి కోసం పైకీ కిందికీ ఆడసాగాయి. అయినా ఒక్క ముక్కగూడా అతని నోట్లోనుంచి బయటకు రాలేదు.

కోపంతో పిడికిలి బిగించి గడ్డంమీద లాగిపెట్టి కొట్టాడు. ఆ దెబ్బకు మళ్ళీ వెళ్ళి కుర్చీలోనే పడ్డాడు స్పైడర్.

"ఇప్పటికైనా మాట్లాడతావా?" వస్తున్న కోపాన్ని దిగమింగుతూ ప్రశ్నించాడు మాధవ్. అప్పటికీ సమాధానమివ్వలేదు స్పైడర్.

పళ్ళు బిగించి ఎడాపెడా రెండు దెబ్బలు గట్టిగా వేశాడు. స్పైడర్ తల, పక్కకు వాలిపోయింది. స్పృహతప్పి పడిపోయాడు.

చావలేదుకదా! అనుకుంటూ ముక్కు దగ్గిర వేలుపెట్టి చూశాడు. శ్వాస ఆడుతున్నది. భుజాలు పట్టుకొని బయటకు ఈడ్చుకు వచ్చాడు. చెట్లలో కొంత దూరం భుజంమీద వేసుకొని, మోసుకుపోయి ఒక చెట్టుకింద పడవేసి వచ్చాడు. దారిలో కాలికి తగిలిన రివాల్వర్ తీసి నదిలోకి విసిరేశాడు. కాబిన్ లోకి పోయి తలుపు గడియ పెట్టుకో బోయాడు. దూరంలో మోటారు బోటు స్టార్టు అయిన శబ్దం వినవచ్చింది. వెంటనే తలుపు తీసుకొని నది ఒడ్డుకు పరుగెత్తాడు.

పొదలను తప్పించుకొనిపోయి ఒక చెట్టు చాటున నిలబడి చూశాడు. నది ఒడ్డున మోటార్ బోటు ఆపివున్నది. ఒక సెర్చిలైటు అటూ ఇటూ తిరుగుతూ, తన కాంతుల్ని నది ఒడ్డుపై విరజిమ్ముతున్నది. రెండు నిముషాలలో స్పైడర్ తూలుతూ నదిని సమీపించాడు. బోటులోనుంచి ఒక వ్యక్తి దిగి వచ్చి స్పైడర్ ని సాయం పట్టి బోటు ఎక్కించాడు.

మరు నిముషంలో లంగరు లాగి బోటు నది వాలుగా కోస్గిల్ పట్టణం వైపు వెళ్ళిపోయింది.

వారు కనుమరుగై పోయేదాకా చూసి తన కాబిన్ కు తిరిగి వచ్చాడు మాధవ్.

*        *        *

మర్నాడు వుదయం ఎనిమిది గంటలకు స్నానం చేయటానికని నదికి పోయాడు మాధవ్. చొక్కా విప్పి కింద పడవేశాడు. పాంటు విప్పుతుండగా, నదికి ఎదురుగా కోస్గిల్ నుంచి వస్తున్న మోటారు బోటు కనపడింది.

'మళ్ళీ వస్తున్నారు గాబోలు!' అనుకొంటూ గబగబా చొక్కా వేసుకొని దగ్గిరలోవున్న గుబురులో దూరాడు. ఆకుల సందునుంచి ఆ బోటును గమనించసాగాడు.

అతని కాబిన్ పక్కగా వచ్చి ఆగింది మోటారు బోటు. వాళ్ళ ధైర్యానికి ఆశ్చర్యపోయాడు. ఇద్దరు వ్యక్తులు బయటకు వచ్చారు బోటులోనుంచి. ఆశ్చర్యపోయాడు మాధవ్. షీలా, ఇంకెవరితోనో వచ్చింది. నిన్న వచ్చిన వాళ్ళుకూడా వచ్చి వుంటారా? ఆరు పదులు దాటిన వ్యక్తి షీలాతో వచ్చాడు. నెరసిన తల, నున్నగా షేవ్ చేసిన ముఖం. బహుశా ఆమె ఫాదర్ అయివుంటాడని వూహించాడు.

పొదలలోనుంచి బయటకువచ్చి వారికి ఎదురు వెళ్ళాడు.

"హల్లో!" అంటూ ముందుకు గబగబా రెండడుగులు వేసి, ఆగిపోయింది.

"ఏమైంది మాధవ్?" సీరియస్ గా వున్న అతని ముఖాన్ని చూస్తూ అడిగింది.

"నీ స్నేహితులు నిన్న రాత్రి ఇక్కడకు వచ్చారు" అన్నాడు ముభావంగా.

ఆమె చిరునవ్వు మాయమయింది. "మాధవ్! వీరు నా ఫాదర్ అగర్వాల్. ఏదో పొరపాటు జరిగి వుంటుంది. నేనంతా వివరంగా చెప్తాను. వింటావుగా ప్లీజ్!" అన్నది దీనంగా. అగర్వాల్ కరచాలనం కోసం చేయి చాచాడు. అనుమానిస్తూనే, సందేహంగా చెయ్యి కలిపాడు మాధవ్. 'వీరి పాటకూడా విని ఆలోచించుకోవచ్చులే అనుకొంటూ!'

అగర్వాల్ ఏవేవో మాట్లాడ సాగాడు, వాతావరణం గురించీ, అస్సాం గురించీ, ప్రపంచాన్ని గురించీ, అవేమీ మాధవ్ బుర్ర కెక్కలేదు.

'షీలా తన తండ్రితో ఇక్కడి కెందుకు వచ్చిందీ?' అన్న ఆలోచనలలో మునిగిపోయాడు.

"మాధవ్! నిన్న నేను కావాలని వాళ్ళతో రాలేదు. నిన్ను కలుసు కుందామని వస్తుండగా వాళ్ళు కలిసి లిఫ్ట్ అడిగారు. వారితోపాటు వచ్చాను. అంతే!" అన్నది నన్ను నమ్మమన్నట్లూ చూస్తూ.

నమ్మినట్లే తలవూపాడు మాధవ్.

అగర్వాల్ జేబులోంచి సిగిరెట్టు ప్యాకెట్టు తీసి, సిగిరెట్టు ఆఫర్ చేశాడు. ఇద్దరూ సిగిరెట్లు వెలిగించారు.

"నా కాబిన్ లో కూర్చుని మాట్లాడుకుందాము" అని సజస్ట్ చేశాడు మాధవ్.

"ఇక్కడే ఇసుకలో కూర్చుందాం హాయిగా వుంటుంది" అంటూ ఇసుకలో చతికిలపడ్డది షీలా. ముగ్గురూ కూర్చున్నారు.

"నిన్న జరిగినదానికి నేను చాలా విచారిస్తున్నాను మాధవ్. వివరంగా చెప్పి క్షమాపణ అర్థించడానికి వచ్చాను" అన్నాడు సిగిరెట్ పొగ వదలుతూ అగర్వాల్.

"నాకు చెప్పకుండా వారితో ఇక్కడకు వచ్చింది షీలా. సంగతి తెలుసుకొని నేను ఆమెను చీవాట్లు పెట్టాను. నేనే ఒకసారి నిన్ను కలుద్దామని అనుకొంటున్నాను. షీలా ప్రాణాలు కాపాడినందుకు కృతజ్ఞతగా..." సందేహంగా ఆగి, గట్టిగా సిగిరెట్టు పొగలాగి, పీకను నదిలోకి విసిరేశాడు.

"బర్మాలో నా స్నేహితులున్నారు. వారి యింటికి పోయింది షీలా. అక్కడినుంచి వచ్చే సమయంలో ఇద్దరు వ్యక్తులు ఆమెకు తారసిల్లారు. వారిద్దరూ మొన్న ప్రమాదంలో మరణించారనుకో. వారితో పరిచయం చేసుకొని మాట్లాడింది. అటువంటివారితో

పరిచయం వద్దని ఎన్నిసార్లు చెప్పినా వినిపించుకోదు. దాని ఫలితంగా పోలీసులు షీలాను ప్రశ్నిస్తున్నారు. ఆ ప్యాకెట్టులో వజ్రాలున్నాయి. అవి బర్మా ప్రభుత్వానికి చెందినవి. కూలిపోయిన ప్లేనులోనూ, ఆ పరిసరాలలోనూ ఆ ప్యాకెట్టు కనపడలేదు."

"నిన్న వచ్చినవాళ్ళు బహుశా ఆ గాంగ్ కు సంబంధించినవారై వుంటారు. ఆ పాకెట్టుకోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. షీలాను నమ్మించి, మా సొంత బోటులోనే బయల్దేరివచ్చారు" అని ఊపిరి పీల్చుకోవటానికి ఆగాడు అగర్వాల్.

"ఏం చేసినా ఏదో ఒక పాపం ఎదురవుతోంది" అంది షీలా దీర్ఘంగా నిట్టూరుస్తూ.

మాధవ్ ఆలోచనలో పడ్డాడు. 'వీళ్ళు చెప్పేది ఎంతవరకు నమ్మవచ్చు?'

"నిన్న వాళ్ళేమని చెప్పారు?" షీలాను ప్రశ్నించాడు.

"నిన్ను కలుసుకుని మాటాడాలనీ, ఇక్కడకు రావటానికి దారి తెలియదు గనుక నన్ను లిఫ్టు ఇవ్వమనీ అడిగారు."

"షీలా! అటువంటివాళ్ళను కన్నెత్తిగూడా చూడవద్దని నీకనేకసార్లు చెప్పాను. నా మాట లక్ష్యపెట్టవు!" డ్రామా డైలాగులు చెప్పినట్లు చెప్పాడు అగర్వాల్.

"అయిపోయిన దానిని గురించి బాధపడి రభస చేసుకోవటం ఎందుకులెండి" అన్నాడు మాధవ్ ఏదో ఒకటి అనకపోతే వాళ్ళిద్దరూ అలాగే కంటిన్యూ చేస్తారేమో అన్న భయంతో.

షీలా మాధవ్ వంక చూసి ఒక చిరునవ్వు విసిరింది, కృతజ్ఞతగా.

తన తండ్రికి తెలియకుండా ఆ గాంగ్ లో పనిచేస్తుందా? అన్న అనుమానం కలిగింది మాధవ్ కు.

"నేను ఇక్కడికి రావటంలో ఇంకొక ముఖ్యమయిన కారణం వుంది మాధవ్" అన్నాడు అగర్వాల్.

మళ్ళీ ఏదో పెటకం పెట్టటానికి చూస్తున్నాడని పసికట్టాడు మాధవ్. ఏదో ఒకటి సభ్యత అంటూ వుంది కనుక "చెప్పండి!" అన్నాడు.

"నా నివాసం బాంబేలో. మా ఇల్లు ఒకటి కోస్గిల్ లో వుంది. కొంతకాలం గాలి మార్పుకోసం ఇక్కడికి వచ్చాము. నిన్న షీలాతో కలిసిన వ్యక్తులను చూసి వారికి చివాట్లు పెట్టాను. వారు కూడా కోస్గిల్ లోనే మకాం పెట్టారు. ఈ గొడవ ఏదో తేలిపోయేదాకా నాకు నిద్రపట్టదు అందుకు నువ్వు సహాయం చెయ్యాలి" అన్నాడు అగర్వాల్.

"వంటరిగా అడవిలో నివసించేవాణ్ణి నావల్ల ఏమవుతుంది" మాధవ్ అన్నాడు.

"ఆ వజ్రాల వెల యెంతో తెలుసా?" అగర్వాల్ ప్రశ్నించాడు.

తెలియదన్నట్లు తల అడ్డం తిప్పాడు మాధవ్.

"దగ్గిర దగ్గిరగా నూటయాభై కోట్లు వుంటుంది."

ఆశ్చర్యంతో ఈలవేశాడు మాధవ్. ఇంతమంది దానికోసం తన్నుకు చావటానికి కారణం అదన్నమాట.

"మాధవ్! నా దేశ భవిష్యత్తుమీద నాకు నమ్మకం వుంది. బర్మా ప్రభుత్వానికి ఆ వజ్రాలను అప్పగించ గలిగితే వారికీ మనకూ వున్న సంబంధాలు మెరుగుపడతాయి. పోలీసులు ఈ విషయంలో తగినశ్రద్ధ తీసుకుంటున్నారని నేననుకోను. నీకు ఈ అడవులన్నీ తెలుసు. నువ్వే ఆ వజ్రాలను వెతకి అప్పగించు. నీకు ఎంత డబ్బు కావాలన్నా నేనిస్తాను. ఇది మన పరువు ప్రతిష్టలకు సంబంధించిన విషయం" ఆవేశంగా అన్నాడు అగర్వాల్.

నిశ్శబ్దంగా కళ్ళప్పగించి చూడటంకన్న ఇంకేమీ చేయలేక పోయాడు మాధవ్. అగర్వాల్ ను గురించి తను విన్నవన్నీ నిజమా? అబద్ధమా? ఏదీ నిర్ణయించుకోలేని విచిత్ర పరిస్థితిలో చిక్కుకున్నాడు.

"ఏం మాధవ్? దేశంకోసం ఈ పని చేయలేవా?" రెట్టించాడు అగర్వల్.

"ఇంతకూ ఆ పాకెట్టు విమానంలోనే వుందని నమ్మకమేమిటి? బర్మాలోనే వదలివచ్చి వుండవచ్చుగదా?" ఎదురు ప్రశ్న వేశాడు మాధవ్.

"నేను గమనిస్తూనే వున్నాను. ఒక వ్యక్తి బ్రీఫ్ కేస్ ను గట్టిగా పట్టుకొని కూర్చున్నాడు. మాటిమాటికి దానివంకే చూస్తున్నాడు. అందులో ఏమీ లేకపోతే ఎందుకు అలా చేస్తాడు?" అందించింది షీలా.

"భారతదేశంలో దిగంగానే పోలీసులు పట్టుకోవచ్చన్న భయంతో బయటకు విసిరేసి వుండవచ్చుకదా? పోలీసుల ఎంక్వయిరీలో రెండవ బ్రీఫ్ కేస్ ఖాళీగా వుంది. అంటే ప్రమాదం జరగటానికి ముందే ఆ పాకెట్టును పడేసి వుండాలి" అన్నాడు అగర్వాల్.

అగర్వాల్ సిగిరెట్టు పెట్టెలోంచి యింకో సిగిరెట్టు తీసి వెలిగించు కున్నాడు మాధవ్. అయిదు నిముషాలపాటు, సిగిరెట్టు పీలుస్తూ దీర్ఘాలోచనలో పడ్డాడు.

"సరే మీరింతగా చెపుతున్నారు కాబట్టి నాకు చేతనయింది నేను చేస్తాను" చివరికి అన్నాడు.

అగర్వాల్ ముఖం చింపి చేటంత అయింది. లేచి భుజం తట్టాడు. "వెరీగుడ్ మాధవ్" అంటూ కోస్గిల్ లో తన యింటి అడ్రస్ చెప్పి ఏం కావాలన్నా వచ్చి తనను కలుసుకోమని చెప్పాడు.

గుడ్ బై చెప్పి తండ్రీ కూతుళ్ళిద్దరూ బోట్ కేసి బయలుదేరారు. పోతూపోతూ మాధవ్ కేసి ఒక చిరునవ్వు విసిరిపోయింది షీలా.

ఒక కన్ను మూసుకొని తెరిచినట్లు అనుమానం కలిగింది మాధవ్ కు.

తండ్రీ కూతుళ్ళు ఒకరికి తెలియకుండా ఒకరు ఏదో ప్లానులో నిమగ్నమై ఉన్నారా? మోటారుబోటు కనుమరుగుగయ్యేదాకా వుండి కాబిన్ వైపు బయలు దేరాడు.

*　　*　　*

'గత పదిహేను రోజులనుంచీ వెదికినా ఫలితం కనుపించలేదు. కాబిన్ దగ్గిరకు ఎవరయినా వస్తారేమోనని, అంతగా కాన్సంట్రేట్ చేసి గాలించలేదు. యిప్పటికి కొన్ని కారెక్టర్లు కథలో ప్రవేశించాయి గదా! యిక నిశ్చింతగా అడవిలో తిరగవచ్చు. ఆ వజ్రాలకోసం తనవెనుకే వస్తారు ఎవరయినా' అని ఆలోచించుకుంటూ నడవసాగాడు మాధవ్.

చెట్లలో ప్రవేశించి, శృంగానది ముఖద్వారంవైపు పయనించసాగాడు అక్కడవున్న ఒక లోయలో ఎయిర్ ఇండియా విమానం కూలి పోయింది. మొదట అక్కడ చూచి, తరువాత మిగిలిన ప్రదేశాలు వెతక వచ్చు ననుకొన్నాడు.

సూర్యుడు అస్తమించే సమయానికి ప్రమాద స్థలాన్ని సమీపించాడు మాధవ్. వెంటనేపోయి వెతుక దల్చుకోలేదు. గాంగ్ కు సంబంధించిన వారెవరైనా అక్కడ వుండవచ్చు.

ఒక చెట్టుక్రింద టార్పాలిన్ వేసుకొని విశ్రమించాడు. ఈ రాత్రికి అక్కడే గడిపి ఉదయాన్నే తిరిగి వెతుకలాట మొదలుపెడదామని నిశ్చయించుకున్నాడు.

నిన్నటినుంచీ జరిగిన విషయాలు మనసులో కదలాడసాగినాయి.

షీలా, ఆమె స్నేహితుల రాకతో వారు మెయిన్ గాంగ్ కు సంబంధించినవారని తేలిపోయింది. వారి విషయంలో జాగ్రత్తగా వుండాలి. ఆ స్పైడర్ గాడు ఎప్పటికయినా తనని చంపటానికి ప్రయత్నించవచ్చు. షీలా తండ్రి పాత్రేమిటి? సిన్సియర్ గా ప్రభుత్వానికి తోడ్పడుతున్నాడా? లేక తనుకూడా వజ్రాలకోసం పాకులాడుతున్నాడా? రెండు వైపులనుంచీ తన చూపులతో జయించి, కార్యం సాధించాలని ఆత్రుత పడుతున్నది షీలా! ఎవరివైపు పని చేస్తున్నది? ఒక సంగతిమాత్రం నిశ్చయంగా చెప్పవచ్చు.

ఒకరు తనదగ్గిరే ఆ వజ్రాలున్నట్లు అనుమానించి వెంటాడు తున్నారు. ఒకరు వెతికి పెట్టమని పాకులాడుతున్నారు.

ఏమయినా కొంచెం వెనకా ముందూ చూసుకొని ప్రయాణించడం శ్రేయస్కరం. ఏ చెట్టుచాటు నుంచయినా, ప్రమాదం పరుగెత్తుకు రావచ్చు.

"గడ్డి వామి లో సూదిని వెదకటం" అన్న సామెత గుర్తుకువచ్చి నవ్వుకున్నాడు మాధవ్. యింత పెద్ద అరణ్యంలో, ఆ చిన్న పాకెట్టు వెతకటం సాధ్యమా?

దారిలో చెట్లకు వున్న కొన్ని పళ్ళు కోసుకుంటూ వచ్చాడు. తీరికగా టార్పాలిన్ మీద కూర్చుని అవి తినసాగాడు.

అరణ్యంలో వున్నంతకాలం తనకు శత్రువుల బాధలేదు. ఉడత పిల్ల కూడా రాబోయే ప్రమాదాన్ని ముందుగానే సూచిస్తుంది!

శృంగానదిలో వుండే అడవి బాతుల్ని వేటాడటానికి ప్రభుత్వం పర్మిషనిస్తుంది. ఈ పాటికి వేటగాళ్ళు గుంపులు గుంపులుగా ఈ ప్రాంతాలకు రావల్సింది, యింకా రాలేదు. కారణమేమిటో? అనుకుంటూ నిద్రపోవటానికి ప్రయత్నించసాగాడు మాధవ్.

కాని నిద్ర అతనికి దూరమైంది. ఏదో తెలియని ఆతృత అతన్ని వేధించసాగింది. చివరకు వెళ్ళి, ప్రమాద స్థలాన్ని పరిశీలించుదామని నిశ్చయించుకున్నాడు. గాంగ్ మనుషులు అక్కడ ఎదురుపడితే కసిదీర నాలుగు దెబ్బలు వేసి పారిపోవచ్చు.

బూటులోవున్న కత్తిని సరిచేసుకొన్నాడు. టార్పాలిన్లో పెట్టి తెచ్చిన సింగిల్ యాక్షన్ .22రైఫిల్ని తీసుకొని లోడ్స్ చెక్ చేశాడు. మాగజైన్ నిండా గుళ్ళు వున్నాయి.

అప్పటికి రాత్రి అరణ్యాన్ని చీకట్లలో ముడవటం ప్రారంభించింది. పక్షులన్నీ గూళ్ళల్లో ముడుచుకు పరున్నాయి. గుడ్లగూబలు, గబ్బిలాలు బయటికి వచ్చి యధేచ్ఛగా విహరించసాగాయి.

నెమ్మదిగా దారి చూసుకుంటూ విమానం కూలిపోయిన లోయవైపు ప్రయాణించసాగాడు మాధవ్.

ఆకాశాన్నంటేటట్లు ఎత్తయినచెట్లు లోయచుట్టూ పెరిగివున్నాయి. ఆ చీకట్లలో జుట్టు విరబోసుకొన్న దయ్యాలలాగా అగుపించసాగాయి. కొండలమీద నుంచి దొర్లి వచ్చిన పెద్ద పెద్ద రాతిబండలు, వాటిచుట్టూ పెరిగిన ముళ్ళపొదలు, వాటిలో ఇళ్ళు కట్టుకొన్న సర్పజాతి. అడవిలో నడవటం తెలియని వాడి ప్రాణాలు హరించేందుకు సిద్ధంగా ఉన్నాయి. మాధవ్ కి యివన్నీ సుపరిచితాలే. గత పదిహేను రోజులుగా ఈ ప్రాంతాలకి బాగా అలవాటు పడటంవల్ల, తడుముకోకుండా ముందుకు పోగలిగాడు.

తన దారిలో మనుషులు వున్నారని తెలుసుకొని, హఠాత్తుగా నిలబడిపోయాడు మాధవ్. చుట్టూ కలియచూశాడు. ఏ విధమైన అలికిడీ వినిపించలేదు. మరి తను ఎందుకాగిపోయాడు?

గాలిలో సన్నగా వచ్చే పొగ వాసనను అతని నాశిక ఆకర్షించి సిగ్నల్ పంపింది. మరొక్కసారి వాసన చూచి, తన ఇంద్రియాలు తెలిపిన వార్నింగ్ నిజమేనని గ్రహించాడు. అడవిలో పొగ వూరికే రాదు. కార్చిచ్చువల్లనైనా వస్తుంది-మనష్యులు నిప్పు వేస్తేనన్నా వస్తుంది. నెమ్మదిగా పొగవాసన వస్తున్నవైపు అడుగులు వేశాడు.

గాంగ్ యిక్కడ స్థావరం ఏర్పాటు చేసుకుందా? ఎవరయినా వేటగాళ్ళు వచ్చి కాంప్ వేశారా? మాధవ్ పొగ వస్తున్న చోటును సమీపించిన కొద్దీ మాటలు అస్పష్టంగా వినిపించసాగాయి. గాలి వారి

కాంప్ నుంచి మాధవ్ వైపు వీయసాగింది. వారి మాటలు క్రమక్రమంగా పెద్దగా విన్పడసాగాయి.

వేటకుక్కలేమయినా వుంటాయేమో నని భయపడ్డాడు. కాని అటువంటిదేమీ జరుగలేదు.

నిశ్శబ్దంగా పొదలను తప్పించుకొని కాంప్ ను సమీపించాడు. ఒక చెట్టుచాటున నిలబడి ఎదురుగావున్న ఖాళీస్థలంలోకి చూశాడు.

ఒక మిడిల్ ఏజ్ వ్యక్తి, ఇద్దరు ఆడవాళ్ళు కాంప్ ఫైర్ ముందు కూర్చునివున్నారు. వేటకు అనువుగా దుస్తులు ధరించివున్నారు. ఒకపక్కన రెండు టెంట్లు బిగించి వున్నాయి.

ముగ్గురూ కాఫీ తాగుతూ సరదాగా కబుర్లు చెప్పుకుంటున్నారు. వారి భాష మాధవ్ కు అర్థం కాలేదు. వారి నెప్పుడూ చూసిన గుర్తు కూడా లేదు. మాధవ్ మెదడు సందేహాలతో గిర్రున తిరగసాగింది. వీరెవరూ? వీరు మాట్లాడేభాష ఏమిటి? ఇంకెవరైనా చుట్టుపట్ల కనుపించకుండా వున్నారా?

ఇద్దరు యువతులు చాలా అందంగా వున్నారు. ఒక యువతి మరీ కళ్ళు చెదరగొట్టేలా వుంది. ఆకుపచ్చని పాంటు, అదే రంగు స్వెట్టరు ధరించివుంది. బాబ్ చేసిన జుట్టు కాంప్ ఫైర్ వెలుగులో బంగారంలా మెరిసిపోతూ వుంది. ఎటువంటి మగవాడ్నైనా ఛాలెంజి చేసే ఆ ఎత్తయిన వక్షోజాలు....

రెండవ స్త్రీ చాలా చిన్నపిల్ల. ఇంకా ఎదగవలసిన అవసరం ఎంతైనా వుందని అనుకున్నాడు మాధవ్. అతని దృష్టిమాత్రం మొదటి స్త్రీని వదలిరావటం లేదు. ఆ వ్యక్తి కాంప్ ఫైర్ లోంచి కాఫీ పాట్ తీసి కప్పులోకి వంచుతున్నాడు. అతని వేషం చూస్తుంటే, టిబెట్ నుంచి వచ్చినట్లు కనిపిస్తున్నాడు. బహుశా వీరికి గైడ్ కావచ్చు ఇంకెవరైనా ఉన్నారా?

ఐదు నిముషాలపాటు ఆ పరిసరాల్ని గమనిస్తూ, వారి మాటలు అర్ధం చేసుకోవటానికి ప్రయత్నిస్తూ గడిపాడు మాధవ్.

'గాంగ్ కు సంబంధించిన వారా? నన్ను ఆకర్షించటానికేమైనా ఆ స్త్రీ లను వుపయోగించుకున్నారా!" కొద్దిసేపు తర్జన భర్జనలు చేసుకొన్నాడు.

ఏమైనా ఆ స్వెట్టరు యువతి మాత్రం మనసును మత్తెక్కిస్తోంది. ఆకర్షణను తప్పుకోలేక, తెగించి చెట్టుచాటునుంచి వెలుపలికి వచ్చాడు మాధవ్. అందరు వేటగాళ్ళు ప్రవేశించినట్లే, బూట్లచప్పుడు చేస్తూ "హల్లో!" అంటూ వారి కాంప్ స్థలంలోకి ప్రవేశించాడు.

ఉలిక్కిపడి చూశారు ముగ్గురూ.

ఆ వ్యక్తి నెమ్మదిగాలేచి నిలబడ్డాడు. అతని చేతి కందుబాటులో ఒక రైఫిల్ నేలమీద వుంది. కాని అది అందుకునేందుకెటువంటి ప్రయత్నమూ చేయలేదతను.

ఐదు అడుగుల మూడంగుళాలు వుంటాడేమో! కాని దృఢంగా కనిపిస్తున్నాడు. చెయ్యికలిపితే అతనిముందు నిలవటం కష్టమని గ్రహించాడు మాధవ్.

"హల్లో!" అన్నదా స్వెట్టర్ యువతి. అందరికన్నా ముందు ఆశ్చర్యంనుంచి తేరుకొని-

"అరణ్యంలో దారి తప్పారా?" అని ప్రశ్నించింది.

"దారి తప్పలేదనుకోండి, వేటాడుతూ ఈ దిక్కుగా వచ్చాను. మీ కాంపుకు కొంచెం గాలి వాలున విశ్రమిస్తున్నాను. మీ కాంప్ ఫైర్ పొగ చూసి ఇలా వచ్చాను" అన్నాడు మాధవ్.

కల్లాకపటంలేని చిరునవ్వు మాధవ్ వైపు విసిరిందామె.

'గాంగ్ మనిషయితే మాత్రం ఏమి? ఆ చిరునవ్వు చూస్తూ కాలం గడిపేయవచ్చు' అనుకున్నాడు మాధవ్ మనసులో. ఆ వ్యక్తి తనకేం పట్టనట్లు దిక్కులు చూస్తున్నాడు. రెండవ స్త్రీ అసలు మాట్లాడలేదు.

"నిలబడే వున్నారేం! కూర్చోండి" అంటూ తను కూర్చున్న దుంగ మీద చోటు చూపించింది. మాధవ్ కూర్చున్నాడు. పరిస్థితి ఇందాకటి కంటే కొంచెం మెరుగు అనుకున్నాడు.

"నా పేరు జూలియా! ఈమె నా గర్ల్ ఫ్రెండ్ హోషియా. అతను మా గైడ్ బుద్దూ" అంటూ పరిచయం చేసింది.

జవాబుగా వారివంక చూసి చిరునవ్వు నవ్వాడు మాధవ్.

"నా పేరు మాధవ్" అంటూ తన పేరు చెప్పటంలో పొరపాటు లేదనుకున్నాడు. 'వీళ్ళు గాంగ్ కు సంబంధించిన వారైతే తన గమనాన్ని పసిగట్టి ఇక్కడ కాపేసివుంటారు. నిజంగా వేటకొచ్చిన వారైతే ఇబ్బందే లేదు.'

బుద్ధూ కాఫీ ఒక కప్పులో పోసి మాధవ్ చేతికిచ్చాడు థాంక్స్ చెబుతూ కాఫీ త్రాగాడు మాధవ్.

"మేమిద్దరం సిక్కింనుంచి వచ్చాము. మీ దేశాన్నిచూసి, సరదాగా అడవిబాతుల వేటకు ఇక్కడకు వచ్చాము" అన్నది జూలియా.

"బుద్ధూ మాకు గైడే కాకుండా కొంచెం దూరపు బంధువు. ఇక్కడ బాతులు ఎక్కువగా వుంటాయని, చెప్పి తీసుకువచ్చాడు."

నిజమేనని తలవూపాడు మాధవ్. ఇంతవరకూ వాళ్ళ స్టోరీ పర్ ఫెక్ట్ గా వుంది. "నువ్వు ఇక్కడే నివసిస్తూ వుంటావా మాధవ్!" ప్రశ్నించింది జూలియా.

ఏకవచన ప్రయోగాన్ని మాధవ్ గమనించక పోలేదు.

"ఈ శృంగా నదికి దిగువలో వుంటాను" అన్నాడు సరియైన స్థలం చెప్పకుండా.

బుద్ధూ సామాన్లన్నీ సర్ది చెట్టుకానుకొని సిగార్ వెలిగించాడు. హోషియా లేచి నాలుగు చితుకులు మంటలో వేసింది. చల్లటిగాలి తెరలు తెరలుగా వీయటం ప్రారంభించింది. మాధవ్ లేచి నుంచున్నాడు, బయలుదేరటానికి సిద్ధంగా.

"అప్పుడే వెళ్ళిపోతావా?" అన్నది జూలియా.

"రేపు మళ్ళీ చాలాదూరం తిరగాలి. వెళ్ళి విశ్రాంతి తీసుకోకపోతే ఎలా?" కాంప్ ఫైర్ లో వింతగా మెరుస్తున్న ఆమె ముఖాన్ని చూస్తూ అన్నాడు మాధవ్.

"నువ్వుకూడా బాతుల్నే వేటాడటానికి వచ్చావా?" అనుమానంగా అడిగింది.

మాధవ్ ఒక్కక్షణం తటాపటాయించాడు.

"లేదు, నేను యింకో వస్తువుకోసం వేటాడుతున్నాను" బుద్ధూ వైపు చూస్తూ సమాధానమిచ్చాడు. బుద్ధూలో ఏమీ చలనం లేదు. అతని దృష్టంతా సిగార్ కాల్చటంపై లగ్నమయి వుంది.

"బహుశా ఆడవాళ్ళకోసం వేటాడుతూ వుండి వుంటావు!" అంటూ పగలబడి నవ్వింది జూలియా.

"అంతే కావచ్చు! ఒక విలువైన వస్తువు ఈ అరణ్యంలో పడిపోయింది, దానికోసం...."

బుద్ధూ వులిక్కిపడటం కనుచివరలనుంచి గమనించాడు మాధవ్. జూలియా చెక్కు చెదరలేదు. కనీసం కళ్ళుగూడా ఆర్పలేదు. మాధవ్ అనుమానం మరొక మెట్టు ఎక్కింది.

"గమ్మత్తుగా వుందే! ఏమిటది?" అడిగింది జూలియా.

"తర్వాత ఎప్పుడైనా చెపుతాను. నాట్ నౌ!" అంటూ బయలుదేరాడు మాధవ్. వాళ్ళ ఆదరానికి కృతజ్ఞతలు చెప్పాడు. "వీలైతే మళ్ళీ ఎప్పుడైనా కలుస్తాను" అంటూ వదలి చెట్లవైపు వెళ్ళిపోయాడు.

వాళ్ళిద్దరి కోసం కాకపోయినా, జూలియాను చూడటానికైనా మరోసారి అక్కడికి వెళ్ళాలని నిశ్చయించుకున్నాడు మాధవ్.

ఆ బుద్ధూను ఒక కంట కనిపెట్టి వుండాలి అని నిశ్చయించు కున్నాడు. బహుశా రేపు సాయంత్రంలోపల అన్ని విషయాలు ఒక కొలిక్కిరావచ్చు ననుకున్నాడు.

*   *   *

తూర్పుదిక్కున వెలుగు కనబడగానే లేచాడు మాధవ్. తన క్యాబిన్ నుంచి తెచ్చుకున్న ఆహారంతిని, టార్పాలిన్ మడిచి పొదలో పెట్టాడు. అంతవరకూ వెలుగుతున్న కాంప్ ఫైర్ ను ఆర్పి యిసుకతో కప్పాడు. రైఫిల్ పట్టుకొని లోయలోకి దిగసాగాడు. విమానం తూర్పు

నుంచి వస్తున్నది కనుక అదిపడిన చోటునుంచి ఆ దిక్కుకు వెతుక్కుంటూపోతే ఫలితమేమైనా కనుపించవచ్చు.

క్రమంగా చెట్లు పలచబడ సాగినవి. మోకాళ్ళ ఎత్తుగడ్డి చిన్న చిన్న పొదలు తప్ప చెప్పుకోతగ్గ అడ్డంకేమీ లేదు. పరిసరాల్ని చూపులతో పరికిస్తూ ముందుకుసాగాడు.

విమానంలో నుంచి ఏదైనా కింద పడవేసేటప్పుడు, క్లియరింగ్ ఏరియా చూసుకొని వేస్తారు. లేకపోతే ఏ చెట్లు పుట్టలలోనో పడటానికి అవకాశం వుందికదా! ఈ పాకెట్టు గూడా ఖాళీస్థలంలో పడవేసి ఉండవచ్చు. ఒక గంట వెతికినా మాధవ్ కు ఏమీ కనిపించలేదు.

యింకో గంట గడిచింది. ఫలితం లేకపోయింది.

అకస్మాత్తుగా నేలమీద టైర్ల గుర్తులు కనుపించాయి.

ఈ కొండల్లోకి టైర్ల గుర్తులెలావచ్చాయి? కార్లుగాని, జీపులుగాని రావటానికి అవకాశంలేదే!

చాలా పాతబడి వున్నాయా గుర్తులు. వాటివెంటే నడుస్తూ జాగ్రత్తగా పరిక్షించుకొంటూ పోయాడు మాధవ్.

ఒక వందగజాలు పోయి, తిరిగి మాయమయ్యాయా టైరు జాడలు. ఆ పైన ఎంత వెతికినా ఏమీ కనుపించలేదు. విసుగుపుట్టి వెను దిరిగాడు, కాని ఆ టైరుగుర్తులు అతని మనస్సులో బలంగా నాటుకు

పోయాయి. వచ్చిన దారినే ప్రయాణించి, ఒక చెట్టుక్రింద చతికిల పడ్డాడు - లోపలకు పోయినకొద్దీ కాంప్లికేటెడ్ అవుతున్నదే యీ కేసు అనుకొంటూ.

దిక్కులుచూస్తూ కూర్చున్న మాధవ్ కు, కొంచెం దూరంలో జూలియా వస్తుండటం కనుపించింది. ఆమె చేతిలో ఒక రైఫిల్ వుంది. ఎర్రటిపాంటు, అదేరంగు స్వెట్టర్ వేసుకొంది. బిగుపైన ఆ దుస్తులలో ఆమె శరీరం ఒంపులు పిచ్చెక్కించేలా వున్నాయి. దగ్గిరకురానిచ్చి "ఆగు!" అని గట్టిగా అరిచాడు మాధవ్.

ఎగిరి పక్కకు దూకింది. ఖంగారుగా నలువైపులా చూసింది. పొద చాటునవున్న మాధవ్ ను గమనించి, దీర్ఘంగా నిట్టూర్చింది.

"ఆడవాళ్ళను బెదరకొట్టటంలో బాగా అనుభవమున్నట్లుందే?" అంటూ మాధవ్ ను సమీపించింది.

మాధవ్ గట్టిగా నవ్వాడు. జూలియా చాలా సరదాగా మాట్లాడుతున్నది.

"సిగిరెట్టున్నదా మాధవ్!" అని అడిగింది - యిచ్చాడు. వెలిగించుకొని అతన్ని ఆనుకొని కూర్చున్నది.

'మిగతా యిద్దరు ఏమయ్యారు? విడివిడిగా వజ్రాల కోసం వెతుకు తున్నారా?' చిన్న సందేహం మాధవ్ మెదడులో ఒకమూల చోటు చేసుకొంది.

"బాతుల్ని వేటాడటానికి పొద్దున్నే పోవాల్సింది. యిక్కడేం దొరుకు తాయి?" అన్నాడు. ఒక్కనిముషం సమాధానం చెప్పలేదు జూలియా.

"నేను యిక్కడికి బాతుల్ని వేటాడటానికి రాలేదు మాధవ్!" అన్నది ప్రశాంతంగా.

ఆమె చేతిలోని రైఫిల్ అతనివైపు గురి పెట్టబడివుంది.

మాధవ్ వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. చెమటలు పట్టసాగాయి. ఆమె కాల్చదలుచుకుంటే నిముషంలో తన పని అవుటు. బారెల్ ను ఒక్క అంగుళం పైకెత్తితే చాలు. చుట్టుపక్కల ఎవ్వరూ లేరు. చంపి ఏ గోతిలో పడవేసినా అడిగేవాళ్ళులేరు. అతని రైఫిల్ కొంచెందూరంలో వుంది. బూటులో వున్న కత్తిని అందుకోవటానికైనా వంగి కాలువైపు చేయిజాచాలి. ఆమె యీ లోపునే.........

ఆమెను గురించి తను వేసుకొన్న అంచనాలు రైటు కావాలని భగవంతుణ్ని ప్రార్థించసాగాడు మాధవ్.

మాధవ్ ఆలోచనలు పసికట్టింది జూలియా. నవ్వుతూ రైఫిల్ పక్కన పెట్టింది. మాధవ్ వైపు తిరిగింది.

"ఏమయ్యింది మాధవ్? ఖంగారు పడుతున్నావెందుకు?" అని ప్రశ్నించింది.

అంతవరకూ గొంతుకలో కొట్టుకుంటున్న మాధవ్ గుండెకాయ తిరిగి యధాస్థానాన్ని చేరుకుంది.

"ఏంలేదు జూలియా! అడవుల్లో తిరిగేవాణ్ని కదూ! యితరులను చూస్తే కొంచెం ఖంగారెక్కువ. అంతే" సర్ది చెప్పాడు.

"కనీసం నాతోనైనా భయంలేకుండా ఫ్రెండ్లీగా వుండలేవా?" అంటూ వళ్ళు విరచుకొంది. స్వెట్టర్ లో నుంచి ఎత్తయిన కొండలు మాధవ్ హృదయాన్ని గిలిగింతలు పెట్టనారంభించాయి. దూరంగా పక్షులు శ్రవ్యానందకరంగా సంగీతాన్ని వినిపిస్తున్నాయి. ఒక వడ్రంగిపిట్ట పురుగుల కోసం లయబద్ధంగా చెట్టును కొడుతుంది. కొండలమీద నుంచి పిల్లవాయువులు అల్ల నల్లన వీచసాగాయి. ఏదైనా ప్రమాదం వస్తే యివన్నీ మారిపోయి హెచ్చరిక అంద చేస్తాయికదా అనుకున్నాడు మాధవ్.

"నువ్వు వెతుకుతున్నది దేన్నిగురించి మాధవ్?" నెమ్మదిగా అడిగింది జూలియా.

మాధవ్ సమాధానం చెప్పలేదు.

"యిందాక కొండ లోయలో ఏదో వెతుకుతున్నావు. ఫారెస్ట్ డిపార్టు మెంటులో పని చేస్తున్నావా?" రెట్టించి అడిగింది.

"లేదు. నేను సివిలియన్నే. వూరికే సరదాగా వేటకోసం వచ్చాను" అతికీ అతకని సమాధానమిచ్చాడు.

"అయితే తనని చూసి వెనకాలే వచ్చిందన్నమాట" మాధవ్ పాంటు షర్టు చుట్టూవున్న పొదలరంగులో వున్నాయి. బహుశా అతను పొదలలోకి తప్పుకోగానే, చూడలేక తనే ఖాళీ జాగాలోకి వచ్చింది.

"నీకు అబద్ధం చెప్పటం యిష్టంలేదు జూలియా! నేను దేన్ని గురించి వెతుకుతున్నానో చెప్పకూడదు" హానెస్ట్ గా అన్నాడు.

"బహుశా సీక్రెట్ సర్వీస్ కు చెందినవాడవై వుంటావు. ఎంత ఎక్సైట్ మెంట్ గా వుంటుందో!" గుండ్రటికళ్ళను చక్రాల్లా త్రిప్పుతూ, బుగ్గమీద వేలుంచుకొని అడిగింది.

మాధవ్ మాటలు తడబడ్డాయి "పోను పోను నీకే తెలుస్తుందిలే" అని మాత్రం అనగలిగాడు.

"నాకు అడవుల్లో తిరగడమంటే ఎంతో యిష్టం. అందుకనే ఇక్కడికి వచ్చాను. ఒంటరిగా వస్తే ప్రమాదమని, నా స్నేహితురాలిని, దూరపు బంధువునూ వెంట తెచ్చుకున్నాను" ఒక్కక్షణం సూటిగా మాధవ్ కళ్ళలోకి చూసింది.

"నన్ను నమ్ముతావా మాధవ్"

పొడుగ్గా బలంగా వున్న ఆమె తొడమీద చెయ్యివేశాడు. "నువ్వేం చెప్పినా నమ్ముతాను" అంటూ తొడమీదనుంచి మెల్లగా చెయ్యితీసి ఆమె నడుముచుట్టూ చుట్టాడు. ఆమె దూరంగా జరగలేదు. సరికదా

అతనికి దగ్గిరగా జరిగింది. ఆమె జుట్టునుంచి ఒక విధమైన సువాసనలు మాధవ్ ను మత్తెక్కించాయి. రెండవచేత్తో ఎత్తి వడిలోకి లాక్కున్నాడు. అతని స్పర్శతో వింతగా ఒణికింది ఆమె శరీరం. ఆమె కళ్ళు బరువుగా మూసుకుపోయాయి. ఎర్రటి పెదవులు కొద్దిగా విచ్చుకుని, అతన్ని ఆహ్వానించాయి.

ఆమె చేతులు అతని మెడచుట్టూ చుట్టుకున్నాయి.

"ఏయ్ ఏం పనిది?" అని మెల్లగా నవ్వింది అతని చెవిలో.

తన పెదవులతో నవ్వుతున్న ఆమె నోటిని మూసివేశాడు మాధవ్. ఏదో నిర్వచించలేని అనుభూతి అతని శరీరమంతా పాకిపోయింది. మెత్తటి ఆ పెదవుల్ని నలిపి పారేశాడు. స్వెట్టర్లోనుంచి ఆమె వక్షోజాలు మాధవ్ గుండెలకు పొడుస్తున్నాయి ఆత్రంగా...

లోయలోనుంచి వచ్చిన తుపాకి మోతతో ఆ ప్రదేశమంతా దద్దరిల్లి పోయింది.

ఉలిక్కిపడ్డాడు మాధవ్.

"ఛ!ఛ! ఏం మనుషులు?" అంటూ గొణుక్కుంటూ లేవటానికి ప్రయత్నించింది జూలియా.

"నువ్వు వెళ్ళవల్సిందేనా?" మాధవ్ అడిగాడు.

"తప్పదు మాధవ్...నన్ను మత్తెక్కిస్తున్నావ్...సుమా!" అతని తలలో వేళ్ళు జొనిపి నిమురుతూ అన్నది జూలియా.

"నేనుమాత్రం తెలివిగా కూర్చున్నానా?" ప్రశ్నించాడు మాధవ్.

ఒక్కసారి గట్టిగా కౌగిలించుకుంది. "మనకు ఏమిటి ఈ అనుబంధం" అంటూ ఉద్రేకంతో మాధవ్ ముఖం నిండా ముద్దులు కురిపించింది.

"వొ...హో...య్" అంటూ నిశ్శబ్దాన్ని భగ్నం చేస్తూ కేక వినవచ్చింది. పక్షులన్నీ లేచిపోయాయి. జూలియా కూడా లేచి నిల్చుంది. జుట్టు సరిచేసుకుని తడిగావున్న ముఖాన్ని తుడుచు కుంది.

"హోషియా కేకేస్తోంది" అంటూ కిందున్న రైఫిల్ అందుకుంది.

"అయితే నేను ఇక్కడనుంచి తప్పుకుంటాను" అన్నాడు మాధవ్ తనుగూడా లేచి నిల్చుని.

"మాధవ్! ఇవాళ మధ్యాహ్నం వేటకనిచెప్పి వస్తాను. అప్పుడు వాళ్ళేవరూ నాతోరారు ఏమంటావ్?" అంది.

ఒళ్ళంతా చెవులు చేసుకుని వినసాగాడు.

"నువ్విక్కడే ఉంటావా?"

మాధవ్ అలాగేనని తలూపాడు.

చిరునవ్వుతో లోయలోకి దిగి పొదలచాటున మాయమైపోయింది జూలియా. కొద్ది నిముషాలలో హోషియా, జూలియాలు మాట్లాడు కొంటున్న మాటలు వినపడ్డాయి మాధవ్ కు. పదినిముషాల తర్వాత మరోసారి విమానం కూలిపోయిన చోటికి పోయాడు మాధవ్. తిరిగి ఆ ప్రదేశమంతా కలియతిరిగాడు. తిరిగి తిరిగి తన కాంప్ చేసిన చోటికి బయలు దేరాడు. మాధవ్ కాంప్ సైట్ ను సమీపించేసరికి, అతన్ని చూసి పొదలోకి తప్పుకున్నాడు బుద్ధూ.

మాధవ్ బుద్ధూను చూశాడు. అతని సామానుల్లో వెతక తగింది ఏమీలేదు. మరి ఎందుకు వచ్చినట్లు? తనకింతవరకూ అర్ధంగాని సమస్యలలో దీన్నిగూడా చేర్చుకున్నాడు. బుద్ధూను తిరిగి వెంబడించటం అర్ధంలేనిపని.

కొన్ని వేల ఎకరాల అరణ్యంలో పడిపోయిన చిన్న పాకెట్టును వెతకడం రాను రాను, అపహాస్యం క్రింద పరిణమిస్తోంది. నిముష నిముషానికీ కొత్తవాళ్ళు ఈ సెటప్ లో చేరుతున్నారు.

బుద్ధూ ఎవరూ? జూలియా నిజంగానే తనమీద ఆపేక్ష చూపుతోందా? హోషియా జూలియాను ఎందుకు అనుసరిస్తోంది? మధ్యాహ్నం జూలియా నిజంగానే వస్తుందా? తనతో ఇంకెవర్నయినా తీసుకురాదుగదా?

ఆలోచనలు కందిరీగల్లాగ మాధవ్ బుర్రను తొలువసాగాయి.

టార్పాలిన్ లో మిగిలిన ఆహారాన్ని తీసుకుని తిన్నాడు.

రేపటినుండి అడవిమీద పడి బ్రతకాలనుకుంటూ, ఒక నీళ్ళగుంట లో నీళ్ళు త్రాగాడు.

ఒంటిగంట, ఆ ప్రాంతాలకు బయలుదేరాడు మాధవ్. జాగ్రత్తగా నలుమూలలా చూస్తూ, చెవులు రిక్కించుకుని, అరణ్య శబ్దాలు వింటూ జూలియాను కలుసుకున్న స్థలానికి పోయాడు.

జూలియా ఇంకా రాలేదు. ఏమీతోచక పొదలలో అటు ఇటూ తిరగసాగాడు.

* * *

జాన్సన్ లోయలో వున్న గుర్తులను చూశాడు. ప్రక్కనేవున్న ఇన్ స్పెక్టర్ కు చూపించాడు.

"ఇదిగో! ఎంతో సేపై యుండదు యిక్కడకు వచ్చి, యింకో గంటలో మనం పట్టుకోవచ్చు" అన్నాడు.

యిద్దరూ అడుగుజాడల ననుసరించి నడవసాగారు. మాధవ్ తీసుకున్న జాగ్రత్తలు వారు పాటించటం లేదు. వారి అడుగుల క్రింద ఎండుటాకులు గలగలమంటున్నాయి. పొదలను రైఫిల్స్ తో ప్రక్కకు నెట్టటం వలన, అవి కదిలి మోతచేస్తున్నాయి. ఆ విధంగా వారు ఒంటి గంటకు మాధవ్ కేంప్ వున్న స్థలానికి పోయారు. అతని వస్తువులన్నీ చిందర వందరచేసి వెతికారు. చుట్టూవున్న పొదలను

పరీక్షించారు. ఫలితం లేకపోయింది. మళ్ళీ వెనుతిరిగి లోయవైపు నడవడం ప్రారంభించారు.

"నువ్వతన్ని సరిగ్గా గుర్తుపట్టావా జాన్సన్?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"ఆహా ఖచ్చితంగా చెప్పగలను, క్రిందటి సంవత్సరం పేపర్లనిండా వేశారుగా అతని ఫోటోలు. గడ్డం, మీసాలు ఉన్నా పోలికలు యీజీగా తెలిసిపోతున్నాయి" సమాధానమిచ్చాడు జాన్సన్.

"యింత దూరం వచ్చి అతను కాకపోతే అనవసరమైన శ్రమ" అన్నాడు మళ్ళీ యిన్‌స్పెక్టర్.

"స్పైడర్‌ను చంపినందుకు ఎట్లాగో అరెస్టు చేయాలికదా, మనం అనుకున్న మనిషయితే యిద్దరికీ చెరొక ఐదువేలు లాభంగదా!" అన్నాడు జాన్సన్ ఈలవేస్తూ.

ఆ ఈల వేయటమే వారిచేతుల్లో చిక్కబోతున్న వ్యక్తిని హెచ్చరించింది.

జూలియా కోసం ఎదురుచూస్తూ పచార్లు చేస్తున్న మాధవ్ ఏదో శబ్దం వినరావడంతో నిలబడి వినసాగాడు.

సునిశితాలయిన అతని చెవులకు, పొదలు కదిలిన చప్పుడు వినవచ్చింది. జూలియాకు రహస్యంగా రావలసిన ఆగత్యమేమిటి?

చెట్టు మొదలుకానించిన రైఫిల్ తీసుకుని, పొదల్లో దూరి కూర్చున్నాడు.

దిక్కులు చూస్తూ వస్తున్న జాన్సన్ నోరు తెర్చుకుని నిలబడి పోయాడు. అతని వెనకాలే పక్కలకు చూస్తూ అడుగులు వేస్తున్న యిన్ స్పెక్టర్, వచ్చి జాన్సన్ కు గుద్దుకున్నాడు. యిద్దరూ తూలి ముందుకు పడిపోయారు. వారి చేతుల్లో గన్స్ క్రింద పడిపోయాయి. తిట్టుకుంటూ లేచి నిలబడ్డాడు జాన్సన్. యిన్ స్పెక్టర్ తన గన్ తీసుకుందామని చెయ్యి చాచాడు.

"పుట్ యిట్ దేర్ మిస్టర్! పిచ్చివేషాలు వేశారంటే యిద్దర్నీ ఒకేసారి పైకి పంపిస్తాను" బెదిరించాడు మాధవ్.

పొదలను తప్పించుకుంటూ వస్తున్న జాన్సన్ ను చూసి రైఫిల్ గురిపెట్టి ఒక పొద పక్కన నిలబడి ఉన్నాడు. తెలియక జాన్సన్ సరాసరి వచ్చి రైఫిల్ బారెల్ ముందు నిలబడిపోయాడు.

ఒక నవ్వు నవ్వటానికి ప్రయత్నించాడు జాన్సన్! "నీ కోసమే వస్తున్నాం మాధవ్!"

"ఏం? యింకేంపని తగిలింది నాతో?" హేళనగా అడిగాడు మాధవ్.

"అసలుపనే తగిలింది మిస్టర్. నిన్నరస్టు చేస్తున్నాం!" అన్నాడు యిన్ స్పెక్టర్, పోలీస్ యిన్ స్పెక్టర్ హోదానంతా గొంతులో పలికిస్తూ.

"మీరు ప్రయత్నించేముందు ఎందుకో తెలుసుకోవచ్చా" నవ్వుతూ ప్రశ్నించాడు మాధవ్. అతని వెనకాల అడుగుల చప్పుడు వినవచ్చింది! జూలియా రాలేదుకదా అన్న అనుమానం సన్నగా అతని హృదయాన్ని కలవరపరచ సాగింది.

"మొదట స్పైడర్ ను హత్య చేసినందుకు!" జాన్సన్ అందుకున్నాడు.

తన చెవులను తానే నమ్మలేకపోయాడు మాధవ్.

కొట్టిన నాలుగు దెబ్బలు కాస్తా బలంగానే వేశాడు. అంత మాత్రానికే చచ్చాడా, ఆ వెధవ యిప్పుడున్న పరిస్థితుల్లో అరెస్ట్ అయితే కొంపలంటుకుంటాయే! అనుకుంటూ ఆలోచనలో పడ్డాడు మాధవ్.

జాన్సన్ చూపులతో మింగేటట్టు చూస్తున్నాడు.

"స్పైడర్ చనిపోయేటప్పుడు అన్నీ చెప్పి పోయాడు మిస్టర్. అదీగాక యింకో విషయంకూడా తెల్సింది. ఎవ్వరికీ దొరక్కుండా తప్పించుకొని, అడవుల్లో నివశించినంత మాత్రాన నీ బుద్ధి మారుతుందా మిస్టర్ షాడో!" కర్కశంగా అన్నాడు యిన్స్పెక్టర్.

ఉలిక్కిపడ్డాడు మాధవ్. ఉన్న ఖర్మలో ఉపాఖర్మ అన్నట్లు తన షాడో ఐడెంటిటీకూడా యిప్పుడే బయటకు రావాలీ? యిప్పుడు వీరిని తప్పించుకున్నా వేటకుక్కల్లా పోలీసులు వెంటపడకమానరు.

వారితోబాటు సివిలియన్స్ కూడా, తనమీద ప్రభుత్వం ప్రకటించిన పదివేల రూపాయల బహుమతికోసం, వెతకటం మొదలు పెడతారు. యిప్పుడేం చేయాలి?

"మర్యాదగా ఆ రైఫిల్ క్రిందపడేసి లొంగిపో షాడో!" యిన్ స్పెక్టర్ వార్నింగిచ్చాడు.

"దమ్ము వుంటే వచ్చి తీసుకోరాదా!" హేళనగా నవ్వాడు మాధవ్ - కాదు షాడో.

ఇన్ స్పెక్టర్ హెజిటేట్ చేశాడు. అతని రైఫిల్ కాళ్ళ దగ్గిరే వుంది. కొంచెం వంగుంటే అందుతుంది. ఈ లోపలే షాడో అతని ఒళ్ళంతా తూట్లు పడేటట్టు కాల్చవచ్చు.

"కాల్చిపారేయక చూస్తావేం యిన్ స్పెక్టర్" అన్నాడు జాన్సన్. ఇందాకటి నుంచి వెనుతిరగక పోవటంవల్ల యిన్ స్పెక్టర్ చేతిలో రైఫిల్ లేదని అతనికి తెలియదు.

షాడో రైఫిల్ ని కొంచెం పైకెత్తాడు.

"గో ఆన్ ట్రై యిట్ మాన్! దీన్ని పెట్టి కొడితే నీకు దెబ్బ తగలక పోవచ్చు. దీని గుండు దెబ్బకు నీ వళ్ళు చిల్లులు మాత్రం పడుతుంది" అన్నాడు విలాసంగా.

"మమ్మల్ని బెదరగొట్ట గలిగానని మురిసిపోకు మిస్టర్ షాడో! మా పోలీసుల చేతిలోంచి నువ్వు తప్పించుకోలేవు సుమా!" అంటూ వెను దిరిగాడు యిన్స్పెక్టర్.

షాడోను తిడుతూ జాన్సన్ కూడా అతన్ని అనుసరించాడు. మరెట్టి గలాటా లేకుండానే యిద్దరూ పొదలుదాటి చెట్లలో ప్రవేశించి అదృశ్య మైనారు.

షాడో క్రిందపడిన వారి రైఫిల్స్ తీసి పొదలలోకి విసిరేశాడు.

వెనుదిరిగి పొదలగుండా తను వేచి యున్న ప్రదేశానికి వచ్చాడు.

అక్కడ జూలియా షాడో కోసం వచ్చి సిద్ధంగా వుంది.

ఆమె ముఖం పాలిపోయివుంది. పెదవులు అదురుతున్నాయి. నెర్వస్ గా చేతులు నులుముకుంటుంది.

"మాధవ్! వాళ్ళు అన్నది నిజమేనా! నువ్వు గజదొంగ షాడో వేనా? స్పైడర్ అనేవాణ్ని ఖూనీ చేశావా?" అంటూ ప్రశ్నలవర్షం కురిపించింది.

"అవును జూలియా నేనే షాడోను. అడవుల్లో ఎందుకు తిరుగు తున్నానో యిప్పటికయినా తెలిసిందా?" తను వచ్చిన పని దాచటానికి మంచి సాకు దొరికినందుకు షాడో ఎంతో సంతోషించాడు.

"కాని ఆ స్పైడర్ గాణ్ని మాత్రం నేను చంపలేదు. నేను చూసేటప్పటికి బాగానే తిరుగుతున్నాడు!" తూలుతూ బోటు దగ్గిరికి చేరుకున్న స్పైడర్ అతని కళ్ళల్లో మెదిలాడు.

"యిప్పుడు ఏం చేద్దామనుకుంటున్నావ్ మాధవ్" జూలియా ఆందోళనగా ప్రశ్నించింది.

నిజంగానే తనకు మంచి జరగాలని కోరుకుంటున్నదని గ్రహించ గలిగాడు షాడో. ఒకళ్ళని తన అనుమానితుల లిస్టులోంచి కొట్టి వేశాడు. యిక నెమ్మదిగా వీలుచూచుకుని బుద్ధూ విషయం జూలియా ను అడగాలి అని నిశ్చయించుకున్నాడు.

జూలియా అతని దగ్గిరకు వచ్చి నిలబడింది. ఆమె స్థనాలు అతని గుండెలకు గుచ్చుకుంటున్నాయి. ఒక విధమైన సువాసన ఆమె వంటి మీదనించి వచ్చి అతన్ని గిలిగింతలు పెట్టసాగింది. ఆమెను చేతులతో చుట్టిపేశాడు. ఆ బిగి కౌగిలిలో కరిగిపోయింది జూలియా.

తన చేతులతో అతని ముఖాన్ని పట్టుకుని ముందుకు వంచింది. ఆశగా ఎదురు చూస్తున్న ఆ పెదవుల మకరందాలను తనివితీరా ఆస్వాదించాడు షాడో.

"మాధవ్ నువ్వు ప్రమాదంలో వున్నావు. నీకేమన్నా సహాయం కావాలంటే నా దగ్గరకురా!" అన్నది జూలియా అతన్ని సున్నితంగా వెనక్కుతోస్తూ.

ఆమెవంక కృతజ్ఞతగా చూశాడు షాడో.

"జూలియా డార్లింగ్! నా మీద వున్న ప్రేమకు ఏం సమాధాన మివ్వాలో తెలీటంలేదు. నేను దొంగనయినా యింతవరకూ హత్యలు చేయలేదు. నేసెందుకు ఆ పని చేయాల్సివచ్చిందో యిప్పుడు చెప్పలేను. కొద్ది రోజులలో నీకే తెలుస్తుంది" మెల్లగా అన్నాడు.

"నువ్వు ఖూనీ చేశావంటే నేను నమ్మలేను మాధవ్" అన్నది.

"మరేం ఫర్వాలేదు. అది నా ఆత్మ రక్షణకోసం చేశాను. ఏదో విధంగా ఆ నేరాన్నుంచి బయటపడాలి. నువ్వు మీ కాంప్ కు వెళ్ళిపో! నేనుపోయి...."

"మాధవ్ ఏం జరిగినా నేను నీ శ్రేయోభిలాషినని మర్చిపోకు. మేము కొంతకాలం కోస్గిల్ లో వుండదలిచాము. నీకు అవసరమయితే పూర్ణిమ...."

"హోటల్ పూర్ణిమలోనా?" అడిగాడు షాడో.

"అవును మాధవ్ పూర్ణిమలోనే! వస్తావుగదా!" అంటూ అతన్ని పెనవేసుకుంది చెమ్మగిల్లిన కన్నులతో.

ఆ ప్రేమావేశానికి చలించిపోయాడు షాడో. ఏమిటి ఈ సంబంధం? ఎందుకిలా జరుగుతోంది? బిందు ముఖం నవ్వుతూ అతని ఎదుట ప్రత్యక్షమయింది. బిందూకు ద్రోహం చేస్తున్నాడా తను?

తల విదిలించి ఆలోచనలను పారద్రోలి, జూలియా చేతులలోంచి విడిపించుకుని లేచాడు షాడో.

"వస్తాను డార్లింగ్" అంటూ పొదలలో దూరి అదృశ్యమయి పోయాడు.

అతను పోయినదిక్కే చూస్తూ అచేతనంగా నిలబడిపోయింది జూలియా.

*        *        *

"గత సంవత్సరం నుంచి అజ్ఞాతంగా వుంటున్న షాడో తిరిగి ప్రవేశం. అస్సాం అడవులలో స్పైడర్ అనేవ్యక్తి హత్య.

పోలీసులనుండి తప్పించుకోవటానికి, గజదొంగ షాడో అస్సాం అడవులలో, మాధవ్ అని పేరు పెట్టుకుని అజ్ఞాతవాసం చేస్తున్నాడు. పదిహేను రోజులనాడు జరిగిన విమాన ప్రమాదంలో అతనిచేయి ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. అతన్ని కల్సుకోవటానికి వెళ్ళిన స్పైడర్ అనే వ్యక్తిని హత్యచేసినట్లు తెలియగానే బంధించ టానికిపోయిన సబ్ యిన్‌స్పెక్టర్ను, జాన్సన్ అనే పౌరుడినీ, బెదిరించి కొట్టి వెనుకకు పంపించాడు. సంవత్సరంనుంచీ, హాయిగా గుండెల మీద చెయ్యివేసుకుని నిద్రిస్తున్న పౌరులందరూ భయాందోళనలు చెందుతున్నారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే తగిన చర్యలు తీసుకొని షాడోను రూపుమాపాలని కోరుతున్నారు."

టీ తాగుతూ పేపరు చూస్తున్న ముఖేష్ ఆందోళనతో మరొక్కసారి ఆ వార్తను చదివాడు.

కొందరు టాప్ అఫీషియల్స్ కు తప్ప షాడో సీక్రెట్ ఏజెంటని ఎవ్వరికీ తెలియదు. ఇప్పుడు తెలియ చెయ్యటానికి ఆస్కారంలేదు. అతను సీక్రెట్ ఏజెంటని తెలిస్తే అతని చుట్టూ తిరుగుతున్న "వజ్రాల గాంగ్" పారిపోవచ్చు.

వెంటనే బిల్లు చెల్లించి హోటలు వెలుపలికి వచ్చాడు. టాక్సీని పిలిచి అందులో కూర్చుని ఎయిర్ డ్రోం కు పోనిమ్మన్నాడు.

తనకు పదిహేను రోజులు లీవు వుంది. ఈ పిరియడ్ లో పోయి కోస్గిల్లో వుంటే షాడోకు సహాయపడవచ్చు.

మరో గంటలో కమల్ పూర్ పోయే డకోటాలో కూర్చున్నాడు. కమల్ పూర్ చేరుకునే టప్పటికి దరిదాపు పది గంటలయింది. ప్లేను దిగి ఒక టాక్సీని కాంట్రాక్టుకు తీసుకొని కోస్గిల్ కేసి బయలుదేరాడు సీక్రెట్ ఏజెంట్ ముఖేష్.

* * *

ఎవ్వరికంటా పడకుండా తను కాంప్ చేసిన చోటికి చేరుకున్నాడు షాడో. తన సామాన్లు తీసుకొని, కాబిన్ దిశగా నడవటం ప్రారంభించాడు. 'మొన్నటిదాకా నరమానవుడు ప్రవేశించని ఈ అరణ్యం, ఒక్కసారి మనుష్యులతో నిండిపోయింది' అనుకుంటూ.

'తనకు కనబడని వజ్రాల పాకెట్టు వారికి మాత్రం కనబడుతుందా!' అన్న హోప్ తో వున్నాడు. సూర్యుడు పడమటి దిశకు చేరే సమయానికి తన కాబిన్ ను సమీపించాడు షాడో. పొదలలో నుంచి పరిసరాలన్నీ క్షుణ్ణంగా పరిశీలించాడు. ఎవరూ కనుపడలేదు. ధైర్యంగా కాబిన్ లోకి ప్రవేశించి తలుపులు వేసుకున్నాడు. ఎవరైనా వస్తే దొరికిపోవటం ఖాయం. కాని బయట తిరగటానికి అతని మనసు అంగీకరించలేదు. పక్కనే వున్న బెడ్ మీద పడుకున్నాడు. తలకింద ఒక నీలం రంగు "లైఫ్ బాయ్ ఫోమ్ రబ్బర్" వుంది. అది రబ్బరుదైనా చాలా గట్టిగావుంది. విసుగుతో తీసి మూలకు విసిరి, తలకింద చెయ్యి పెట్టుకొని పడుకున్నాడు.

"ఈ అసలు మాధవ్ చాలా విచిత్రమైన వ్యక్తి. నదిలో ప్రయాణించే బోట్లనుంచి అప్పుడప్పుడూ ఏవేవో జారిపోతుంటాయి. అలా కొట్టుకు వచ్చిన వాటిని, తెచ్చి కాబిన్ లో పడేస్తుంటాడు. ఇదేం పిచ్చో?" అనుకుంటూ కనులు మూసుకున్నాడు.

ఈ గాంగ్ లీడర్ ఎవరు? జాన్సన్ మాత్రం కాదు. అతను ఆర్డర్లు తీసుకునే రకమే కాని ఇచ్చేవాడు కాదు. వున్నట్లుండి తన మీద ఈ హత్యకేసు బనాయించటానికి కారణమేమిటి. అందరు ఆ వజ్రాలు తన దగ్గిరే వున్నాయనుకుంటున్నారా? బుద్ధూ వాళ్ళు కూడా వజ్రాల కోసమే వచ్చారా?

తను షాడోగా బయటికి వచ్చాడు. ఇప్పుడు కర్తవ్యమేమిటి? దొంగ అని తెలిస్తే గాంగ్ తమ ప్రయత్నాలు తీవ్రతరం చేస్తుందా? ఇకముందు తను అడవిలో వుంటే పని జరగదు. కోస్గిల్ పోయి ఆ కందిరీగల తుట్టెను కదిలించాలి - అనుకుంటూ నెమ్మదిగా నిద్రలోకి జారిపోయాడు షాడో.

* * *

వెలుగురాగానే లేచి బయటకు వచ్చాడు షాడో. కావలసిన కొద్ది సామాన్లు తీసుకొని తన డింగీ కట్టివేసియున్న స్థలానికి బయలు దేరాడు.

ఒక చెట్టు మొదలకు రాగానే, కనబడిన దృశ్యాన్ని చూసి, గిరుక్కున వెనుదిరిగి అరణ్యంలోకి పారిపోయాడు.

రెండు మోటారుబోట్లనిండా పోలీసులు వస్తున్నారు. మోటారు బోటు ధ్వని విననందుకు తన మందబుద్ధిని తానే నిందించుకుంటూ, ఒక కొండమీదుగా కోస్గిల్ వైపు కాలినడకన బయలు దేరాడు. పోలీసులు అడవిలో బిజీగా వున్నప్పుడు, కోస్గిల్లో తన పని తాను పూర్తి చేయాలన్న నిశ్చయంతో గబగబా అడుగులు వేయసాగాడు.

"హల్లో డియర్ మిస్టర్ షాడో! హౌ ఈజ్ ది గేమ్" అన్న కంఠం అతని కాళ్ళకు బంధాలువేసింది. అప్రయత్నంగా చెయ్యి బూటులో వున్న కత్తిమీదకు పోయింది.

కాని అతని మెదడు ఆ స్వరాన్ని గుర్తించి, చేతిని మధ్యలో ఆపింది. లేచినుంచొని కంఠంధ్వని వినిపించిన వైపు చూశాడు.

ఒక చెట్టు కొమ్మమీద విలాసంగా కాలుమీద కాలు వేసుకొని సిగరెట్ కాలుస్తున్నాడు ముఖేష్.

"ముఖేష్!" అంటూ ఆశ్చర్యంగా నోరు తెరిచాడు షాడో. "ఇక్కడకెలా వచ్చావ్?"

"మన సాహసగాధలు నిన్న సాయంత్రమే పేపర్లో పడిపోయాయి గురువుగారూ! మనం ఏం చెయ్యాలో తోచక కాళ్ళు తొక్కుకుంటుంటా మని, వెంటనే బయలుదేరి గతరాత్రి కోస్గిల్ చేరుకున్నాను. ఇవాళ ఇక్కడికి వచ్చేసరికి, నా ముందు ఎర్రబుట్టలు కనుపించాయి. ఎదురు చూస్తూ ఈ కొండమీద మాటుపేశాను." అన్నాడు ముఖేష్ చిన్నగా నవ్వుతూ.

అతని నోట్లో సిగిరెట్ లాక్కొని, గబగబా రెండు దమ్ములు లాగాడు షాడో.

"మంచి సమయానికి వచ్చావ్! ఒకపని చెయ్యి" అంటూ అతని చెవులో ఏదో చెప్పాడు. ముఖేష్ చిరునవ్వు పెద్దగామారి, విలన్ లాగా వరస ఎత్తుకున్నాడు. ఆ శబ్దానికి చుట్టుపట్ల చెట్లమీది పక్షులన్నీ లేచిపోయాయి.

ఉలిక్కిపడి ముఖేష్ నోరు రెండు చేతులతోనూ గట్టిగా మూశాడు షాడో.

"స్టుపిడ్! ఇది అడవి. మన సి.ఐ.బి ఆఫీసుకాదు" అంటూ.

ముఖేష్ ను పంపి కోస్గిల్ వైపు ప్రయాణం మొదలు పెట్టాడు.

రాత్రి ఏడుగంటలకు, అలసి మొరాయిస్తున్న కాళ్ళను యీడ్చుకుంటూ కోస్గిల్ ప్రవేశించాడు. ఎదురు వస్తున్న కార్ల లైట్ల ముందు పడకుండా, నీడలలో నడుస్తూ, అగర్వాల్ యిచ్చిన అడ్రసు ప్రకారం, అతని యింటికి చేరుకున్నాడు.

అది ఒక భవనం. చుట్టూ ఎలక్ట్రిక్ లైట్లు దేదీప్యమానంగా వెలుగు తున్నాయి. గేటుదాటి పోర్టికోలోకి వచ్చాడు. ద్వారం ప్రక్కనున్న కాలింగ్ బజర్ నొక్కి నిల్చున్నాడు. ఒక పదిహేనేళ్ళ పిల్లవచ్చి తలుపు తీసింది. మాసిపోయిన బట్టలు, జీబురు గడ్డంతోవున్న షాడోను చూసి హడలిపోయింది.

"అ......అలాగే ఒక్క నిముషం" అంటూ లోపలకు పరుగెత్తింది.

"ఎవరది మనూ?" అంటూ అగర్వాల్ కంఠం విన్పించింది షాడోకు. "నాకు తెలియదు డాడీ నువ్వేపోయి చూడు" అంటూ ఆ పిల్ల సమాధాన మిచ్చింది.

అగర్వాల్ తలుపుదగ్గరకు వచ్చాడు. షాడోను చూసి ఆశ్చర్య పోయాడు.

"మాధవ్ కమాన్ మాన్ కమిన్" షాడో ఒక్కక్షణం కూడా వృధా చెయ్యకుండా లోపలకుపోయి తలుపులు వేశాడు.

"నేను పెద్ద ప్రమాదంలో వున్నాను. మీకు తెలుసుగదా" నాందిగా మొదలు పెట్టాడు.

తెలుసునన్నట్లు తలవూపుతూ షాడోని వెంట బెట్టుకుని తన డ్రాయింగ్ రూమ్ లోకి తీసుకుపోయాడు అగర్వాల్. చాలా ఖరీదయిన వస్తువులతో అలంకరింపబడి వుంది ఆ రూము.

"మీరు చెప్పినట్లు వెతకటానికి పోయాను. నాతో పాటు నా కన్నా ముందు చాలామంది అక్కడకు చేరారు. అప్పుడే ఆ స్పైడర్ గొడవ వచ్చింది" అన్నాడు షాడో.

"జరిగినదానికి చాలా విచారిస్తున్నాను మాధవ్. నిన్నటిదాకా ఆ హత్యకేసునుంచి నిన్ను తప్పించాలని ప్రయత్నించాను. కాని, నిన్న సాయంత్రం నువ్వు షాడోవి అన్న సంగతి తెలిసింది. మా లాయర్ తనేమీ చెయ్యలేనంటున్నాడు" అన్నాడు చేతులు నలుపుకుంటూ.

"మాధవ్ ఏమన్నా క్లూ దొరికిందా కొండల్లో?" మళ్ళీ గొంతు మార్చి, ఆత్రంగా అడిగాడు.

"లేదు. బుద్ధూ అనే వ్యక్తి తెలుసా మీకు?" అంటూ బుద్ధూని వర్ణించి చెప్పాడు.

అగర్వాల్ ఆలోచనలో పడ్డాడు. చేతులు వెనక్కి కట్టుకొని గదిలో అటు ఇటు పచార్లు చేయసాగాడు.

"నేను చూసినట్లు గుర్తులేదు" అన్నాడు.

బుద్ధూని గురించి చెప్పటంవల్ల కాస్త అనీజీగా ఫీలవుతున్నాడని గ్రహించాడు షాడో. కాని అగర్వాల్‌లాంటి పర్సనాలటీ, అంత తొందరగా బయటపడతాడా?

"నా లాయర్ వూళ్ళోలేడు మాధవ్. బహుశా రేపు రావచ్చు. ఆయన రాగానే నీ విషయం చూడమంటాను. కాని మనం వజ్రాలను వెతికి ఇచ్చేటట్లయితే ప్రభుత్వం నిన్ను క్షమించవచ్చు" అన్నాడు చివరకు.

ఏ సంగతి ఎత్తినా తిరిగి వజ్రాల దగ్గిరికి చేరటం షాడోకి చిరాకు తెప్పించింది.

"ఒక చెంప పోలీసులు నా కోసం తిరుగుతుంటే వజ్రాల గొడవలో ఎల్లా పడమంటారండీ?" కాస్త కటువుగా అన్నాడు.

దెబ్బకు మనిషి రాజీకి వచ్చాడు.

"చూడు మాధవ్, నువ్వు నా ఆప్తుడివి. మా షీలా ప్రాణదాతవు. నాకు కొంచెం టైం ఇయ్యి. యీ లోపల నువ్వు ఎవ్వరికీ కనుపడకుండా దాగుకో. యీ జాన్సన్, బుద్దూల విషయం నేను చూసుకుంటాను. లాయర్ తో మాట్లాడి పోలీసుల సంగతికూడా సెటిల్ చేస్తాను. సరేనా తొందరపడటం వల్ల ఉపయోగమేమీలేదు. రిలాక్స్ మాన్ హేవ్ ఎ డ్రింక్" అంటూ ఓ గ్లాసులో బ్రాందీపోసి ఇచ్చాడు.

"షీలా ఏదీ కనిపించలేదు" అడిగాడు షాడో.

తొట్రుపడ్డాడు. "హాస్పిటల్ కు పోయింది, ఒక స్నేహితుణ్ని చూడటానికి."

మరికొద్ది నిముషాలకు డ్రింకు పూర్తిచేసి లేచి నిలబడ్డాడు షాడో. "ఇప్పుడే వస్తానంటూ" గది బయటకుపోయి, రెండు నిముషాల్లో తిరిగి వచ్చాడు అగర్వాల్.

"నా స్నేహితులు కొందరున్నారిక్కడ. మీరేదైనా అరేంజి చేసేదాకా అక్కడ వుంటాను" అన్నాడు అగర్వాల్ తో.

"మా గారేజి పైన గెస్ట్ రూం వుంది. అందులో వుండవచ్చుగదా" అన్నాడు అగర్వాల్.

"అవసరం లేదు మిస్టర్ అగర్వాల్. ఆ జాన్సన్ గాడి అంతు చూడాలి. అది నేను బయట వుంటేనే సాధ్యమౌతుంది. వీలునుబట్టి మిమ్మల్ని కలుస్తాను.

అగర్వాల్ బయటకుపోయి రావటం, షాడోకనుమానం కల్గించింది.

పోర్టికోలో కారాగిన చప్పుడు విని కిటికీనుండి బయటకు చూశాడు. నల్లటి అంబాసిడర్ కారువచ్చి ఆగింది. డోరు తీసుకొని షీలా వయ్యారంగా కిందికి దిగింది. దాని వెనుకాలే పోలీస్ డిపార్టుమెంటు జీపువచ్చి ఆగింది.

ఒక్కగంతులో తలుపు తీసుకొని ఇంటి వెనుకకు పరుగెత్తాడు షాడో అగర్వాల్ కొంపముంచాడు అనుకొంటూ.

"ఆగు మాధవ్!" అంటున్నాడు అగర్వాల్.

వంట గదిలోకి ప్రవేశించి, వెనుకవైపు తలుపు తీసుకొని పెరటిలోకి వచ్చాడు షాడో. వంద గజాల దూరంలో ఆరడుగుల కాంపౌండ్ నల్లగా కనిపించింది. పరుగు ఆపకుండా హై జంప్ చేసి గోడను దాటాడు. గోడవతలంతా ఖాళీస్థలం.

స్ట్రీట్ లైట్లు వెలగటం లేదు. గోడనానుకొని కూర్చుని కళ్ళు చీకటికి అలవాటు పడేదాకా ఆగాడు షాడో.

కోన్సిల్ కోర్టు బిల్డింగ్స్ మీదుగా, టవున్ చివరకు పోతుంది ఆ రోడ్డు. ఒక మూలనుంచి కుక్క అరవసాగింది. కాని అది అదృష్టవశాత్తు అతని వెంటబడి తరమలేదు.

పోలీసులు ఎట్లా వచ్చారు? అగర్వాల్ ఫోను చేశాడా? షీలాను అనుమానించి, ఆమె వెనకాల వచ్చారా? షీలా కొంచెం తూలుతూ దిగటం గుర్తుకువచ్చింది. బహుశా తాగి వుంటుంది. అందుకనే పోలీసులు వచ్చి వుండవచ్చు.

ఏమైనా తనవెనుక వాళ్ళుపడటం ఇష్టం లేకపోయింది షాడోకు.

అగర్వాల్ ఇంట్లోనుంచి గొడవఏమీ వినబడలేదు. తననెవరూ గమనించటంలేదని రూఢీ చేసుకొని సందులో సరాసరి నడవసాగాడు షాడో.

ఒక సందు మలుపుతిరిగి వెనకకు చూశాడు. రెండు లైట్లు తన వెనకే రావటంచూసి పరుగు లంకించుకున్నాడు. పోలీసులు కావచ్చు ననుకుంటూ.

ఇరుగ్గా వున్నది ఆ సందు. యిద్దరు మనష్యులు పోవటానికే సరిగ్గా దోవ వుండదు. పోలీసులు వచ్చినా జీపు ఆపి కాలినడకన రావాల్సిందే. యీ లోపల తను ఎక్కడో ఒకచోట భద్రంగా దాక్కోవచ్చు ననుకున్నాడు షాడో.

ఒక మలుపు తిరిగి సందు అంతం అయింది. దారికడ్డంగా ఒక వైర్ ఫెన్సువుంది. దానిలోనుంచి దూరి, మళ్ళీ మెయిన్ రోడ్డును చేరుకున్నాడు షాడో.

మెయిన్ రోడ్డునానుకొని శృంగానది ప్రవహిస్తుంది. రోడ్డుకింద చెట్లు పొదలు దట్టంగా పెరిగివున్నాయి. ఒక చెట్టుపక్కన చేరి చెయ్యవలసిన పనిని గురించి ఆలోచించసాగాడు షాడో. అతను చూస్తూ వుండగానే నాలుగు పోలీసు కార్లు మెయిన్ రోడ్డుమీద పోసాగాయి. ఇప్పుడు కోస్గిల్ మధ్యలోకి పోవాలంటే మెయిన్ రోడ్డుమీదినుంచే పోవాలి. లైట్ల వెలుగులో ఎవరైనా గుర్తుపడితే కష్టం. ఏంచేయాలా అని ఆలోచించాడు.

మెయిన్ రోడ్డుకు అవతలివైపు టెలిఫోన్ బూత్ కనిపించింది. జేబులో చెయ్యిపెట్టి తడిమాడు. మూడు పదిపైసలు తగిలాయి.

గబగబా రోడ్డుదాటి బూత్ లో ప్రవేశించాడు.

'మరి రెండు పోలీసుజీపులు బూత్ పక్కగా పోయాయి. పోలీసులు పిచ్చికుక్కల్లా తిరుగుతున్నారేమిటి? నేను వచ్చానని వీళ్ళకెలా తెలిసింది.' అనుకొని గబగబా డైరక్టరీలో నెంబర్ వెతికాడు. తనకు కావలసిన నెంబర్ దొరకగానే డయల్ చేసి రిసీవరు చెవిదగ్గర పెట్టుకొని నిలబడ్డాడు. రోడ్డంతా నిర్మానుష్యంగా వుంది. కొంచెందూరంలో నది ఒడ్డున మోటారుబోట్లు కట్టివున్నాయి. కొందరు వ్యక్తులు అక్కడ కూర్చుని మాట్లాడుకుంటున్నారు.

ముఖం బయటకు కనిపించకుండా, డైరెక్టరీ అడ్డంపెట్టుకున్నాడు. "హల్లో" అని పలికింది ఒక కంఠం. రెండు పది పైసలు ఇన్ సర్ట్ చేశాడు. "యీజ్ ఇట్ హోటల్ పూర్ణిమ?" అని ప్రశ్నించాడు.

"కెన్ యూ గెట్ మి మిస్ జూలియా?"

కొన్ని సెకండ్ల తరువాత మత్తుగా వినిపించింది జూలియా కంఠం "ఎవరూ?" అంటూ.

"నేను జూలియా, అడవి మనిషిని" చిన్నగా నవ్వుతూ మెల్లగా మౌత్ పీస్ లో అన్నాడు.

"మాధవ్ నువ్వా?" ఆశ్చర్యపడింది.

ఏదో చెప్పాడు షాడో.

"మాధవ్ ఎక్కడున్నావ్?" ఆప్యాయంగా అడిగింది ఆమె చిరునవ్వు షాడో మనసులో మెదిలింది.

"జూలియా నేనిక్కడ చిక్కుపడ్డాను. నాకోసం పోలీసులు తిరుగుతున్నారు. నువ్వు ఒక కారు సంపాదించగలవా?" అని అడిగాడు.

"ఓ! అలాగే. ఈ హోటలువాళ్ళు కార్లు రెంట్ కు ఇస్తారు. ఎక్కడికి రాను?"

"రివర్ ఎవన్యూ తెలుసా, కోర్టు హౌస్ చివర?"

"విన్నట్లేవుంది. ఐదు నిముషాల్లో వస్తాను. వుంటావుగదూ?"

"ఉండక ఎక్కడికి పోతాను? నెమ్మదిగా డ్రైవ్ చేసుకుంటూ రా? నేనువచ్చి కలుస్తాను."

"వెరీగుడ్. నీ గురించి పేపర్లలో చదివాను. అయామ్ సారీ మాధవ్."

"మరేం పరవాలేదు జూలియా! అంతా సమసి పోతుందిలే! నువ్వు త్వరగా బయలుదేరతావు గదూ! వుంటాను" ఫోను పెట్టేశాడు షాడో.

బూత్ లో గాలి ఆడకపోవటం వలన చెమటలు పట్టి చొక్కా అంతా తడిసిపోయింది. ఆ జాన్సన్ గాడు దొరికితే వాడికి ఇంతకన్నా ఎక్కువ చెమటలు పట్టించాలి అనుకున్నాడు. మళ్ళీ రోడ్ క్రాస్ చేసి చెట్ల నీడలలో కూర్చున్నాడు.

టైం ఎంతయిందో తెలియలేదు. దగ్గిర దగ్గిరగా పదికావచ్చు అనుకున్నాడు. పది నిముషాల తరువాత ఒక కారు నెమ్మదిగా టవున్ మధ్యనుంచి రావటం చూసి లేచి నుంచున్నాడు. ఆ కారు వెనకాలే పుట్ట పగిలినట్లు వరుసగా పది కార్లు వస్తున్నాయి. షాడో వళ్ళు ఝుల్లుమంది. వున్నట్లుండి అన్నీ ఇప్పుడే రావాలా?

నెమ్మదిగా వస్తున్నకారు, పక్కకు తప్పుకొని వెనుకనున్న వాటికి సైడు ఇచ్చింది. వాటిలైట్లు తన మీద పడకుండా, చెట్టు చాటుకు తప్పుకున్నాడు షాడో. అవి వెళ్ళిపోయిన తరువాత ఆ కారు మెల్లగా

కదలసాగింది. షాడో రోడ్ మీదికి వచ్చి నుంచున్నాడు. ఒక అడుగు చెట్లవైపు వేసి వుంచాడు, ఏమైనా పొరపాటు జరిగితే పోయి పొదల్లో పడటానికి.

తన దగ్గిరగా రాగానే స్టీరింగ్ ముందు కూర్చున్న జూలియాను గుర్తుపట్టి చెయ్యెత్తి సైగచేశాడు. బ్రేకువేసి షాడో పక్కన ఆపింది కారును. వెనుక డోర్ తెరిచి లోపల కూర్చున్నాడు. గుమ్మని సెంటు వాసన అతన్ని మత్తెక్కించింది. మసక వెలుగులో ఆమె రూపం అతన్ని గిలిగింతలు పెట్టింది.

"మాధవ్!" అన్నది జూలియా.

"పోనివ్వు హనీ! ఇక్కడే ఆగితే వాళ్ళు వచ్చి పడతారు" అన్నాడు ముందుకు జరిగి.

గేరు మార్చి కారును పోనిచ్చింది "ఎక్కడకు పోవాలి?" అంటూ.

నది ఒడ్డునే కొంతదూరం పోనివ్వమన్నాడు. రెండు ఫర్లాంగుల దూరంలో మునిసిపల్ పార్కువుంది. అక్కడ ఆపి లైట్లు ఆఫ్ చేసింది జూలియా.

"నిన్ను కలవటం నాకెంతో సంతోషంగా వుంది మాధవ్!" అన్నది జూలియా. ఆమె చేతులు అతన్ని దగ్గిరకు లాక్కున్నాయి. అతనేం అడ్డు చెప్పలేదు.

లేచి ఫ్రంట్ సీటులోకి పోయాడు. చేతులు చాచి అతని కౌగిలిలో ఒదిగిపోయింది. "నిన్ను ఒక్కరోజు చూడక పోయేసరికి పిచ్చి ఎత్తినట్లుంది మాధవ్!" అంటూ అతని పెదవులను చుంబించింది.

వెచ్చని ఆ పెదవులను రుచి చూస్తూ తనని తానే మర్చిపోయాడు షాడో.

"నేను ఇక్కడి నుంచి తప్పించుకొని, దీని అంతుచూడాలి జూలియా! నువ్వు సహాయం చేయగలవా?" ప్రశ్నించాడు.

"చేస్తాను డియర్" ఒక్కముక్కలో అతని మీద తనకు గల అభిమానాన్ని తెలియచేసింది.

"నీ స్నేహితులెక్కడికి పోయారు?"

"హోషియా సిక్కిం వెళ్ళిపోయింది. బుద్ధూ ఇక్కడే వున్నాడు. ఏం? అతని మీద ఏమైనా...మాధవ్! అతనికేం తెలియదు. అతన్ని అనుమానించకు" వేడుకుంది జూలియా.

"ఐయామ్ సారీ జూలియా, నన్ను క్షమించు."

"క్షమించటానికి రుసుము కావాలి."

ఖంగారు పడ్డాడు షాడో.

"నాట్ నౌ హనీ! జాగ్రత్తగా విను. ఈ టవున్ లో నా స్నేహితుడొకడున్నాడు. ఈ చుట్టుపట్ల జరిగే విషయాలన్నీ అతనికి తెలుస్తాయి.

ఆ జాన్సన్ గాడి విషయం కూడా అతనికి తెల్సే వుంటుంది. నన్నక్కడికి చేర్చావంటే..."

జూలియా మాట్లాడకుండా కారు స్టార్టు చేసింది. గేరు మార్చి మెయిన్ రోడ్డు మీదికి బాక్ చేసింది. ఆమెను బాధ పెట్టినట్లు గుర్తించాడు షాడో. కాని ఏం చేయలేని పరిస్థితి, రొమాన్సు కిది సమయం కాదు. అటో ఇటో తేల్చుకుంటే...

మెయిన్ రోడ్డు మీదుగా టవున్ తూర్పు దిక్కుకు పోనీయమని చెప్పాడు.

షాడోగా తిరిగే రోజుల్లో ఒక వ్యక్తికి ఎంతో సహాయం చేశాడు. షాడో చేసిన సహాయం వల్లనే అతను, ఒక హోటలు పెట్టుకొని సుఖంగా జీవిస్తున్నాడు. అతను చేయని వ్యాపారం లేదు. నాటుసారా కాచటం దగ్గిరనుంచి, ఆయుధాలు స్మగుల్ చెయ్యటం వరకూ అతని చెయ్యి తిరిగి వుంది.

షాడో వెళ్ళి అడిగితే ప్రాణాలైనా ఇస్తాడు, గంగారాం.

గంగారాం అంటే తెలియని గూండా అస్సాం రాష్ట్రంలోనే లేడు.

జూలియాకు చెప్పి అతని హోటలు వెనకాల నీడల్లో కారును ఆపించాడు షాడో.

కారు దిగి, తిరిగి ఆమెవద్దకు వచ్చి నిలబడ్డాడు.

"నీ కోసం వేచి యుంటాను మాధవ్."

"ఇక్కడే వుంటే ఏదైనా ప్రమాదం రావచ్చు జూలియా! నీ హోటల్ కు పో. నేను నా పని అవంగానే పిలుస్తాను" నచ్చచెప్పాడు.

"అది కాదు—మాధవ్" అతని మాటలు వినకుండా మారాం చేసింది జూలియా.

ముందుకు వంగి ముద్దు పెట్టుకున్నాడు షాడో.

"గుడ్ నైట్ జూలియా! ఐ విల్ సీ యూ ఎగైన్" అంటూ చీకట్లలో కలిసిపోయాడు. ఆమె కారు కదిలి పోగానే చెట్ల కిందనుంచి బయటకు వచ్చి వెనుక తలుపును తట్టాడు. ఎక్కడో దూరాన నక్కలు అరుస్తున్నాయి, ప్రపంచంలో విషాదమంతా వాటి దగ్గరే వున్నట్లు. కొంత నా చుట్టూ కూడా వుంది అనుకుంటూ గట్టిగా తలుపు తట్టాడు షాడో. వెంటనే లోపలనుండి అడుగుల చప్పుడు వినవచ్చింది. ఒక లావుపాటి ఆడమనిషి వచ్చి తలుపు తీసింది. "ఎవరు కావాలి?" అనుమానంగా చూస్తూ అడిగింది.

"గంగారాం కోసం వచ్చాను. నలుపు వ్యక్తి వచ్చాడని చెప్పండి!" అన్నాడు ఆమెతో.

"ఒక్క నిముషం ఆగండి!" అంటూ లోపలకు పోయింది.

గంగారాం వచ్చి తలుపు దగ్గిర తొంగి చూశాడు.

షాడోను చూడగానే, "గురువు గారూ మీరా?" అంటూ వచ్చి కౌగిలించుకున్నంత పని చేశాడు.

"ఏమిటీ హఠాత్తుగా వూడి పడ్డారు. ఎందుకనో మీరు వస్తారని అనుకుంటున్నాను" అన్నాడు. షాడోను చూసినందుకు అతను పొందే సంతోషం, అతని కళ్ళల్లో వెలుగు చెపుతోంది.

"గంగూ! నీకు తెలిసే వుంటుంది. నేను..."

"ఆ! ఆ! తెలుసు మీరు ముందు, బాబాయిలు వెనుక, అంతే కదూ!" అని నవ్వాడు.

"పేపర్లలో అంతా చదివాను. వింతగా వుంది" అన్నాడు కళ్ళు తమాషాగా తిప్పుతూ గంగారాం. ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు. రెండు గ్లాసుల్లో విస్కీపోసి ఒకటి షాడో కిచ్చాడు గంగారాం.

"సమయం వృథాచేయటం నాకిష్టంలేదు గంగూ! ఒక వెధవకోసం తిరుగుతున్నాను." అన్నాడు షాడో.

"ఆ వెధవ మరణించిన మన గ్రేట్ స్పైడర్ కు సంబంధించిన వాడేనా!" నవ్వుతూ అడిగాడు గంగారాం.

అవునని తలవూపాడు షాడో. జేబులోనుంచి సిగిరెట్టు పాకెట్టు తీసి షాడోకిచ్చి, తనొకటి వెలిగించుకున్నాడు.

జూలియా సంగతి వదలిపెట్టి జరిగినదంతా చెప్పాడు. అగర్వాల్ సంగతికూడా పూర్తిగా చెప్పాడు.

"అతన్ని గురించి నేను చాలా విన్నాను. కాని ఎవ్వరికీ దొరక్కుండా తప్పించుకున్నాడు" అన్నాడు గంగారాం.

"గంగూ! ఈ గాంగ్ లీడర్ ఎవ్వరో తెలుసా?"

కళ్ళు పైకెగరేశాడు గంగారాం. "అది నాకు తెలియదు గురూ! నీ వుద్దేశ్యం ఆ లీడరు ఇక్కడే కోస్గిల్లో వుంటాడనా?"

"నీకే తెలియాలి. అన్ని విషయాలు నీ దగ్గిరకు చేరతాయి గదా!"

"కొన్ని విషయాలు అసలు తెలియవు స్వామీ! ఒక్కటి మాత్రం తెలుసు. నీకోసం పోలీసులు ఎవ్వరూ తిరగటంలేదు."

చెళ్ళున కొరడాతో కొట్టినట్లు ఉలిక్కిపడ్డాడు షాడో!

పోలీసులు తిరగటంలేదా? మరి ఎవ్వరు వెంటాడుతున్నట్లు?

లేచి నిలబడ్డాడు. గంగూ! "ఆ వెధవలు ఎక్కడున్నారో చెప్పు. వాళ్ళ చేత అన్ని విషయాలూ కక్కిస్తాను. ఈ లోపల స్పైడర్ ను నా మీదికి తోలిందెవరో కనుక్కో" అడిగాడు.

"గురువుగారూ" మెల్లగా అన్నాడు గంగారాం. "మీరు అనవసరంగా వుద్రేకపడుతున్నారు, అంత తొందరెందుకు చెప్పండి? మీకు సహాయం చెయ్యాలని, గొడవ జరక్కుండా, ఏదో ఒక మార్గం చూడా

లని, ఇందాకణ్నించి ఆలోచిస్తున్నాను. ఎందుకంటే ఆ జాన్సన్ గాడు, వాడి స్నేహితులు పక్కగదిలోనే వున్నారు."

*       *       *

"వాట్?" అంటూ లేచిన షాడోను గట్టిగా పట్టుకొని కూర్చోపెట్టాడు గంగారాం.

"తొందరవద్దు బాబోయ్ అంటే వినిపించుకోరేమిటి?" అన్నాడు. చేతిలో వున్న సిగిరెట్టు పారేసి ఇంకోటి వెలిగించాడు.

"పోలీసుల వేషాల్లో గూండాలు మీకోసం ప్రతి సందులోను కాచుకొనివున్నారు. చేతికి దొరికితే పట్టుకొని చిత్రవధచేసి ఆ వజ్రాలను సంపాదించాలనే సంకల్పంతో కొంతమంది నా హోటలు దగ్గిర బైఠాయించారు. నాకున్న పేరు మీకు తెల్సిందేకదా! అందువల్ల నేను చేయగలిగిందేమీ లేదు."

షాడో కళ్ళు చింతనిప్పులైనాయి. పిడికిళ్ళు బిగించి పళ్ళు కొరక సాగాడు.

"మీ జాన్సన్ తో ఒక కొత్త వ్యక్తి వచ్చాడు. పందికొక్కు ముఖం వాడూనూ! మీకూ నాకూ వున్న పరిచయం వాళ్ళకు తెలిసింది. ఇందాక మిమ్మల్ని గురించి అడిగారు."

"ఏమని చెప్పావు?"

"ఏమని చెప్తాను? వాళ్ళకే, ఏమైనా తెలిస్తే చెప్పమన్నాను. అసలే డబ్బులు తక్కువైనాయి. మిమ్మల్ని పట్టిస్తే, వచ్చే పదివేల రూపాయలు జల్సాగా ఖర్చు చేసుకోవచ్చు."

గలగలా నవ్వాడు షాడో. చటుక్కున బూటుకాలితో షాడో కాలును చితకతొక్కాడు గంగారాం. "అమ్మా!" అంటూ కాలు రెండు చేతుల్తోనూ పట్టుకొని గదంతా గెంతసాగాడు షాడో.

"నేను తెలియదని చెప్పినా వాళ్ళు నమ్మలేదు. అక్కడ కూర్చుని వున్నారు. మోటారు సైకిల్ చైన్లు పట్టుకు తిరుగుతున్నారు గురూ" అని చెవులో చెప్పాడు.

"ఎంతమంది వున్నారు?" అడిగాడు షాడో.

"ముగ్గురు. సబిన్ స్పెక్టర్ వేషంలో నీ దగ్గిరికి వచ్చిన వాడు జాన్సన్, ఇంకో నూతన వ్యక్తి మొత్తం ముగ్గురు."

గది తలుపు తీసుకొని పోబోతున్న షాడోను బలవంతంగా ఆపాడు గంగారాం.

చెవిలో ఏదో చెప్పాడు.

చిరునవ్వుతో తల పంకిస్తూ వెనుక ద్వారం నుండి బయటకు నడిచాడు షాడో.

గంగారాం హోటలుకు రెండు ఫర్లాంగుల దూరంలో ఒక చెట్టు పక్కన నిలబడ్డాడు. రోడ్డు పక్కన మునిసిపాలిటీ డస్ట్ బిన్నులు పేర్చబడి వున్నాయి. దుర్వాసనతో ఆ ప్రదేశమంతా గబ్బెత్తి పోతున్నది.

సిగిరెట్టు వెలిగించి ఒక డబ్బామీద కూర్చున్నాడు. గంగారాం చెప్పినట్లు ఇంకో పావుగంటలో వాళ్ళు బయలుదేరి ఇటే రావాలి.

కొన్ని నిముషాల తరువాత ఒక జీపు బయలుదేరివచ్చి షాడోకు వందగజాల దూరంలో ఆగింది.

"ఇక్కడే ఎక్కడో వుంటాడన్నాడు గదా! జాగ్రత్తగా వెతకండి" అన్నాడు జాన్సన్.

షాడో కడుపు మండిపోయింది. ఆ దుర్మార్గుడు, నీచుడు "వాళ్ళను బయటకు తోసే పూచీ నాది" అన్నాడు ఇదా? షాడో వున్నాడని చెప్పి పంపుతాడా?

ఈ గొడవలన్నీ పూర్తి అయిన తరువాత గంగారాంకు ఒక మంచి పాఠం నేర్పాలనుకున్నాడు.

డస్ట్ బిన్ లన్నీ వెతుక్కుంటూ వస్తున్నారు ఆ ముగ్గురూ.

నేలమీద తడిమాడు షాడో. టెన్నిస్ బాల్స్ సైజులో వున్న రాళ్ళు చేతికి తగిలాయి. క్రిందికి చూశాడు. మూడే వున్నాయి రాళ్ళు.

"రక్షించండి" అంటూ మూలిగాడు. వస్తున్న వాళ్ళు ముగ్గురూ ఆగిపోయారు. శబ్దం వచ్చిన దిక్కుకు చూస్తున్నారు. చేతిలోవున్న రాయిని ఎడంవైపు విసిరాడు షాడో. మళ్ళీ మూలిగాడు.

"ఎవరది?" అరిచాడు జాన్సన్.

"ఎవరో తప్పతాగి పడిపోయివుంటాడు చూద్దాం రండి" అంటూ ఎడమ వైపుకు మళ్ళారు. రెండవ రాయిని తీసుకొని రెడీగా వున్నాడు షాడో. ముగ్గురూ పక్కకు తిరగ్గానే బలం కొద్దీ విసిరాడు రాయిని. జాన్సన్ భుజాలమధ్య తగిలిందా రాయి. "మా!" అంటూ అలాగే కింద పడ్డాడు. కదలను కూడా కదల్లేదు.

మళ్ళీ మూడోరాయిని విసిరాడు షాడో. అది గురితప్పి వాళ్ళ పక్కనుంచి దూసుకుపోయింది. తిట్టుకుంటూ లేచి వాళ్ళ మీదకు దూకాడు షాడో. చెట్ల నీడలోంచి, భూతంలాగా వస్తున్న షాడోను చూసి అవాక్కయి నిలిచిపోయారు వారిద్దరూ.

పొట్టకేసి గురిచూసి తన్నాడు షాడో. పందికొక్కు వెనక్కు జరగటం తో గాలినే తన్న గలిగాడు. అదేవూపులో పక్కకు తిరిగి, దొంగ సబిన్ స్పెక్టర్ ను నడుంమీద పొడిచాడు. అర్ధంకాని భాషలో అరుస్తూ మొదలు నరికిన చెట్టులా కూలిపోయాడు వాడు.

సర్రుమంటూ మోటారు సైకిల్ చైను షాడోను ఎత్తి నాలుగడుగుల దూరంలో పడవేసింది. ఎడమ భుజమంతా చీరుకుపోయి నెత్తురు

కారసాగింది. ఇక వీళ్ళతో సరసాలాడితే మొదటికే మోసం అనుకొని బూటులోవున్న కత్తిపై చెయ్యి వేశాడు.

వెనకాల ఎవరో వస్తున్నట్లు అనిపించి, పక్కకు తొలుగుదామని ప్రయత్నించాడు. నెత్తిమీద వందటన్నుల రాళ్ళు పడినంత బాధ కలిగింది. ఆకాశంలోవున్న నక్షత్రాలన్నీ వరుసగా అతని కళ్ళముందు మెరిసాయి. అలాగే ముందుకు వాలిపోయాడు.

ఎవరో కుదిపినట్లయి కళ్ళు విప్పి చూశాడు. కదలటానికి వీలు లేకుండా కాళ్ళు చేతులూ కట్టివున్నాయి. చుట్టూ పెట్రోలు కంపు. తను ఒక కారు డిక్కీలో వున్నట్లు తెలుసుకున్నాడు. కారు వేగంగా పోతున్నది. ఎక్కడికి?

నోటికి వచ్చిన తిట్లన్నీ తిట్టిపారేశాడు గంగారాంను. ఎందుకు చేశాడీ పని?

"గురూ! నువ్వు రహస్య నాయకుడ్ని చూడాలా? అందుకు ఒకటే మార్గం వుంది. నువ్వు అక్కడికి పోవటమే. ఎల్లాపోవాలి? అన్న ప్రశ్న నాకు వదలు. నేను పంపిస్తానుగా!" అన్నాడు దుర్మార్గుడు. ఇలానా పంపించటం.

తన వెనకాల అవసరమయితే చెయ్యి అందియ్యటానికి గంగారాం వస్తుంటాడని షాడోకు తెల్సు.

ఆరిపోతున్న పెదవులను తడుపుకొంటూ మెలకువగా వుండటానికి విఫల ప్రయత్నం చెయ్యసాగాడు.

*        *        *

క్రమంగా మెలకువ వచ్చింది షాడోకు. ఎక్కడో కారు స్టార్టయి వెడుతున్న శబ్దం వినవచ్చింది. అడుగుల చప్పుడు దగ్గిరకు వచ్చింది. తాళం తీయటం విన్నాడు. ఒక్కసారి చల్లటిగాలి వచ్చి అతని శరీరానికి హాయినిచ్చింది. కాళ్ళు చేతులు కదిలించటానికి ప్రయత్నించాడు. చల్లటి నీటి చుక్కలు అతని పెదవులను తడిపాయి. ఆత్రంగా పెదవులు నాలికతో తడుపుకున్నాడు. ఒకచెయ్యి అతని కాళ్ళకూ చేతులకూ వున్న కట్లను విప్పింది.

లేచి కూర్చోవటానికి ప్రయత్నించాడు. ప్రపంచమంతా గిర్రున అతని కళ్ళముందు తిరిగింది. మళ్ళీ వెనక్కు పడిపోయాడు.

"మాధవ్!" అంటూ ఒక కంఠం అతన్ని తట్టిలేపింది. గుర్తించటానికి ప్రయత్నిస్తూ బలవంతంగా కళ్ళు విప్పాడు షాడో.

"మాధవ్! నా వంక చూడు ప్లీజ్" అంటూ అతని ముఖాన్ని తన అరచేతుల్లో సున్నితంగా తట్టున్నది షీలా.

కళ్ళు తెరచిన షాడోకు ఏమీ కనిపించలేదు. చుట్టూ గాఢాంధకారం! ప్రేలాడిపోతున్న అతన్ని సాయంచేసి కారు డిక్కీలోంచి కిందికి దింపింది షీలా.

ఏదో తాగటానికిచ్చింది. రెండు గుటకలు వేసేసరికి గొంతంతా మండిపోయి ఉక్కిరిబిక్కిరయ్యాడు. అప్పటికి లోపలకు పోయిన బ్రాందీ పనిచేయటం ప్రారంభించింది. నెమ్మదిగా కోల్పోయిన జవసత్వాలు తిరిగి రాసాగాయి.

నీరసంగా తూలుతూ చుట్టూ చూశాడు. ఎక్కడున్నాడో అతనికి తెలియలేదు. కొంచెందూరంలో గలగలమంటూ తనమానాన తాను ప్రవహించుకుంటూ పోతుంది శృంగానది.

షాడో చెయ్యి తన భుజాలమీద వేసుకొని, సాయంపట్టి, ఒక కారు ఫ్రంట్ సీటులో కూర్చోపెట్టింది షీలా. మెత్తగా వున్న సీటుకానుకొని తిరిగి మరో లోకానికెగిరి పోయాడు షాడో.

కారులోంచి దింపి, ఏదో రూమ్ లోకి తీసుకుపోవటం కొంచెం తెలుసు షాడోకు. తిరిగి మెలకువ వచ్చేసరికి పూర్తిగా కోలుకున్నాడు. ఎడమచెయ్యి బాధ కొంచం తగ్గింది. శుభ్రమైన పక్కమీద పడుకొని వున్నాడు. తలకింద తెల్లని దిండు వుంది.

కిటికీలన్నీ తెరలతో మూసివున్నాయి. షీలా పక్కమీద కూర్చుని వున్నది. బాబ్ చేసిన జుట్టు భుజాలమీదపడి వింతగా మెరుస్తుంది. మత్తయిన కళ్ళు, రా రమ్మని ఆహ్వానించే ఎత్తయిన వక్షద్వయం - తేనె లూరుతున్న పెదవులు గ్రీక్ గాడెస్ వీనస్ లాగా వుంది.

కొంచెం ముందుకు వంగి "ఎలా వుంది మాధవ్" అని అడిగింది.

బ్రహ్మాండంగా వుంది అనబోయి జరిగిన సంఘటన గుర్తుకువచ్చి మాటలు బిగపట్టాడు షాడో.

లేచి కూర్చోబోయాడు. షీలా అతన్ని వెనక్కి తోసింది.

"మాధవ్ నీకు చాలా విషయాలు చెప్పాలి. రాత్రిజరిగిన గొడవలకు నేను చాలా బాధపడుతున్నాను."

ఆమె మాటలను నమ్మినట్లు నటించాడు షాడో. 'ఆఫ్టరాల్ డిక్కీ లోంచి బయటికిలాగి పక్కమీద పడుకోబెట్టిందిగదా!' ఏం చెపుతుందో చూద్దామనుకున్నాడు.

"ఆ దుర్మార్గుల్ని చితక కొట్టాలనిపించింది. వాళ్ళు చేసిన పనికి..."

"ఏమయింది షీలా?" అమాయకంగా ప్రశ్నించాడు.

"చాలా పెద్ద గ్రంథం మాధవ్. నిన్ను రక్షించటానికి వాళ్ళకు హెల్ప్ చేస్తానని మాట ఇచ్చి వాళ్ళల్లో తిరిగిచేరాను-నన్ను అపార్థం చేసుకో వద్దు సుమా" అన్నది.

"మాధవ్! నేను బర్మాలో వున్నప్పుడే ఆ గాంగ్ వాళ్ళు నన్ను పరిచయం చేసుకున్నారు. వాళ్ళ మెరమెచ్చు మాటలకు లొంగిపోయి వాళ్ళతో తిరిగేదాన్ని. కొంతకాలం తరువాత మన దేశానికి చెందిన ఒక వస్తువు రహస్యంగా ఇక్కడినుంచి భారతదేశం చేర్చాలని నా సహాయం అడిగారు. మొదట నేను ఒప్పుకోలేదు. కాని వాళ్ళు

బలవంత పెట్టేసరికి ఒప్పుకోక తప్పలేదు. ఒక స్పెషల్ ప్లేను కంటాక్టు చేశారు. ప్లేను బయలుదేరాకా అవి బర్మాదేశపు వజ్రాలనీ, వారు దొంగలనీ నాకు తెలియదు. తెలిసే సమయానికి పరిస్థితి చెయ్యి దాటి పోయింది. అనుకోకుండా దురదృష్టవశాత్తూ ప్లేనుకు యాక్సిడెంట్ అయి కూలిపోయింది. పైలట్ తో సహా వారందరూ మరణించారు. నన్ను నువ్వు రక్షించావు. తిరిగి ఆ వజ్రాలకోసం వాళ్ళతో చేయి కలపక తప్పలేదు. అవి వెతకి బర్మా ప్రభుత్వానికి అందచేయాలనే నా ప్రయత్నం.

మా ఫాదర్ కి మొదట ఈ పని ఇష్టంలేదు. నా పట్టుదలవల్లే నిన్ను వాటిని వెతకి పెట్టమన్నారు. నేను తిరిగి ఈ గాంగ్ లో చేరినట్టు మా డాడీకి తెలియదు."

"రాత్రి నన్ను వాళ్ళ చేతులలోంచి ఎలా రక్షించ గలిగావు?" అడిగాడు షాడో.

"నిన్ను బంధించి నాకు తెలియచేశారు. ఇంట్లో చెప్పకుండా వచ్చాను. నీకు ఆ వజ్రాలు ఎక్కడున్నాయో తెలుసునని వారి నమ్మకం. ఎల్లాగైనా నీ దగ్గిరనుంచి ఆ రహస్యం రాబట్టమని చెప్పారు. నిన్ను నాకప్పగించి వెళ్ళిపోయారు" అన్నది మెల్లిగా.

"నీకు ఎలా కృతజ్ఞతలు చెప్పాలో తెలియటం లేదు షీలా" ఆర్ధంగా అన్నాడు షాడో.

గట్టిగా నిట్టూర్చింది షీలా. "నేను ఎందుకు చేశానో తెలుసా మాధవ్?" అని దగ్గిరకు చేరింది.

షాడో చిరునవ్వు నవ్వాడు. బిందూ ఒకవైపు, కోపంగా చూస్తున్నట్లు ఫీలయ్యాడు. కాని చేసేదేముంది?

"నాలాంటి దొంగతోనూ, ఖూనీకోరుతోను పొందు అంత మంచిది కాదమో?" ప్రొటెస్ట్ చేశాడు.

లేచి గుమ్మం దగ్గిరకు పోయింది. టైట్ పాంట్ లో నుంచి ఎత్తయిన పిరుదులు షాడోకు మత్తెక్కించాయి. 'హెల్ విత్ ప్రిన్స్ పల్స్' అనుకున్నాడు.

"షీలా! మాట" అని పిలిచాడు.

మంచం దగ్గిరకు వచ్చి నిలచింది. "మాధవ్! కొంచెం విశ్రాంతి తీసుకో. స్నానంచేసి, బల్లమీదవున్న ఆహారం తీసుకో. నేను ఒక గంట తర్వాత వస్తాను."

"నువ్వేం చెబితే అది చేస్తాను" అన్నాడు షాడో. చెయ్యక తప్పే దేముంది.

గట్టిగా మాటలాడితే పోలీసులకు పట్టిచ్చినా దిక్కులేదు.

"నా ప్రాణాలను కాపాడినవారికి కృతజ్ఞత చూపటం నా విధి" అంటూ షాడోమీదికి వంగింది.

ఆమె పెదవులు అతని ముఖాన్ని సమీపించాయి. జుట్టు భుజాల మీద నుంచి ముందుకు పడి షాడో ముఖాన్ని కప్పేసింది. నాలికతో అతని పెదవులపైన రాసి, లేచి నుంచుంది. చెయ్యిజాచి ఆమెను పట్టుకోబోయాడు షాడో. ఒక్కగంతులో వెనక్కు తప్పించుకొని నాలిక బయటపెట్టి వెక్కిరిస్తూ వెళ్ళిపోయింది షీలా.

గదిలో ఒంటరిగా మిగిలిపోయాడు షాడో.

లేచి కూర్చుని, చేతులను గట్టిగా విదిలించాడు. మంచం దిగేసరికి కళ్ళు తిరిగాయి. తడుముకుంటూ మంచంకోడు పట్టుకొని నిలదొక్కు కున్నాడు. వళ్ళంతా నొప్పులుగా వుంది. ఎడమభుజం చిమ చిమ లాడుతుంది.

తన అవస్థకు కారకులయిన వారందరికీ రెట్టింపు బాధ చూపించాలని నిశ్చయించుకున్నాడు.

తూలుతూ అటాచ్ డ్ బాత్ రూమ్ లోకి పోయి శుభ్రంగా స్నానం చేశాడు. తలదిమ్ము పూర్తిగా తగ్గిపోయింది. ఉత్సాహంగా రూమ్ లోకి వచ్చాడు. తిరిగి అదే బట్టలు వేసుకున్నాడు. జేబులో చేతులుపెట్టి తడుముకున్నాడు. ఖాళీ. వంద రూపాయల చిల్లర పోయింది.

ఈ జేబులు కొట్టే వాళ్ళు సంప్రాప్తమయ్యారేమిటి భగవంతుడా అనుకున్నాడు. బూటులో ఉన్న కత్తి కూడా గల్లంతయింది.

కిటికీ తెరచి బయటకు చూశాడు. కోస్గిల్ పట్టణానికి దూరంగా ఒక కొండమీద వున్నాడతను. అరచి పీక్కున్న తనగోల ఎవరికీ వినిపించదు.

పరిసరాలను గమనిస్తూ నుంచున్న షాడోకు, ఒక పొద పక్కన మానవాకారం కదలటం కనిపించింది. పరీక్షగా చూశాడు. గంగారాం!

"దుర్మార్గుడు ప్రాణాలు తీయకుండా, కాపలా వున్నాడను కున్నాడు" షాడో.

చెయ్యెత్తి సైగ చేశాడు. పాక్కుంటూ కిటికీ దగ్గరకు వచ్చాడు గంగారాం.

"గురో! ఎలా వున్నాయి దెబ్బలు" అంటూ చిన్నగా నవ్వి నవ్వి కిటికీలోంచి చెయ్యి దూర్చి నెత్తిమీద మొట్టాడు షాడో. "నీ పని తర్వాత చెపుతాలే—" అంటూ.

సీరియస్‌గా జరిగిందంతా చెప్పాడు. "ఇక నువ్వు వెళ్ళు గంగారాం. నీ దగ్గర చిన్న కత్తేమైనా వుందా?" కత్తిని తీసుకుని గంగారాంను పంపించాడు.

మంచంమీది దుప్పటికింద దాచాడు కత్తిని.

జరిగిన సంఘటనలు నెమరు వేసుకుంటూ పచార్లు చేయసాగాడు.

ఆ బంగ్లాలో ఉన్న గదులన్నీ తిరిగి చూశాడు. బయట ద్వారానికి తాళం పెట్టివుంది. బయటకు పోవటానికి వీలులేదు. ఒక గదిలో టెలిఫోన్ ఉంది. కాని దానిని ముట్టుకోలేదు లేనిపోని గొడవ దేనికి అనుకుంటూ.

తిరిగి తన మంచం దగ్గిరికి వచ్చాడు షాడో. టేబిల్ మీద కొన్ని పొట్లాలు పెట్టి వున్నాయి. విప్పదీసి చూశాడు. బ్రెడ్డు శాండ్ విచెస్ వున్నాయి వాటిలో.

షీలాను మెచ్చుకుంటూ వాటిని ఖాళీచేసాడు. కూజాలో వున్న మంచినీళ్ళను త్రాగి సిగిరెట్టు వెలిగించి పక్కమీద నడుం వాల్చాడు.

కారు వచ్చిన శబ్దం విని లేచి కూచున్నాడు. రెండు పాకెట్లు పట్టుకొని షీలా లోపలికి వచ్చింది. "ఫర్వాలేదు ఇప్పుడు మనిషివి అనిపిస్తున్నావ్!" అంటూ ఆ పాకెట్లను బల్లమీద పెట్టింది. విస్కీవాసన షాడో ముక్కులో సోకింది.

ఆమె నడకలోనూ, కళ్ళ మెరుపులోనూ, పెదవి విరుపులోనూ ఆ సంగతి తెలిసిపోయింది. షాడో ప్రక్కగాపోయి అలమరలో ఉన్న రేడియో గ్రామ్ ఆన్ చేసింది. చక్కటి ఫారిన్ మ్యూజిక్ అలలు అలలుగా వినిపించసాగింది.

పాకెట్స్ లోంచి సిగిరెట్టుపెట్టె తీసి ఒక సిగిరెట్ వెలిగించుకుంది షీలా!

షాడోమీదకు పొగ వదులుతూ సమీపించింది.

"కాస్త పోలీసుల అలజడి తగ్గేదాకా నువ్విక్కడే ఉండవచ్చు మాధవ్! నీకేం భయంలేదు. నేనున్నంత కాలం ఆ గాంగ్ నీ ఛాయలకూడా రారు. డ్రింకు తీసుకుంటావా?" అడిగింది.

పక్కరూమ్ లోకిపోయి రెండుక్షణాల్లో తిరిగి వచ్చింది. రెండు గ్లాసులనిండా ఐస్ క్యూబ్స్ వేసికొని వచ్చింది. ఒక పాకెట్ లో నుంచి రమ్ సీసా తీసి రెండు గ్లాసుల్లోనూ సగంవరకూ నింపింది.

ఒక గ్లాసు షాడోకిచ్చి అతని పక్కన కూర్చుని నెమ్మదిగా సిప్ చేయసాగింది షీలా.

"మీ ఫాదర్ ఏం సహాయం చేయలేరా?" డ్రింక్ తాగుతూ నెమ్మదిగా ప్రశ్నించాడు షాడో.

"తప్పకుండా చేస్తారు మాధవ్! నువ్వేం బెంగపడకు పక్కకు తిరిగి కాలుమీద కాలు వేసుక్కూర్చుంది.

ఆమెతోపాటు ఆమె వక్షోజాలుకూడా అందంగా కదిలాయి.

గ్లాసు నోటిదగ్గర పెట్టుకుంటూ షాడోకి కన్నుకొట్టింది.

"అడవిలో ఒంటరిగా ఎలా జీవిస్తావు? మాధవ్" అంటూ.

"బోరు కొడితే కోస్టల్ కేసి వస్తాను. సరదాగా రెండు రోజులు గడిపి మళ్ళీ పోతాను" అన్నాడు షాడో.

"ఆ సరదాలో లేడీస్ కూడా వుంటారు కదూ?" పెద్ద జోకు వేసినట్లు విరగబడి నవ్వింది.

షాడో కూడా జతకలిపి నవ్వాడు.

షాడో పక్కన వాలిపోయింది షీలా. అతని భుజం మీద తలపెట్టి, మెడను పళ్ళతో కొరకసాగింది.

ఆమె నడుంమీద చెయ్యివేసి దగ్గిరకు లాక్కున్నాడు. బ్లవుజు మీద చెయ్యి వేశాడు. చటుక్కున తలపక్కకు తిప్పింది...నోటితో అతని నోరు మూసివేసింది.

"బటన్స్ వెనకాల ఉన్నాయి హనీ" మెల్లగా చెవులో చెప్పింది.

అతని స్పర్శకు ఆమె శరీరం వింత అనుభూతితో వణికిపోయింది.

"నన్ను చంపేస్తున్నావు మాధవ్! ఇంక బ్రతకలేను!"

"నేను తోడున్నానుగా షీలా" అన్నాడు ఆమె బుగ్గలు నిమురుతూ.

ఒకసారి లేచి కూర్చుంది షీలా. రబ్బరు బంతుల్లాంటి ఆమె వక్షోజాలు అతని మతి పోగొట్టాయి. దగ్గిరకువస్తున్న అతని చేయి పట్టుకుని తన చెంపలకు ఆనించుకుంది. "మాధవ్! మనిద్దరం ఎక్కడి కయినా పారిపోదాం. నీ షాడో బ్రతుకు వదలిపెట్టి నాతోవస్తే హాయిగా జీవించవచ్చు" అన్నది మత్తుగా.

"మనదగ్గిర డబ్బులేనిదే ఏం చేస్తాం? షీలా! ప్రేమ తిని బ్రతకలేంగదా!"

"నా దగ్గిర కొంత డబ్బు వుంది—"

"కాని నా దగ్గిర చిల్లిపయిసాకూడా లేదు. వున్న వంద రూపాయలూ ఆ వెధవలు కొట్టేశారు" షాడో మీదకు వంగింది. ఆమె వక్షోజాలు అతని స్పర్శకోసం యాచిస్తున్నాయి. ఎర్రటి పెదవులు ఆహ్వానిస్తున్నాయి.

"నిజంగా మాధవ్ ఏమీలేదా?" మత్తుగా అడిగింది.

చెళ్ళుమని చెంప పగలగొట్టాడు షాడో. బిత్తరపోయి చెంప పట్టుకుని అతనివంక చూసింది.

"నువ్వు సినిమాల్లో చేరాల్సింది షీలా. నటిగా బాగా రాణిస్తావు."

"ఏమిటి మాధవ్ ఏమిటి నువ్వంటున్నది?"

షాడో బిగ్గరగా నవ్వాడు. "చాలా కష్టపడ్డావు షీలా. వాళ్ళు చితక్కొట్టి తెల్సుకుందామనుకున్నారు. నువ్వు సెక్సులో ప్రయత్నించావు. అందుకనే వాళ్ళ దగ్గర్నుంచి నన్ను తీసుకువచ్చి ఇక్కడ పెట్టావు. నువ్వు వాళ్ళ మనిషివేనన్న మాట" అన్నాడు వికటంగా.

నాగుపాములా బుసలుకొట్టింది షీలా.

"నా సర్వస్వం నీకు అర్పించాలనుకున్నాను. నామీద ఆ మాత్రం నమ్మకం లేదా?"

"నిజమే షీలా, నేనెన్నోవాణ్ణి?" సున్నితంగా ప్రశ్నించాడు.

చేతికందిన రమ్ గ్లాసు తీసుకుని షాడోమీదికి విసిరింది. వంగో బట్టి తప్పించుకోగలిగాడు షాడో. లేకపోతే తల పగిలిపోయేది.

"నా దగ్గర్నుంచి రహస్యాలు తెలుసుకోటానికి ప్రయత్నించావు. నీ వంతు అయిపోయింది. ఇక నా వంతు. పద ఒక చోటకి పోదాం" అంటూ చెయ్యి పట్టుకోబోయాడు. అరవటానికి నోరు తెరిచింది. చెయ్యెత్తాడు షాడో బెదిరిస్తూ.

"నిజమే మాధవ్! నువ్వు చెప్పిందంతా నిజమే, నేను పాపిష్టిదాన్ని. నన్ను ఏంచేసినా పాపం లేదు" అంటూ బెడ్ మీదపడి ఏడ్వసాగింది.

తిక్కరేగింది షాడోకు. ఈ ఆడవాళ్ళకు ఏడుపు ఎందుకిచ్చాడో దేవుడు అనుకుంటూ తలపక్కకు తిప్పుకున్నాడు. బొడ్డుమీద చల్లగా తగిలింది క్రిందికి చూశాడు.

.44 రివాల్వరు నోరు తెరుచుకుని అతని కడుపుకి ఆనించి ఉంది.

* * *

స్థంభించిపోయాడు షాడో.

తేరుకొని "నీ అందం పనిచేయకపోతే, అవసరం వస్తుందని వెంట తెచ్చుకున్నావా" హేళనగా అడిగాడు.

"నీ మొఖం చూస్తేనే డోకు వస్తుంది. నీ మీద ప్రేమగూడానా" అంటూ పక్కమీద నుంచి లేచింది. రివాల్వరు స్టెడీగా అతనివైపు గురిపెట్టి బ్లౌజు సరిచేసుకుంది.

"నేనే నిన్ను ఒకచోటికి తీసుకుపోతాను మిస్టర్ షాడో! నువ్వు అనుకున్న చోటువంటిది కాదు సుమా" అంది విషపునవ్వు నవ్వుతూ.

"ఆ వెధవల దగ్గిరకేగా? యింకెక్కడికి తీసుకుపోతావ్" అన్నాడు నిర్లక్ష్యంగా బెడ్ షీట్ కిందవున్న కత్తిని గురించి ఆలోచిస్తూ.

"వాళ్ళ దగ్గరికి పోనవసరంలేదు మిస్టర్. ఫోనుచేస్తే వాళ్ళే పరుగెత్తుకుంటూ వస్తారు."

"నువ్వూ, వాళ్ళూ ఏకమైనా నన్నేం చేయలేరు."

"మాధవ్ ప్రశాంతంగా ఆలోచించు. ఎందుకీ బాధలు పడతావ్? మమ్మల్ని ఎదిరించి నిలువలేవు. ఆ వజ్రాలు ఎక్కడున్నాయో చెప్పు వదిలేస్తాం"

"మీకు ఎన్నిసార్లు చెప్పినా బుర్రకెక్కదేం. వజ్రాలు నా దగ్గిరలేవు. వాటిని చూడనుకూడా లేదు. నా మాట నమ్మరేమిటి?" చిరాకుగా గొణిగాడు.

బ్రహ్మరాక్షసిలాగా హుంకరించి నిలచింది షీలా.

"అబద్ధం అది..." ఎవరో గొంతు నొక్కినట్లు మాటలు ఆపేసింది షీలా.

"ఆపేశావేం? కానియ్యి. కాబిన్ లో వున్నాయనుకుంటున్నావా? వెతకకపోయారా?" అప్పటికే కాబిన్ అంతా నాలుగుసార్లు గాలించి వదిలిపెట్టారని షాడోకు తెలియదు.

షీలా యిలా ప్రయత్నించటానికి కారణం ఏమిటి? వజ్రాలమీద ఆశా? ఆమె లీడరా?

"ఈ సమయంలో మీ నాన్న రావాలిటు" నవ్వుతూ అన్నాడు షాడో.

ఉలిక్కిపడింది షీలా. "మా నాన్న పేరేత్తావంటే చంపేస్తాను" రివాల్వర్ ఊపుతూ బెదిరించింది.

"మీ అందర్నీ మొదటి నుంచీ అనుమానిస్తూనే వున్నాను డార్లింగ్! అందులో నిన్నూ నీ..." అంటూ మధ్యలో ఆపాడు.

విలాసంగా నవ్వింది షీలా.

"మొట్టమొదట నీ మీద నిజంగానే మోజు పడ్డాను మాధవ్. నిన్ను కూడా మా గాంగ్ లో చేర్చుకుందామనుకున్నాను. అంతకుముందే నువ్వు కాకలు తీరిన దొంగవని తెలిసి మనసు మార్చుకున్నాను."

"ఊ! నడువ్" అంటూ ఫోనువున్న గదిలోకి దారితీసింది. తప్పించుకోవటానికి వీలులేకుండా రివాల్వర్ గురిపెట్టి వుంచింది.

"ఆ బల్లమీద కూర్చో" ఆజ్ఞాపించింది కఠినంగా.

షాడో తలవంచక తప్పలేదు. ఫోను దగ్గిరకు పోయి రిసీవర్ ఎత్తి మెడకింద బెట్టుకొని ఎడమ చేతితో డయల్ చేయసాగింది.

బల్లవద్దకు పోతూ కాలుకుకాలు కొట్టుకొని తూలాడు షాడో. రివాల్వరు రెడీగా పట్టుకుంది షీలా.

"సారీ డియర్. కాలు తొక్కుకున్నాను" అంటూ వంగి కుడికాలు రెండు చేతులతో రుద్దుకోసాగాడు. షీలా ఫోను డయల్ చెయ్యసాగింది.

కాలు రుద్దుకుంటూ, కింద పరచివున్న తివాసీని గమనించాడు షాడో. షీలా సరిగ్గా ఒక చివర నుంచొనివుంది. వుండి వుండి రెండు చేతులతోనూ తివాసీని పట్టుకొని బలంగా గుంజాడు. తివాసీతోపాటు జారి వెల్లకిలా పడిపోయింది షీలా. రిసీవరు కిందపడి పగిలిపోయింది. ఆమె చేతిలోంచి రివాల్వరు ఎగిరి గదిమూలకు పోయింది. బల్లకు నడుము తగిలి, దిమ్మరపోయి పడివుంది.

ఆమె లేచి కూర్చునేదాకా, పక్కనేపోయి కూర్చున్నాడు షాడో.

మెల్లగా కళ్ళువిప్పింది షీలా. "యూ బ్రూట్!" అంటూ లేచి అతని మీద కలియబడింది. రెండు చేతులూ వెనక్కు విరిచి పట్టుకున్నాడు షాడో. ఒక చేతితో దవడలకింద నొక్కి పట్టుకొన్నాడు. బాధతో నోరు తెరచింది. తెరుచుకున్న పెదవులమీద ఘాటుగా ముద్దు పెట్టుకున్నాడు.

"నీలాంటి సుకుమార సుందరీమణుల తెలివి అన్ని సమయాల్లో పనికిరాదు షీలా" అన్నాడు.

"మా వాళ్ళు వస్తారు. నేను పిలిచినా పిలవకపోయినా ఈ పాటికి వస్తూవుంటారు. వారి చేతుల్లోంచి నువ్వెక్కడికీ తప్పించుకుపోలేవు" బెదిరించింది.

భయం నటించాడు షాడో. "నన్ను భయపెట్టేస్తున్నావ్ డార్లింగ్" అంటూ.

"మాట్లాడకుండా ఆ కుర్చీమీద కూర్చో, లేకపోతే నీ అందమైన ముఖాన్ని ఎవ్వరూ కన్నెత్తి చూడకుండా తయారు చేస్తాను" కొంచెం గట్టిగానే అన్నాడు.

మాట్లాడకుండా షాడో చెప్పినట్లు పోయి కుర్చీమీద కూర్చున్నది. మూలపడిన రివాల్వరు తీసుకొని పాంటు జేబులో పెట్టుకున్నాడు.

మంచం ఉన్న గదిలోకి పోయి దుప్పటి కిందవున్న కత్తిని బూటులో పెట్టుకొని వచ్చాడు.

"ఇప్పుడు మనం నీ కారులో షికారుకు పోతున్నాం. గొడవచేస్తే! ఇందాక చెప్పింది గుర్తువుందికదూ?"

మాట్లాడకుండా తలవూపింది షీలా.

ఆమె చెయ్యి గట్టిగా పట్టుకుని, తలుపుతీసి, కారు దగ్గిరకు తీసుకు వచ్చాడు. కారు డోరు తెరిచి, స్టీరింగ్ ముందు కూర్చోబెట్టాడు. తలుపు వేసి, తను తిరిగి వచ్చి పక్కన కూర్చున్నాడు. కారు స్టార్టు చేసింది షీలా. కారు అద్దాలన్నీ ఎత్తివేశాడు. దారిన పోయేవారి వంకచూసి అరిచిందంటే, కిడ్నాప్ చేస్తున్నాడని పట్టుకోగలరు అనుకుంటూ.

కారును బాక్ చేసి కొండదిగి టవున్ లోకి పోనిచ్చింది. ఒక బిల్డింగ్ మీద టవర్ క్లాక్ లో టైం చూశాడు షాడో. మధ్యాహ్నం మూడు గంటలయింది.

నీరసంగా ఎదురుచూపులు చూస్తూ నడుపుతున్నది కారును. స్కూళ్ళనుంచి వచ్చే పిల్లలతోనూ, కార్లతోనూ రోడ్డు మహారష్ గా వుంది.

దగ్గిరలోవున్న మౌంటెన్ రోడ్డుకు పోనీయమన్నాడు.

షాడోవంక తదేకంగా చూసింది. "మాధవ్ ప్లీజ్" అంది తడి ఆరిపోయిన గొంతుకతో.

షాడో మాట్లాడకుండా రోడ్డువైపు చూస్తూ కూర్చున్నాడు.

గ్రుడ్ల నీళ్ళు కుక్కుకుంటూ కారు తోలసాగింది షీలా. క్రమంగా టవును విడిచి కొండల్లోకి ప్రవేశించింది కారు.

షాడో జాగ్రత్తగా ఒక కన్ను వెనుక వైపు వేసి వుంచాడు, తన నెవరైనా ఫాలో అవుతున్నారేమోనని. నల్లని అంబాసిడర్ కారు జేగురురంగు కొండలమీద మైళ్ళదాకా కనబడుతుంది. పది మైళ్ళు పోయిన తరువాత ఒక చోట మలుపు దగ్గిర కారు ఆపింది షీలా.

"మాధవ్! సిగిరెట్టు కాల్చుకోవాలి" అంది జాలిగా మొఖంపెట్టి.

ఆమె హేండ్ బేగ్ లోనుంచి సిగిరెట్టు తీసి ఇచ్చాడు. తను ఒకటి వెలిగించుకున్నాడు. షీలా గుండెల్లోకి పీల్చి వదులుతోంది పొగ.

"నేనడిగే ప్రశ్నలకు సూటిగా సమాధానం చెప్పు షీలా."

"అడుగు మాధవ్. జరిగినదానికి ఐయామ్ రియల్లీ సారీ" అన్నది.

ఇందాకటినుంచి బెదిరిన లేడిలాగా కూర్చున్న షీలా ఎందుకింత కామ్ గా మాట్లాడుతున్నది? చుట్టూ పరికించాడు షాడో. వెనకాల ఒక మైలు దూరంలో ఒక పాత ట్రక్కు "డబ డబ" మని శబ్దం చేసుకుంటూ

వస్తున్నది. ఎవరైనా వెంబడించే పక్షంలో అటువంటి పాత ట్రక్కుమీద, అంత శబ్దం చేసుకుంటూ ఎందుకు వస్తారు?

కొద్ది మైళ్ళ దూరంలో వున్న తేయాకు తోటలకు సంబంధించిన వెహికల్ అయివుంటుందని అనుకున్నాడు షాడో.

రోడ్డువైపువున్న విండో గ్లాసులను దింపాడు. చల్లటి కొండగాలి మురిపిస్తూ వారిని సేద తీర్చింది. నెమ్మదిగా నీడలు కొండల్లో తివాసీలలాగా పరచుకుంటున్నాయి. సూర్యుడు కొండల వెనుకకు పోతున్నాడు.

"మీకు ఆర్డర్లిచ్చే గాంగ్ లీడర్ ఎవరు?"

"ఇంకెవరు? జాన్సన్ నీకు తెలుసుగా!"

"ఆ వెధవ లీడర్ కూడానా? మాట్లాడటంకూడా సరిగ్గారాదు. కొంప తీసి నువ్వు కాదుగదా బ్రాంచి లీడరువు?"

"నీ పరిహాసాలు కట్టిపెట్టు మాధవ్!" నెర్వస్ గా నవ్వింది.

ఓల్డు ట్రక్కు పెద్దశబ్దంతో పక్కనుంచి పోయింది. ఆ డ్రైవరు వారివంక చూడకుండానే వెళ్ళిపోయాడు. తేలికగా వూపిరి పీల్చుకున్నాడు షాడో.

"ఈ గొడవలన్నిటికీ వెనకాల పెద్ద తలకాయ ఒకటి వుంది. అతని పేరు కావాలి నాకు!"

"నా మాట నమ్ము మాధవ్! జాన్సనే దీనికి లీడర్" నచ్చ చెప్పటానికి ప్రయత్నించసాగింది.

"మాధవ్! ఇప్పటికైనా మించిపోయింది లేదు. ఆ పాకెట్టు ఎక్కడ వుందో చెప్పు...నీకు తగిన విధంగా బహుమానం ఇస్తాం!" మరొక్కసారి తన మత్తుకళ్ళతో అతన్ని మెస్మరైజ్ చేయటానికి ప్రయత్నించింది.

ఇద్దరూ సీటులో అడ్డంగా ఎదురెదురుగా కూర్చుని వున్నారు. షాడో మీదనుంచి వెనుకవైపు చూస్తోంది షీలా. ఒకసారి తొందరగా దమ్ములాగి సిగిరెట్టు బయటకు విసిరింది. ఆ కళ్ళు అటూ ఇటూ కదలటం షాడోకు అనుమానం కలిగించాయి. రోడ్డుపై నున్న కొండ చెరియవైపు చూసి పక్కకు తిరిగాయా కళ్ళు.

"ధన్" మన్న రైఫిల్ శబ్దంతో కొండలన్నీ మారుమ్రోగాయి. తలవంచి సీటుకడ్డంగా పడి దొర్లాడు షాడో. కిటికీ తలుపుకు తగిలివచ్చి చేతికి గుచ్చుకుంది రైఫిల్ బుల్లెట్. షీలా కెవ్వుమన్నది. ఆమెను పట్టుకొని తనమీదికి లాక్కుని అడ్డం పెట్టుకున్నాడు. ఇంకో గుండు వచ్చి కారు ఫ్రంట్ గ్లాసును పగులగొట్టింది.

మళ్ళీ పిచ్చిగా అరిచింది షీలా.

పక్కనేవున్న తలుపు తెరచుకొని బయటకు దొర్లాడు షాడో. చాలా తెలివిగా కవర్ చేశారు శత్రువులు. ఓల్డుట్రక్కులో దాక్కుని ముందుకు పోయి, కాలినడకను వచ్చి పొజిషన్స్ తీసుకొని వుంటారు.

గవర్నమెంటు బాతులపేటకు పర్మిషన్ ఇచ్చింది. ఈ మోతలు విన్నా ఎవరూ అనుమానించరు. ట్రాప్ చేశారనుకున్నాడు షాడో.

రోడ్డు పక్కనవున్న పొదలలోకి దూకి, పాక్కుంటూపోయి, ఒక చెట్టు వెనకాల దాగుకున్నాడు. పరిసరాలన్నీ నిశబ్దం వహించాయి. జేబులోనుంచి షీలా రివాల్వరు బయటకు తీశాడు. ఎడమ మోచేతికి బుల్లెట్ తగిలి నెత్తురు కారుతోంది. జేబులోనుంచి హేండ్ కర్చీఫ్ తీసి కట్టుకున్నాడు. పైనుంచి ఒక కంఠం వినిపించింది.

"మాధవ్! బయటకురా! ఇక మా చేతిలోనుంచి తప్పించుకోలేవు. బయటకు రా! లొంగిపోకపోతే కాల్చి పారేస్తాం."

షాడో సమాధానమేమీ చెప్పలేదు.

"ఓకే ఫ్రెండ్స్. అతన్ని చుట్టూ తిరిగిరండి. అదిగో ఆ విరిగిన చెట్టు చాటున వున్నాడు."

ట్రక్కు డ్రైవర్ని ఎందుకు గుర్తుపట్టలేకపోయాడో అర్థమైంది షాడోకు. స్పైడర్ స్థానంలో వచ్చిన పందికొక్కువాడే! వాడిని వెలుగులో చూడలేదు. లేకపోతే గుర్తుపట్టి తప్పించుకొనేవాడు. జాన్సన్ కు ఇంత తెలివిలేదు. ఆ పందికొక్కే గాంగ్ లీడరా?

వాళ్ళు కదులుతున్న శబ్దంవిని రెడీగా ముందుకు దూకటానికి, పొంచి కూర్చున్నాడు షాడో.

*    *    *

అయితే వారు తనను చుట్టు ముట్టేదాకా ఆగలేదు షాడో. నెమ్మదిగా, నిశ్శబ్దంగా వెనుకకు జారుకున్నాడు. కొండవాలులోకి పోయి గబగబా బండరాళ్ళలోకి ప్రవేశించాడు. పెద్దపెద్ద పొదలు, చెట్లు అరణ్యం మొదలయింది.

"జాగ్రత్త. అతని దగ్గిర నా రివాల్వరుంది అంటున్న షీలా మాటలు విన్పించాయి. నెమ్మదిగా లోయ మొదట్లోకి వచ్చాడు. ముందు వంద గజాల ఖాళీస్థలంవుంది. ఎటువైపు నుంచి వస్తున్నారో చూసి, ఆ ప్రదేశాన్ని దాటుదామని, ఒక పొదలో ఆగాడు షాడో. అతను ఎంతోసేపు వేచియుండనవసరం లేకపోయింది. పొదలను విరగ తొక్కుకుంటూ అటువైపే వస్తున్న శబ్దం వినిపించింది. ఇద్దర్ని ప్లేస్ చెయ్యగలిగాడు. మరి మూడవవాడు ఏడీ! ముగ్గురేనా ఇంకా చాలా మంది వచ్చారా?

మరునిముషంలో అతని కుడివైపున పొదలు కదిలి శబ్దం చేసాయి.

ఒక మనిషి ముందుగా ఖాళీస్థలాన్ని చుట్టివచ్చి షాడో పక్కకు చేరుకున్నాడు. రక్తం కారుతూ వుండటంవల్ల షాడో కళ్ళు మసకలు కమ్మనారంభించాయి. వళ్ళంతా చెమటలు పట్టసాగింది.

క్రమంగా అడుగుల చప్పుడు దగ్గిరకు రాసాగింది. కొంచెం పైకిలేచి చూశాడు. రెండు మూడు గజాలదూరంలో పొదలచాటున కనుపించాడు ఒక వ్యక్తి. రివాల్వరు రెడీగా పట్టుకున్నాడు.

మామూలు పరిస్థితుల్లో, షాడోకు ఆయుధాలతో పనిలేదు. కాని ఈ పరిస్థితివేరు. మరుక్షణంలో ఆ మనిషి ముఖం క్లియర్ గా కనుపించింది. అతనే ట్రక్కును డ్రైవ్ చేసిన వ్యక్తి. అప్పుడు చిరిగి పోయిన టోపీ ఒకటి పెట్టుకొని వుండటం మూలాన గుర్తించలేక పోయాడు.

షాడో క్షణకాలం తటపటాయించాడు. ఇప్పుడు తను కాలుస్తే, తను వున్న చోటు అందరికీ తెలిసిపోతుంది. వాడు చూడనంతకాలం, అలాగే మాట్లాడకుండా కూర్చుందామని నిశ్చయించుకున్నాడు. మోకాళ్ళమీద లేచి తొంగి చూస్తున్న వాడు కాస్తా తిరిగి మామూలుగా కూర్చున్నాడు షాడో. మోకాలుకింద ఎండుకొమ్మ ఫట్ మంటూ విరిగింది.

వెతుకుతున్న గాంగ్ మనిషి శబ్దం వచ్చిన వైపు పిస్టల్ గురిపెట్టి కాల్చాడు. షాడో చెవ్వు పక్కనుంచి దూసుకుపోయిందా గుండు. నిశ్శబ్దంగావున్న ఆ పరిసరాలన్నీ తిరిగి మోతలతో మారుమోగి పోయింది.

"అతన్ని కొట్టావా?" అని అడిగింది ఒక స్వరం.

"నువ్వు కూడా రారాదూ! ఇద్దరం కలిసే చూద్దాము" అని సమాధానమిచ్చాడు పిస్టల్ పేల్చిన వ్యక్తి.

అప్పటికి చీకట్లు పూర్తిగా ఆవరించుకున్నాయి. రెండు గజాలు దాటితే ఏ వస్తువూ కంటికి కనుపించటం లేదు.

నెమ్మదిగా వెనుకకు జరగసాగాడు షాడో. ఇంకోసారి షాడో మొదట వున్న పొదలోకి ఫిస్టల్ పేల్చాడు ఆ వ్యక్తి. ఒక రాయితీసి అదే పొదల్లోకి విసిరాడు షాడో. మళ్ళీ కాల్చాడతను.

రెండు చేతులూ నోటిదగ్గిరచేర్చి, దెబ్బ తగిలినట్లు మూలిగాడు షాడో. వెంటనే గబ గబా వెనక్కుపోయి, ఖాళీస్థలం పక్కగా పొదలలో దూరాడు.

ఇద్దరు వ్యక్తులు షాడో మొదటవున్న పొద దగ్గిరకు పరుగెత్తుకు వచ్చారు. పొదంతా వెతకి, గట్టిగా తిట్టసాగారు. ఇంకోవ్యక్తి సరిగ్గా షాడో వున్న పొదకు దగ్గిరలోవచ్చి ఆగాడు. షాడో అతన్ని గమనించి, పొదలలోకి దూరిపోసాగాడు.

షాడో చెయ్యి నెప్పి పెట్టసాగింది. చెవులలో వింతశబ్దాలు వినిపించ సాగాయి. తడబడుతూ లేచి నిలబడటానికి ప్రయత్నించాడు.

లేవలేక పొదలోనే స్పృహతప్పి పడిపోయాడు.

చలితో ఒళ్ళు గడ్డుకుపోయేసరికి షాడోకు స్పృహ తెలిసింది. చుట్టూ చూశాడు, పొదలలో తనొక్కడే వున్నాడు. మోకాళ్ళమీద పాకుకుంటూ బయటికి వచ్చాడు. ఎడమచెయ్యి చచ్చుపడినట్లు పనికి రాకుండా పోయింది. రక్తం కారి చెయ్యి, ఎడమకాలు పాంట్ మీద గడ్డకట్టుకు పోయింది.

ఒక చెట్టును ఆధారంగా చేసుకొని లేచి నిలబడ్డాడు. తిరిగి రోడ్డుపైకి పోవటానికి కొండ ఎక్కాలి. అంత శక్తిలేదు అతని ఒంట్లో. కొండవాలు లో దిగసాగాడు. ఇందాక రోడ్డుమీదనుంచి ఒక ఇంటిని చూశాడు. బహుశా టీ ప్లాన్ టేషన్ వాళ్ళ బారెక్స్ కావచ్చు.

ఒక చిన్నవాగు కనపడితే, అందులో దిగి దాహం తీర్చుకొని, మొహం కడుక్కున్నాడు. వడ్డు ఎక్కి గడ్డిమీద పడుకున్నాడు. కొద్దిసేపు విశ్రాంతి లేకపోతే నడవమని మొరాయించాయి కాళ్ళు.

'తను విమానం కూలిపోయినప్పుడు మొదట వెళ్ళినందుకా, వాళ్ళు ఇంత అనుమానిస్తున్నది? నిజమైన మాధవ్ ను క్షుణ్ణంగా ప్రశ్నించాడు తను. అతనికి ఏమీ తెలియదని చెప్పాడు. ఇంకేదో తెలియని తిరకాసువుంది అనుకున్నాడు. లేచి కుంటుకుంటూ కనపడుతున్న బిల్డింగులకేసి బయలుదేరాడు. పడుతూ లేస్తూ, అష్టకష్టాలుపడి బిల్డింగును సమీపించాడు. అందులో ఎవరో టీ ప్లాన్ టేషన్ ఓనర్ నివసిస్తున్నాడు. కాని తలుపులు తాళాలు వేసి వున్నాయి. బహుశా టవున్ కి పోయివుంటారు.

చుట్టూ తిరిగిచూశాడు. ఒక కిటికీ తెరచివుంది. లోపల చువ్వలు లేవు. "థాంక్ గాడ్" అనుకొంటూ కిటికీ లోపలకు దూకాడు. ఎదురుగా ఒక కుర్చీ కనుపించింది. వెళ్ళి అందులో కూలబడ్డాడు.

షాడో మనస్సు సుడిగుండంలా తిరుగసాగింది. జరిగిన సంఘటన లన్నీ ఒకదాని తర్వాత ఒకటి జ్ఞప్తికి రాసాగాయి. తల దిమ్మెక్కి విపరీతమైన పోటు పుట్టటం ప్రారంభించింది.

కొంతసేపటికి తల క్లియర్ అయ్యి చుట్టూవున్న వస్తువులు కనుపించసాగాయి. తడుముకుంటూ పోయి గోడమీది స్విచ్ నొక్కాడు. లైట్లువెలిగి రూమంతా ప్రకాశవంతమయింది.

అది ఒక డ్రాయింగ్ రూమ్. ఒక వైపు షెల్ఫులో పుస్తకాలు వరుసగా పేర్చబడి వున్నాయి. ఒక టీపాయ్ మీద టెలిఫోను కనపడే సరికి ప్రాణం లేచివచ్చినట్లయింది షాడోకు. కాని ఆకలి అతని కాళ్ళను వంటగదిలోకి లాక్కుపోయాయి. రిఫ్రిజిరేటరులో మిల్కువుంది. కొన్ని కోడిగుడ్లు వున్నాయి. పక్కనేవున్న స్టవ్ ఆన్ చేసి ఆమ్లెట్ లు వేసుకొని తిన్నాడు. పాలన్నీ త్రాగాడు. నిండిన కడుపు సవరించుకుంటూ అరగంట తరువాత డ్రాయింగ్ రూమ్ లోకి వచ్చాడు.

ఫోను తీసుకొని హోటల్ పూర్ణిమకు కనెక్టు చేయమని ఆపరేటరును అడిగాడు. పక్క గదిలోవున్న గడియారం అర్ధరాత్రి

కావచ్చిందని తెలియచేసింది. నిద్రమొహంతో "హల్లో..." అంటున్న హోటల్ క్లర్కును గట్టిగా హెచ్చరించాడు. జూలియాను పిలవమని.

నిముషం తరువాత జూలియా ఫోను ఎత్తింది!

"హల్లో జూలియా! హౌ ఆర్ యూ? నేను మాధవ్ ను" అన్నాడు.

"వోహ్ " అంటూ వులిక్కిపడింది జూలియా. నిద్రమత్తంతా ఎగిరిపోయింది.

"మాధవ్! ఎక్కడనుంచి?" అడిగింది.

షాడో రెండు క్షణాలు ఆలోచించాడు. ఈ ఇంటి దగ్గిరకు రమ్మంటే ప్రమాదం. హౌస్ ఓనర్స్ ఏ నిముషంలోనైనా రావచ్చు.

మౌంటెన్ రోడ్డుమీదుగా ఓ పదిహేను మైళ్ళు రమ్మనమని చెప్పాడు. తనకు సరిగ్గా తెలియదని, నెమ్మదిగా డ్రైవ్ చేస్తూ వస్తే, చూసి ఆపుతాననీ చెప్పాడు.

"నీ గొంతు అదో మాదిరిగా వుందేం మాధవ్?" ఆందోళనగా అడిగింది.

"నువ్వు వస్తే బతికి బయటపడతాను, లేకపోతే గోవిందా?" అంటూ ఫోను పెట్టేశాడు.

దూరంగా కారు వస్తున్న శబ్దం వినిపించింది. ఓనర్స్ వస్తున్నారు కాబోలు అనుకుంటూ, బెడ్ రూంలోకి పరుగెత్తాడు. చేతికందిన

దుప్పటి ఒకటి భుజాన వేసుకొని, తిరిగి కిటికీలోనించి దూకి బయట పడ్డాడు. వందగజాలు పోయిన తరువాత గుర్తుకు వచ్చింది 'తను లైట్లు ఆర్పేయలేదని.'

ఒక ఫర్లాంగు దూరంపోయి వెనక్కు తిరిగిచూశాడు. కారు వచ్చి ఇంటిముందు ఆగింది. మనుష్యులు దిగి ఇంట్లోకి పోయారు. అక్కడే ఇంకో పది నిముషాలు నిలబడి పరీక్షించాడు. ఇంట్లోనుంచి గొడవ ఏమీ వినపడలేదు.

రిఫ్రిజిరేటరు తెరవలేదు కాబోలు అనుకుంటూ కొండమీది మెయిన్ రోడ్డువైపు నడక సాగించాడు, మిస్టర్ షాడో.

అంతవరకూ రక్తం గడ్డకట్టి వుండటంవల్ల రక్తస్రావం ఆగివుంది. కిటికీలోంచి దూకి పరుగెత్తటం మూలంగా, గాయం తెరుచుకొని రక్తం కారటం మొదలుపెట్టింది. దొంగిలించి తెచ్చిన దుప్పటి భుజాలచుట్టూ కప్పుకున్నాడు షాడో. చలి బాధ కొంచెం తగ్గింది.

'జూలియా కారుమీద మౌంటెన్స్ లోకి పదిహేను నిముషాల్లో రాగలదు. ఈ లోపల తను అక్కడికి చేరుకోలేకపోతే ఆమెను కలవటం అసంభవం.' అనుకుంటూ నడకవేగం హెచ్చించాడు. సమతలంగా వున్న నేలను వదలి కొండ చెరియ ఎక్కటం ప్రారంభించాడు. కొంత సేపటికి రోడ్డుచివర్ల పాతిన రాళ్ళు కనపడ్డాయి. అక్కడితో అతని శక్తి నశించింది. మిగిలిన కొద్దిదూరం పాకుకుంటూ పోయాడు. ఒక రాయి

పక్కన చేరి, దుప్పటి ముసుగు పెట్టుకొని ముణగదీసుకొని కూర్చున్నాడు. మళ్ళీ స్పృహ తప్పేటట్లు అనిపించిందతనికి. అలాగే బలవంతాన కళ్ళు తెరచుకు కూర్చున్నాడు.

కొంతసేపటికి టవున్ నుంచి ఒక కారు అటువైపు వచ్చింది. కాని అదే జూలియా కారని గుర్తుపట్టటం ఎలా?

ఒక మలుపు తిరిగి ఎత్తు ఎక్కుతూ మెల్లగా వస్తోందా కారు. దగ్గిరగా వచ్చిన కారుకేసి బయలుదేరాడు. కళ్ళు పచ్చబడి ఏమీ కనుపించటం లేదు. పిచ్చివాడిలా చేతులువూపుతూ కారుముందు పడిపోయాడు.

*   *   *

మెదడు నావరించుకున్న మత్తు తెరలను తొలగించటానికి ప్రయత్నిస్తూ లేచి కూర్చున్నాడు షాడో. కారు వెనుక సీటులో పడుకొని వున్నాడు. వళ్ళంతా వెచ్చగా వుంది. దుప్పటి ఇంకా భుజాలచుట్టూనే వుంది.

ఎక్కడ వున్నాను? అనుకొంటూ ముందుకు చూచాడు. ఫ్రంట్ సీటులో ఇద్దరు వ్యక్తులు వున్నారు. ఇద్దరూ హంటింగ్ కాప్ లు ధరించి వున్నారు. కారు కొండలమీదినుంచి, అరణ్యంవైపు పోతుంది. బ్రేకులు గూడా వేయకుండా టర్నింగ్ లు తిప్పుతున్నాడు అ డ్రైవింగ్ చేసే వ్యక్తి.

"ఇప్పుడు నాదివంతు!" అంటూ పక్కవాడి చేతిలోనుంచి బాటిల్ లాక్కుని గుటకవేశాడు డ్రైవరు.

"హే! ముందుకు చూడు!" అంటూ అరిచాడు పక్కవ్యక్తి. కారు కొద్దిలో లోయలో పడకుండా తప్పించుకొంది. కాని పక్కనే వున్న ఒక మట్టి దిబ్బకు గుద్దుకొని ముందు చక్రాలు మట్టిలో దిగబడిపోయాయి. హెడ్ లైట్లు వుంచి, ఇంజన్ ఆఫ్ చేశారు. అప్పుడు వారిద్దర్నీ చూడగలిగాడు షాడో. ఇద్దరూ తనకు కొత్తవాళ్ళు- శత్రువులు మాత్రం కాదు.

"మీరు లేచారా గుళువుగారూ" అంటూ తడబడింది ఒక నాలిక, వెనుకకు తిరిగి చూస్తూ-

"ఆ! ఇందాక అక్కడ అవుటయి పోయాననుకుంటాను" అన్నాడు షాడో తనుకూడా తాగి ఉన్నట్లు నటిస్తూ.

"కలెక్ట్ గా చెప్పారు సార్! దెబ్బేమణ్నా తగిళిందా! కింద పడినప్పుళు" అని ఫ్రెండ్లీగా అడిగాడు రెండవవ్యక్తి.

అవునన్నట్లు ముక్కుతో వికృతమైన శబ్దం చేశాడు షాడో.

ఇద్దరూ నవ్వుతూ షాడో భుజాలు విరిగేటట్లు చెరి ఒకవైపు చరిచారు

ఎడమ భుజంమీద దెబ్బకు గింగిరాలు తిరిగిపోయాడు షాడో. "వీళ్ళ హాస్యం తగలడ" అనుకొంటూ తిట్టుకున్నాడు మనసులో.

వారిద్దరూ ఫుల్ లోడ్ లో వున్నారు. అదీ ఒకందుకు మంచి దయింది షాడో విషయంలో. అతని దుప్పటి కిందవున్న గాయాన్ని గమనించలేకపోయారు.

"అతనిక్కూడా ఒక పెగ్గు ఇవ్వు" అంటూ షాడో చేతికి బాటిల్ అందించారు.

"థాంక్స్" అంటూ బాటిల్ ఎత్తి రెండు గుక్కలు వేశాడు నీరసించి పోయిన అతని శరీరంలోకి నెమ్మదిగా వేడి పుట్టటం ప్రారంభించింది.

"రేపు పొద్దున ఏమైనా సరే అడవిబాతుల్ని కొట్టి తీరాలి" అన్నాడు డ్రైవరు. "థాంక్స్" అన్నాడు షాడో మళ్ళీ "విస్కీ చాలా బాగుంది."

"నీకు మంచి ప్రదేశాలేమైనా తెలుసా" అని అడిగాడు డ్రైవరు పక్కవ్యక్తి.

ఇంకో గుక్క త్రాగాడు షాడో. జేబులు తడుముకొని, "అరే! నా సిగిరెట్లుకూడా పోయాయే" అన్నాడు ఆశ్చర్యం నటిస్తూ.

ఇద్దరూ రెండు పాకెట్లు తీసి ఇచ్చారు. ఒక పాకెట్టు జేబులోకి తోసి, ఒక దాంట్లోంచి సిగిరెట్టు తీసుకొన్నాడు. అతి కష్టంమీద అగ్గిపుల్ల వెలిగించాడు. ఎడమచెయ్యి కదిపితే నొప్పి తెరలు తెరలుగా వస్తున్నది.

"మాకు దారి చూపిస్తావా మిస్టర్" అడిగాడు డ్రైవింగ్ చేసిన వ్యక్తి. అలాగేనని తలవూపాడు షాడో. వారి దయవల్ల పోతున్న ప్రాణాలు నిలబడ్డాయి. కాని ఇక్కడే ఉంటే వీళ్ళు వేటాడే ప్రదేశాలు చూపిస్తేగాని వదిలెట్లు లేరు. జూలియా ఎక్కడుంది. తనకోసం కొండలన్నీ గాలిస్తూ వుంటుంది.

"బయటికిపోయి వస్తాను" అంటూ డోరు తెరుచుకొని బయటకు వచ్చాడు. బాటిల్ పట్టడంలో మునిగిపోయి వాళ్ళేమీ పట్టించుకోలేదు.

అదృష్టవశాత్తు వాళ్ళ కారు కొండమీద ఆగివున్నది. కొంచెం చివరకు వచ్చేటట్లయితే కిందరోడ్డు మైళ్ళ పొడుగునా స్పష్టంగా కనుపిస్తుంది. రెండవ కారేమన్నా కనిపిస్తుందేమోనని కళ్ళు చించుకొని చూడసాగాడు షాడో.

కొంతసేపటికి కింద రెండులైట్లు కనపడినాయి. అదిరే గుండెలతో ఎదురు చూడసాగాడు షాడో.

దగ్గిరకు వచ్చింది. కారు క్లియరుగా కనపడసాగింది. చాలా స్లోగా వస్తున్నది. ఇంకా కొంచెం స్పీడుగా వస్తే సొమ్మం పోయిందని విసుక్కున్నాడు. కారుస్టడీగా ముందుకు వస్తున్నది. వెనకాల ఇద్దరూ షాడోను గురించి పట్టించుకోవటం లేదు.

కడుపులో చేరిన విస్కీ పనిచేయటం ప్రారంభించింది. ఏదో తెలియని పిచ్చి ఆవేశంతో వస్తున్న కారు వైపు పరుగెత్తాడు షాడో.

స్టీరింగ్ ముందు కూర్చున్న జూలియాను గుర్తుపట్టాడు. కారు హెడ్ లైట్లు ఫుల్ బీమ్ లో వున్నాయి. ఆ వెలుగు కళ్ళను జిగేల్ మనిపిస్తుంది. అయినా లెక్కచేయకుండా వెళ్ళి రోడ్డుమీద నుంచున్నాడు.

కారును ఆపి దిగబోయింది జూలియా. వద్దని అరిచాడు షాడో.

"దిగకు జూలియా! కారును తిప్పి వెనక్కు పోనీయి" అంటూ ముందుకు పరుగెత్తసాగాడు. వెనకాల షాడో బాటిల్ ఫ్రండ్స్ అతని కోసం అరుస్తూ వెతక సాగారు. వారుకూడా కారును వెనక్కు తిప్పటానికి ప్రయత్నించసాగారు.

బాక్ డోర్ తీసుకొని లోపల కూలబడ్డాడు షాడో. "తొందరగా వెనక్కు తిప్పు, జూలియా! క్విక్" అన్నాడు.

జాగ్రత్తగా కారును బాక్ చేసి వెనక్కు తిప్పింది. రెండు నిముషాలలో తిరిగి కొండ దిగటం ప్రారంభించారు.

పైన ఇద్దరూ తమ కారును మట్టిగుట్టనుంచి బయటకు తీయ టానికి విఫల ప్రయత్నం చేస్తున్నారు. కాని వారి కారు స్టార్టు కావటం లేదు. వారిని వారి ఖర్మకు వదలి వెనక్కుపోయాడు షాడో.

ముందుసీటుపై తలవాల్చి కళ్ళు మూసుకున్నాడు షాడో.

"మాధవ్! ఎంతసేపటికీ నువ్వు కనబడకపోయేసరికి ఖంగారు పడ్డాను" అన్నది జూలియా.

అతని చేయిని తీసుకొని చెంప కానించుకున్నది. అలాగే ఆమె మెడచుట్టూ చెయ్యివేసి నిద్రపోయాడు షాడో.

తిరిగి షాడో మేల్కొనేసరికి ఇంకా కార్లోనే ఉన్నాడు. మంచి ఫ్రెష్ ఎయిర్ వీస్తున్నది! కారు ఆగివున్నది.

"ఇంకా కొద్దిసేపు రెస్ట్ తీసుకో డియర్" అంటూ అతన్ని సున్నితంగా సీటుమీదికి తోసింది జూలియా.

జూలియా తననులేపి, భుజాలమీద ఆనించుకొని ఒక బిల్డింగులోకి తీసుకుపోవటం లీలగా గుర్తున్నది షాడోకు. ఒక వెచ్చటి గదిలోకి తీసుకుపోయి మంచంమీద పడుకోబెట్టింది. ఇంకా మగతగా నిద్ర పోతున్నాడు షాడో.

అతనిచుట్టూ వున్న దుప్పటి తొలగించి, గాయాన్ని పరీక్షించింది జూలియా. వేడినీరుతో గాయాన్ని కడిగి కట్టుకట్టింది. అతని తలక్రింద దిండ్లు సర్ది, బూట్లు బట్టలు తీసిపారేసి, దుప్పటి కప్పింది.

అతనికి నిద్రాభంగం కాకుండా మెల్లిగా తలుపులు వేసి బయటకు పోయింది.

కిచెన్ లోనుంచి వస్తున్న వాసనతో, షాడో నిద్రవదిలి లేచి కూర్చున్నాడు! ఎడమభుజం నెప్పి పుడుతున్నా, చేయి అవసరమైతే ఉపయోగించేందుకు అనువుగానే వుంది.

బాత్ రూమ్ లోకి పోయి స్నానాదికాలు కావించుకున్నాడు. జూలియా తెచ్చిన కొత్తబట్టలు వేసుకున్నాడు. తిరిగి మనిషి అయినట్లు ఫీలయ్యాడు.

వంటగదిలో స్టవ్ ముందు కూర్చునివుంది జూలియా. నలిగిపోయిన స్వెట్టరు, స్కర్టులలో కూడా ఎంతో ఆకర్షనీయంగా వుంది.

"హల్లో" అంది షాడోను చూసి కన్నుకొడుతూ.

"వెల్! హల్లో యువర్ సెల్ఫ్" అంటూ భుజాలమీద చేతులు వేయబోయాడు.

"నో! నో! యూ బ్రూట్! పొద్దున్నే ఏమిటి ఈ గోల" నవ్వుతూ చేతుల కందకుండా దూరంగా జరిగింది.

నవ్వుకుంటూ కిటికీదగ్గిర నిలబడి బయటకు చూశాడు. ఇల్లు ఒక చిన్న లోయలోవుంది. దక్షిణదిశగా అడవులు వున్నాయి. అంటే తన "కాబిన్" కు దగ్గిరలో ఉన్నదన్నమాట, మరొక్కసారి బయటంతా కలియచూసి జూలియావైపు తిరిగాడు.

"ఇప్పుడు చెప్పు జూలియా! మన మెక్కడ వున్నాం ఏం జరిగింది?" ప్రశ్నించాడు.

"రాత్రి కారులో ఎక్కగానే మత్తుగా పడిపోయావు మాధవ్! నిన్ను తీసుకొని ఇక్కడకు వచ్చాను. ఈ ఇంటిని మా బుద్ధూ వాడుతున్నాడు ఒక స్నేహితుని దగ్గిర అద్దెకు తీసుకున్నాడు. నీకు కులాసా చిక్కేదాకా వుండవచ్చని, ఇక్కడకు వచ్చాను" సమాధాన మిచ్చింది.

"నువ్వు టవున్ నుండి వచ్చేటప్పుడు జాన్సన్ వాళ్ళేమయినా ఎదురుపడ్డారా" సమాధానం తెలిసివుండి వూరికే ప్రశ్నించాడు షాడో.

లేదని తల తిప్పింది జూలియా.

చకచకా వంట పూర్తిచేసింది జూలియా. పదార్థాలన్నీ డైనింగ్ టేబిలు మీద సర్దింది.

ఇద్దరూ కూర్చొని కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేశారు. సిగిరెట్టు కాలుస్తూ పక్కమీద పడుకొని, జూలియా తెచ్చిన న్యూస్ పేపరు విప్పాడు షాడో. అతని బుర్రలో ప్లేన్ యాక్సిడెంట్ ను గురించిన ఆలోచనలు మెదులుతున్నాయి. యాక్సిడెంట్ జరిగేముందు ఏదో ఆ కొండమీద గల్లంతు జరిగింది. ఏమైనదీ అతనికి అంతు చిక్కటంలేదు. ఆలోచనలు వస్తున్నాయిగాని, అది ఒక రూపానికి రాకముందే మాయమవుతున్నాయి.

ఒక చిన్న వార్త అతనికళ్ళ నాకట్టుకుంది.

అది ఒకచోట ప్రమాదాన్ని గురించిన విషయం. విమాన ప్రమాదం జరిగిన మరునాడు శృంగానదిలో ఒక బోటు రాళ్ళకు గుద్దుకొని మునిగిపోయింది. ముగ్గురు ప్రయాణీకుల్లో ఇద్దరు చనిపోయారు. ఒకరు హాస్పిటల్లో చేర్చబడ్డారు. అతని పరిస్థితి సీరియస్ గా వుంది. అతనిచొక్కా లాగూలు చిరిగిపోయి, వళ్ళంతా చీరుకుపోయివుంది. కాళ్ళు బొబ్బలెక్కి వున్నాయి. ఇంకా స్పృహ రాలేదుట.

బోటు ప్రమాదంలో చిక్కుకున్న వ్యక్తికి అటువంటి గాయాలెలా తగులుతాయి? అరికాళ్ళు, చేతులూ బొబ్బలెక్కట మేమిటి?

"ఏమిటి మాధవ్?" జూలియా అతనిలోని మార్పును గమనించి అడిగింది. లేచి గట్టిగా పొగపీలుస్తూ రూం అంతా కలియ తిరుగ సాగాడు. 'వెళ్ళి ముఖేష్ ను కలుసుకొని మాట్లాడాలి' అనుకొంటూ-

"జూలియా! నాకు అర్జెంటుపని ఒకటి గుర్తుకి వచ్చింది. సాయంత్రం లోపు తిరిగివస్తాను. ఇక్కడే వుండగలవా?" అడిగాడు.

"నువ్వు వస్తానంటే వుంటాను!"

"జాగ్రత్త! ఆ జాన్సన్ వాళ్ళు ఇక్కడికి రావచ్చు. లేనిపోని ప్రమాదాలు కొనితెచ్చుకోకు. నేను ఎంత త్వరగా వీలయితే అంత తొందరగా వస్తాను" అంటూ తన కాబిన్ వైపు బయలుదేరాడు.

ముఖేష్ ను తన కాబినువద్ద వుండమన్నాడు, అక్కడికి వచ్చి పోయేవారిమీద ఒక కన్ను వేసి వుంచటానికి. అతనితో మాట్లాడితే కొన్ని అనుమానాలకు సమాధానాలు లభించవచ్చు.

గబగబా అడుగులువేస్తూ, మధ్యాహ్నానికి కాబిన్ చేరుకున్నాడు. నలుమూలలా చూస్తూ, నిశ్శబ్దంగా కాబిన్ సమీపించాడు.

లోపల బంకుమీద పడుకొని పుస్తకం చదువుకుంటున్నాడు ముఖేష్. ఒక చిన్నరాయిని తీసి మీదకు విసిరేశాడు. ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు ముఖేష్. దిండుకిందనుంచి, రివాల్వర్ తీసి పట్టుకున్నాడు. కిటికీలో షాడోని చూసి, నవ్వుతూ రివాల్వరు దిండు కింద పెట్టి, లేచి వెళ్ళి తలుపు తెరిచాడు.

"రెండురోజుల్లో కనపడతానన్నవాడివి, ఇవ్వాళా ముఖం చూపించటం, ఏమయిపోయావా? అని ఖంగారుపడుతున్నాను నేను. సాయంత్రందాకా చూసి, వెతకటానికి బయల్దేరదామనుకుంటున్నా నేను" అన్నాడు కోపం నటిస్తూ.

మంచంమీద కూలబడి సిగిరెట్టు వెలిగించాడు. తలకిందవున్న "బ్లూ లైఫ్ బాయ్ ని తీసి మళ్ళీ మూలకు గిరాటు వేశాడు "ఆ రాయిని ఎందుకు తలకిందకు జేరుస్తావ్?" అంటూ.

"ఏమిటి విశేషాలు ముఖేష్?" ప్రశ్నించాడు.

కుర్చీ లాగుకొని తలుపుదగ్గిర కూర్చున్నాడు ముఖేష్.

"మన కాబిన్ కు నాలుగుసార్లు వచ్చారు అతిధులు. వాళ్ళను ముందుగానే గమనించి, కిటికీగుండా, బయటకుపోయి పొదలలో దాక్కున్నాను. కాబిన్నంతా గాలించి వదిలిపెట్టారు. ఏమీ దొరక్క తిట్టుకుంటూ పోయారు" షాడోకి చెప్పాడు.

"టవున్ లో విషయాలేమిటి?"

"పోలీస్ కమీషనరును కలుసుకున్నాను. అన్ని సంగతులూ చెప్పి నువ్వు కోరిన విధంగా అరేంజి చేయించాను. షాడో తిరుగుతున్నట్లు, వాడికోసం పోలీసులు వెతుకుతున్నట్లు పబ్లిసిటీ ఇస్తారు. నువ్వు కనపడినా చూసీ చూడనట్లు పోతారు. మొదట్లో తటపటాయించాడు కాని, కులకర్ణిగారికి ఫోను చేస్తానంటే, గాభారాపడి ఒప్పుకున్నాడు."

"మరి నన్ను పట్టుకోవటానికి వచ్చిన సబిన్స్పెక్టరు?"

"అతనికీ విషయాలేమీ తెలియవు. చీకట్లో నడుస్తుండగా, కాలు జారి కిందపడి దెబ్బలు తగిలించుకొని, హాస్పిటల్లో ఎడ్మిట్ అయ్యాడు, వెళ్ళి పలకరించి వచ్చాను. పాపం ఇంకా పదిరోజులదాకా నడవడం కష్టమే" అన్నాడు చిరునవ్వుతో ముఖేష్.

ముఖేష్ ముందుచూపుకు అభినందించకుండా వుండలేక పోయాడు షాడో. జాన్సన్ తో ఆ ఇన్స్పెక్టర్ రావటం చూస్తే, వారిద్దరికి బాగా పరిచయం వుందని తెలుస్తోంది. ముఖేష్ కమీషనరుతో చేసుకున్న అరేంజ్ మెంట్ గనుక అతనికి తెలిస్తే వెంటనే జాన్సన్ కు

చేరవేస్తాడు. అతడు డ్యూటీలో వుంటే తెలియక మానదు. అందువల్లనే రాత్రిపూట యాక్సిడెంట్ కు గురి అయ్యి హాస్పిటల్ చేరాడు.

"నిన్నా మొన్నా ఒక పదిమంది పోలీసులను అరెస్టుచేసి జైలులో తోశారు" కాజువల్ గా సిగిరెట్టు వెలిగించుకుంటూ అన్నాడు ముఖేష్.

"పోలీసులా? జైలులోనా?" అర్థంకాక ఆశ్చర్యంగా అడిగాడు షాడో.

"యా! రాత్రిపూట ఆర్డర్సులేకుండా ఒక వ్యక్తిని పట్టుకోవటానికి ప్రయత్నిస్తుంటే!" అన్నాడు పొగవదులుతూ.

అప్పటికి షాడో బుర్రకు ఎక్కింది. గంగారాం అన్నాడు కదా, "గుండాలు పోలీసుల వేషంలో తిరుగుతున్నారు" అని.

"మనం రెండు రోజులనుంచీ కోస్గిల్లో ఘనకార్యాలు చేస్తున్నామన మాట" నవ్వుతూ అన్నాడు షాడో.

"ఏదో మీ దయ సార్" అంటూ వంగి ఇంగ్లీష్ డాన్సర్ లా విష్ చేశాడు.

"రాజు! మొన్న ఇన్ స్పెక్టర్ని చూద్దామని హాస్పిటల్ కు పోయాను. ఒక వార్డులో మీ షీలా కనుపించింది. నువ్వు చెప్పిన గుర్తుల్నిబట్టి పోల్చుకున్నాను. ఆమె ఒక మోటారుబోటు యాక్సిడెంట్ లో దెబ్బలు తిన్న వ్యక్తిని పరామర్శిస్తున్నది. ఆమెను అనుసరించి పోయి,

మాటలు విందామని ప్రయత్నించాను. కాని ఆ వార్డు నర్సు చీపురు తీసుకొని వెంట బడేటట్లు కనిపించడంతో పారిపోయి వచ్చాను."

"నేను ఇప్పుడు నీ దగ్గరికి రావటానికి కారణం కూడా అదే ముఖేష్" అంటూ తను పేపర్లో చదివిన విషయాన్ని ముఖేష్ తో చెప్పాడు షాడో.

షాడోను ఆగమని సైగచేసి, బెడ్డుకింద నుంచి కొన్ని పేపర్లు బయటకు తీశాడు ముఖేష్.

ఆ కాగితాలమీద ప్లేన్ యాక్సిడెంటు జరిగిన దగ్గర్నుంచీ, పేపర్లలో వచ్చిన వార్తల పేపర్ కటింగ్ లు అతికించి వున్నాయి. తేదీలవారీగా, క్రయిమ్ కి సంబంధించిన వార్తలన్నీ హెడ్డింగుల ప్రకారం అతికించి వున్నాయి.

అది చదవమని షాడోచేతి కిచ్చాడు ముఖేష్. కొంతసేపయ్యాక షాడో తల ఎత్తాడు.

పేపర్ కటింగ్ లతో పాటు కొంతమంది వ్యక్తులపేర్లు, వారి జీవిత వివరాలు అందులో వ్రాయబడివున్నాయి.

'ఈ వివరాలు నాకు ఎందుకు తట్టలేదు?' నెత్తి కొట్టుకున్నాడు.

చిరునవ్వు నవ్వాడు ముఖేష్. "ఇదంతా డస్క్ వర్కు గురూ. ఫీల్డ్ వర్క్ నీవంతు. ఇప్పుడు అర్థమయింది గదా! ఏంచేద్దామంటావ్?"

ఆరిపోయిన సిగిరెట్ పారవేసి ఇంకొకటి వెలిగించాడు షాడో.

"ముఖేష్! జూలియాను ఒకచోట వదలివచ్చాను. ఆమెను తీసుకొని టవునుకి పోయి, మిగతాకార్యం పూర్తి చేస్తాను. నువ్వు చుట్టుపక్కలే వుండి, కళ్ళు తెరచుకొని ప్రతి విషయం గమనిస్తూ వుండు" అన్నాడు.

"ఇంక ఇక్కడ చేయాల్సిన పనేముంది? నేనూ నీతోనే వస్తాను" మొండిగా అన్నాడు ముఖేష్.

"స్వామీ! ఎందుకనో నువ్వు ఇక్కడ వుండటమే మంచిదనిపిస్తోంది నాకు. అదీగాక వివరాలన్నీ తెలిసినా, ఆ వజ్రాలు ఎక్కడవున్నాయో తెలియలేదు కదా? ఇద్దరం తిరిగితే వాళ్ళు అనుమానం పడవచ్చు. ఒంటరిగానే దీని అంతు చూడాలి" అన్నాడు షాడో.

మారుమాట్లాడకుండా ఒప్పుకున్నాడు ముఖేష్. షాడో నమ్మకాల మీద అతనికి మంచి గురివుంది. ఒక్కసారి షాడో అనుకున్నది అనుకున్నట్లు జరగటం అతనికి చాలాసార్లు అనుభవమైన విషయమే.

"గుడ్ బై" చెప్పి జూలియా దగ్గిరకు బయలుదేరాడు షాడో. ముఖేష్ ను కలుసుకొనేదాకా అతన్ని వేధించిన సమస్యలన్నీ పటాపంచ లయ్యాయి.

"వజ్రాలు ఎక్కడున్నాయో తెలుసుకోవటమే మిగిలింది. కాని అది అంత సులభసాధ్యమైన పనికాదు. అది తెలియకేగదా ఆ గాంగ్ తన

వెనుక పడుతున్నది." అనుకుంటూ వేగంగా అడుగులు వెయ్యసాగాడు.

జూలియావున్న యింటిని సమీపించేసరికి రాత్రి పదిగంటలయింది. కొండలమీదనుంచి చలిగాలి వచ్చి ఒంటిని గడగడ లాడిస్తుంది. అక్కడక్కడా, మబ్బులుపట్టి ఆకాశం వర్షం కురిసే సూచనలు చూపుతోంది. ఒకటీ అరా నక్షత్రాలు మిణుకు మిణుకుమంటూ దారి చూపించటానికి ప్రయత్నిస్తున్నాయి.

ఇంటిని సమీపించి ఆగాడు షాడో. బెడ్ రూమ్ లో లైటు లేదు. జూలియా తనకోసం వేచియుంటానన్నదికదా! తను వెళ్ళినవైపు బెడ్ రూమ్ లో ఒక కిటికీ వుంది. తను వచ్చేటప్పుడు అది తీసివుంది. జూలియా ఎందుకు ఆ తలుపు మూసింది?

నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ యింటిని సమీపించాడు. జూలియా హోటలునుండి రెంట్ కు తెచ్చిన కారువుంది. ఎక్కడికీ వెళ్ళ లేదన్నమాట.

ఒక పొదచాటున కూర్చుని, ఇంటివైపు పరీక్షగా చూడటం ప్రారంభించాడు. ఒక ఐదు నిముషాలు ఏమీ కనపడలేదు. తను వూరికే భయపడుతున్నాననుకొంటూ లేవబోయాడు షాడో.

ముందు తలుపు కొద్దిగా తెరుచుకొని, సన్నగా వెలుగు బయటకు ప్రసరించింది. లేచి నిలబడబోతున్న షాడో మళ్ళీ పొదప్రక్కన

దాగున్నాడు. చప్పుడుకాకుండి తలుపు తెరిచి, ఒక ఆకారం బయటికి వచ్చింది. షీలా కారు తలుపు తెరిచి అందులో కూర్చున్నది.

ఊపిరి బిగపట్టి అలాగే చూస్తూ కూర్చున్నాడు షాడో. మెడమీది వెంట్రుకలు నిక్కబొడుచుకున్నాయి. షీలాను ప్రశ్నిస్తున్న సమయం లో ఓల్డు ట్రక్కు డ్రైవ్ చేసుకుంటూ వచ్చిన వ్యక్తి అతను. ముఖం కనబడకపోయినా, అతని లావును బట్టి పోల్చుకోగలిగాడు!

జూలియాకేం ప్రమాదం సంభవించలేదుకదా! తను అనుమానిస్తూనే వున్నాడు. అయినా ఆమెను వంటరిగా వదిలివెళ్ళటం తనదే బుద్ధి తక్కువ. మరో పదినిముషాలకు మిగిలిన ఇద్దరూ బయటకువచ్చి, కారులో కూర్చున్నారు.

వారి మాటలేమన్నా వినబడతాయేమోనని చెవులు రిక్కించాడు షాడో. లాభం లేకపోయింది. దయ్యాల్లాగా నిశ్శబ్దంగా కూర్చున్నారు. "బహుశా తన రాకకోసం ఎదురుచూస్తూ వుండి వుంటారు" అనుకొన్నాడు.

అప్పుడు తను యింట్లో ప్రవేశించటం ఎలా? నిశ్శబ్దంగా పొద పక్క నుంచి కదిలి, వెనుకవైపు పాక్కుంటూపోయాడు షాడో. ఇంటిమీద ఇంగ్లీషు పద్ధతిలో పొగ పోవటానికి చిమ్నీవుంది. దానిలో దూరగలిగితే కింద ఫైర్ ప్లేస్ లోకి దిగవచ్చు. ఫైర్ వుండేటట్లయితే మాత్రం తన పని గోవిందా!

నెమ్మదిగా కిటికీ పట్టుకొని ఇంటిమీద కెక్కాడు షాడో. తన ఆకారం వారికి కనుపించకుండా వంగి చిమ్మీని సమీపించాడు. పైనున్న రేకును నిశ్శబ్దంగా తొలగించాడు. పాంటు షర్టు వూడదీసి, తాడులాగా, మధ్యలో ముడివేసి అంచుకున్న రంధ్రంలో బిగించాడు. ఒక చివర్ని లోపలికి వదిలి, అది పట్టుకొని దిగ నారంభించాడు. లోపల చాలా యిరుకుగా వుంది. వంటినిండా మెత్తటి పౌడర్ అంటుకుంటోంది. అది ఏమిటో గ్రహించిన షాడోకు ఏడుపు వచ్చింది.

మూడువంతులు దిగేసరికి, పాంటు చివరకు వచ్చేశాడు. తలవంచి కిందికిచూశాడు. కింద నిప్పు వున్నట్లు కనిపించింది. సగంకాలిన కట్టెలున్నాయి. కళ్ళు మూసుకొని పాంటును వదిలాడు. వేగంగా జారకుండా వీలైనంతవరకూ చేతులతో చిమ్మీ లోపలభాగాన్ని అదిమి పట్టాడు. అయినా వేగంగానే వెళ్ళి ఫైర్ ప్లేస్ లో చతికిలపడ్డాడు మిస్టర్ షాడో.

*     *     *

శబ్దంవిని, తలతిప్పి చూసింది జూలియా. బట్టలు లేకుండా డ్రాయరుతోవున్న నల్లటి ఆకారం చిమ్మీలోనుంచి ఫైర్ ప్లేస్ లో జారి పడింది. ఖంగారుగా కట్లు విడిపించుకోవటానికి ప్రయత్నించసాగింది.

ఆకారం పిర్రలు రుద్దుకుంటూలేచి నలుమూలలూ కలియచూసింది. ఒకమూలగా కుర్చీలో చేతులూ కాళ్ళూ బంధింపబడివున్న

జూలియాను గమనించి, నోరు తెరచుకొని, ఆమెవైపు అడుగులు వేయసాగాడు.

జూలియాకు ఖంగారు ఎక్కువైంది. మసకగావున్న లైటు వెలుగులో ఆ ఆకారం క్లియర్ గా కనుపించటంలేదు. ఏదైనా అడవిమృగం కాదు గదా!

అది దగ్గరకు వచ్చినకొద్దీ ఆమెకు భయం ఎక్కువ కాసాగింది. అరవటానికి వీలులేకుండా నోటిలో గుడ్డలు కుక్కివున్నాయి. అయినా పెద్దగా మూల్గటానికి ప్రయత్నించింది. ఆ ఆకారం వెంటనే ముక్కుమీద వేలు వేసుకొని మాట్లాడవద్దని సైగచేసింది.

అంతవరకూ భయంతో గిజగిజలాడుతున్న జూలియా ఆశ్చర్యంగా చూసింది. మరుక్షణం షాడోను గుర్తుపట్టి నవ్వాపుకోలేక, నోటిలో గుడ్డలమూలంగా నవ్వలేక ఉక్కిరిబిక్కిరి అవసాగింది.

చకచకా ఆమె కట్లను విప్పాడు షాడో. నోట్లోంచి గుడ్డలులాగి పారవేశాడు.

"ఏం జరిగింది డియర్?" ప్రశ్నించాడు.

"నువ్వువెళ్ళిన గంటకు జాన్సన్ వాళ్ళు వచ్చారు. నేను బెడ్ రూమ్ లో వున్నాను. నన్ను పట్టుకొని ఇక్కడ కట్టిపడేశారు. నీకోసం బయట చీకట్లో మాటువేశారు" అంటూ నోటికి చెయ్యి అడ్డం పెట్టుకొని నవ్వసాగింది.

"ఇష్! నిశ్శబ్దంగా వుండు" అంటూ గద్దించాడు షాడో. పిచ్చిదానిలా నవ్వుతుందెందుకు?

మెల్లిగా తలుపు దగ్గిరకుపోయాడు. కొంచెం తెరచి బయటకు చూశాడు. ఆ ముగ్గురూ కారులోనే వున్నారు. షాడో లోపలకు ప్రవేశించినట్లు ఇంకా తెలియలేదు. వచ్చి జూలియా చెవుల్లో ఏదో చెప్పి తలుపుచాటున నించున్నాడు.

జూలియా వెళ్ళి కుర్చీలో కూర్చున్నది చేతులు కట్టేసినట్లు, కనబడకుండా వెనకకు. పెద్దగా శబ్దం చేయసాగింది ముక్కుతో.

కారులో కూర్చున్న జాన్సన్ వులిక్కిపడ్డాడు. తన సహచరునితో లోపలకుపోయి చూసిరమ్మని చెప్పాడు.

ఆ వ్యక్తి కారుడోర్ తెరుచుకొని ఇంటివైపు రాసాగాడు.

షాడో గోడ కతుక్కుపోయి నించున్నాడు. నెమ్మదిగా తలుపు తెరచుకొని లోపలకు అడుగు పెట్టాడావ్యక్తి. జూలియా దిశగా నాలుగడుగులు వేశాడు.

చప్పుడుకాకుండా తెరచివున్న తలుపును మూసాడు షాడో. రెండడుగులు ముందుకువేసి అరచేతిని కత్తిలాగాపెట్టి ఆ వ్యక్తి మెడ మీద బలంగా కొట్టాడు. కిక్కురుమనకుండా ముందుకు పడ్డాడావ్యక్తి. కిందపడి శబ్దం అవుతుందేమోనన్న భయంతో మధ్యలోనే పడకుండా

నడుము పట్టుకొని ఆపాడు షాడో. ఒక మూలకులాగి అతని దుస్తులు విప్పి తను ధరించాడు. లూజుగా వంటిమీద వేళ్ళాడసాగాయా బట్టలు.

తలుపు సగం తెరచి పట్టుకొని, చిన్న ఈల వేశాడు. కారులోంచి ఒక తల బయటకు చూసింది. రమ్మని చెయ్యివూపాడు షాడో. కారు దిగి తిట్టుకొంటూ జాన్సన్ బయటికి వచ్చాడు. కొంతదూరంవచ్చి తటపటాయించాడు. అతను ఆగిపోవటంచూసి షాడో తలుపు వెనక్కు జరిగాడు.

ఆ జర్క్ షాడోను పట్టియిచ్చింది. జేబులోనుంచి పిస్టలుతీసి "ధన్ ధన్" మని రెండుసార్లు తలుపుకేసి కాల్చాడు జాన్సన్. తలుపు గడియపెట్టి ఒక్కగంతులో జూలియా దగ్గిరకువచ్చాడు షాడో.

"జూలియా! కమాన్! క్విక్! ఇక్కడనుంచి పోకపోతే ప్రమాదం" అంటూ ఆమెచేయి పుచ్చుకొని మేడమీదకు లాగుకొనిపోయాడు. చేతి కందిన ఒక కూజాను ఎత్తి బయటకు విసిరేసాడు.

జాన్సన్ ఆ శబ్దంవచ్చిన వైపు రెండుసార్లు పిస్టల్ పేల్చి అటు పరుగెత్తాడు. ఇంటి ముందుభాగంలో డ్రైనేజ్ పైపు ఒకటి కిందికి పోతుంది. ఎదురుగా కారువుంది. కారులోనుంచి, ట్రక్కు డ్రైవర్ దిగి జాన్సన్ వెనకాల పరుగెత్తటం చూశాడు షాడో. జూలియాతో చెప్పి పైపు మీదగా కిందికిదిగాడు. జూలియా సగందూరం దిగగానే జాన్సన్ కంట పడింది. నెత్తిమీదనుంచి దూసుకుపోతున్న పిస్టల్ గుండ్లు తప్పించు

కోవటానికి వంగి జారి కిందపడిపోయింది. షాడో చేతులుజాచి పట్టు కున్నాడు. కాని ఆ వేగానికి, బరువుకూ తట్టుకోలేక ముందుకు పడిపోయాడు. జాన్సన్ అరుస్తూ పరుగెత్తుతూ వచ్చాడు.

తూలుతూ లేచి నిలబడింది జూలియా. బూటుకాలిలో పెట్టిన కత్తిని తీశాడు షాడో. 'ఇక తప్పించుకోవటానికి అవకాశంలేదు' అనుకుంటూ.

అదే సమయంలో జాన్సన్ వెనకాల పరుగెత్తుకుపోయిన ట్రక్కు డ్రైవర్ వెనుదిరిగి షాడోనుచూసి రివాల్వర్ పేల్చాడు.

గురితప్పి జాన్సన్ కాళ్ళమధ్యపడి దుమ్ము లేచిందా రివాల్వరు బుల్లెట్. పిచ్చిగా అరుస్తూ, పక్కకు దూకాడు జాన్సన్.

అదే సమయంలో వచ్చిన అవకాశాన్ని వదులుకోకుండా జూలియా చెయ్యి పట్టుకొని పొదల్లోకి పారిపోయాడు షాడో.

ఆ చీకటిలో తనతోపాటు పరుగెత్తుతున్న జూలియా ముఖం చూశాడు షాడో. 'హాయిగా హోటల్లో పడుకొని నిద్రపోతున్న ఆమెను లేపి తీసుకువచ్చి కొండగుట్టల్లో ఎన్నిబాధలు పెడుతున్నాను' అనుకొంటూ ఒకచిన్న గుట్ట ఎక్కి పల్లంలో నిలబడ్డాడు. వెనుదిరిగి చూశాడు. ఒకపావుమైలు దూరం ఇంటినిదాటి వచ్చేశారు. జాన్సన్ ఇంటిముందు నుంచొని చేతులు వూపుతున్నాడు. ట్రక్కుడ్రైవరు లోపలినుంచి షాడో చేతుల్లో దెబ్బతిన్న వ్యక్తిని మోసుకు వస్తున్నాడు.

అంతవరకూ క్లౌడీగావున్న ఆకాశం నిర్మలమయింది. చిరునవ్వు ఒలకబోస్తూ, అర్ధచంద్రుడు, భూమిపై తన కాంతిని వెదజల్లుతున్నాడు. ఆ కాంతిలో పొదలను తప్పించుకొని నడవటం సులభమైనప్పటికీ, వెనకాల తరుముకొస్తున్న వారికిగూడా తేలికగా కనబడతారు.

జూలియాను పట్టుకొని, దించటంవల్లా పరుగెత్తటంవల్లా షాడో అలసి పోయాడు. అందుకని ఒక గుబురుచాటున కూర్చుని, ఆకుల సందులో నుంచి చూడసాగాడు. జూలియా అతని వెనకాలకూర్చుంది.

ఒక మనిషిని ఇంటివద్దవుంచి, మిగిలిన ఇద్దరూ పొదల కేసి రాసాగారు.

"ఏం చేద్దాం! మాధవ్?" అంది జూలియా.

ఆలోచించటానికి ప్రయత్నిస్తున్నాడు షాడో. జూలియాను తీసుకొని, టవున్ లో వదిలిరావటానికి నిశ్చయించుకున్నాడు మొదట. కాని ఈ పరిస్థితుల్లో అది సంభవమయేలా కనుపించటం లేదు. జూలియా కారు వాళ్ళ చేతుల్లో వుండిపోయింది. కాలినడకనపోతే వాళ్ళు ఓపెన్ ప్లేసెస్ లో వెంటబడి పట్టుకోక మానరు. మొదట వీళ్ళను తప్పించుకోగలిగితే!

టర్ర్ ర్ మంటూ శబ్దం చేసుకుంటూ ఒక ట్రక్కువచ్చి ఇంటిముందు ఆగింది. సుమారు పదిమంది వ్యక్తులు దిగారు ట్రక్కులోనుంచి. షాడోను పట్టుకోవటానికి వస్తున్న ఇద్దరూ ట్రక్కునుచూసి ఆగారు.

జాన్సన్ పోయి వాళ్ళతో ఏదో చెప్పాడు. అందరూ తలా ఒకదిక్కుకూ చెదరి పొదలవైపు బయలుదేరారు.

యింక చూడదలుచుకోలేదు షాడో. జూలియాను లేపి పరుగు ప్రారంభించాడు. యిద్దరే అనుకొంటే వారికితోడు యింకో పదిమంది తయారయ్యారు.

క్రమంగా పొదలు దట్టంగా పెరిగివున్నాయి. వాటిల్లో సందుచేసుకొని కొండ ఎక్కనారంభించాడు షాడో.

కొంతదూరం ఎక్కేసరికి ఆయాసంతో జూలియా ఆగిపోయింది. నడవ లేక ఒక ఎండుకొమ్మమీద కూర్చుంది. "ఠప్" మంటూ పెద్దచప్పుడుతో మధ్యకు విరిగింది కొమ్మ.

"జుయ్" మంటూ రెండు బుల్లెట్లు వారి తలల మీద నుంచి దూసుకుపోయాయి. అడుగడుక్కూ జాన్సన్ బృందం దగ్గిరకు వస్తోంది. ముఖానికి పట్టిన చెమటను చేత్తో తుడుచుకున్నాడు షాడో. ఆ చేతిని పాంటువెనక రాశాడు. చేతికి గట్టిగా తగిలింది బాక్ పాకెట్టులో చెయ్యి పెట్టాడు ఒక రివాల్వరు.

ఆనందంతో ఎగిరి గంతేశాడు. రివాల్వరు చేతిలో పట్టుకొని వెనుదిరిగాడు.

"మాధవ్! ఐయామ్ సారీ! ఆ కొమ్మ విరుగుతుందనుకోలేదు," అన్నది జూలియా కంపిస్తున్న స్వరంతో.

"మరేం పర్వాలేదు డియర్! నువ్వు ముందుకుపద. నేను యిద్దరు ముగ్గుర్ని పైకి పంపి వస్తాను." అన్నాడు షాడో ఆమె భుజంతడుతూ.

"యిక్కడ నుంచొని టైం వేస్టుచేసేకన్నా పారిపోవటానికి ప్రయత్నం చేయవచ్చుకదా! యిప్పుడువారిలో ఎవరినైనా చంపితే మరింత పట్టుదలతో ముందుకు వస్తారు. కమాన్! మాధవ్! లెటజ్ ట్రై టు ఎస్కేప్" అంటూ చెయ్యి పట్టుకొని లాగింది జూలియా.

కోపంగా రివాల్వరు ఎత్తి రెండు మూడుసార్లు కొండ కిందికి పేల్చాడు షాడో. జూలియా చెప్పిందే కరెక్టు అనుకుంటూ, రివాల్వరు జేబులో పెట్టుకొని కొండ ఎక్కసాగాడు.

కాల్చిన రెండు షాట్లూ వాళ్ళని కొద్దిసేపు ఆపివుంచుతాయని వూహించాడు. ముందూ వెనకాల అడవి ప్రశాంతంగా వుంది. పెద్దపులి వేటాడేటప్పుడు కూడా అడవి అలాగే వుంటుంది.

* * *

ఒక చిన్న కొండవాగు దగ్గిర ఆగారు! చల్లటి నీరు వారి దాహాన్ని తీర్చింది. చల్లటిగాలి వారిని సేదతీర్చింది.

జూలియా బాగా అలసిపోయింది. కొమ్మలూ-ముళ్ళూ గీసుకొని ఆమె వళ్ళు రక్తం చిమ్ముతుంది! స్కర్టు ఒకవైపు చిరిగిపోయింది.

మగవాళ్ళే ప్రయాణించటానికి వెనుకాడే అరణ్యంలో తనతో సమానంగా పరిగెత్తుకువచ్చిన ఆమె శక్తికి ఆశ్చర్యపోయాడు షాడో.

రెండు బండరాళ్ళ మధ్యనున్న ఖాళీ స్థలాన్ని చూసి, మిగిలిన రాత్రి అక్కడే గడుపుదామని నిశ్చయించుకున్నాడు షాడో. ఎండిపోయిన చితుకులు ఏరుకువచ్చి మంట చేద్దామని అగ్గిపెట్టికోసం జేబులో చెయ్యిపెట్టాడు. ఖాళీ. తన బట్టలు కాదన్న సంగతి గుర్తుకువచ్చి నీరసంగా నిట్టూర్చాడు.

చలితో ముణగదీసుకుని పడుకోవటంకన్నా వేరే గత్యంతరం లేదు.

కిందపడిన ఆకులు పోగుచేసి బండలమధ్య పరిచాడు. వాగులో కాసిని నీళ్ళు తాగివచ్చి ఆకులమీద నడుంవాల్చాడు. జూలియా అతని మెడచుట్టూ చేతులువేసి కౌగిలించుకొని పడుకుంది. క్రమంగా వారి శరీరాలు వెచ్చబడి చలి కొంచెం తగ్గింది. కొద్దినిముషాల్లో గాఢనిద్ర లో మునిగిపోయింది జూలియా.

షాడోకు మాత్రం నిద్రపట్టలేదు. ఏవేవో ఆలోచనలు అతని మనస్సును కలవరపరచసాగాయి. అలా మసులుతూ రాత్రి గడిపేశాడు.

తెల్లవారింది. సూర్యుడు పైకొచ్చి కొండలన్నీ సూర్యకాంతితో నిండే సరికి షాడో ప్రయాణం కట్టాడు.

శృంగా నదికేసి దారితీశాడు. రాత్రి నిద్రపట్టక పోవటం మూలాన అతని కళ్ళు మండుతున్నాయి. మెదడంతా మత్తుగా వుండి, అదో మాదిరిగా ఫీలవుతున్నాడు.

ఎండలోవున్న ఒక ఖాళీ స్థలాన్ని చూసి పన్నెండు గంటలకు ఆగుదామని నిశ్చయించుకున్నాడు.

"మాధవ్! మన కర్తవ్యమేమిటి?" కనీసం నాలుగో సారన్నా అడిగింది జూలియా.

"ప్రస్తుతం ఏమీ చెప్పలేను జూలియా! తొందరలోనే ఇవన్నీ ఎన్డ్ అవుతాయి!" ఎండ పడుతున్నచోటు చూసుకొని పచ్చగడ్డిలో వెల్లికిలా పరున్నాడు. తలకింద చేతులు పెట్టుకొని అతని పక్కన పడుకుంది జూలియా. ఎత్తయిన వక్షోజాలు పైకీ కిందికీ ఆడసాగాయి వూపిరి పీల్చి వదిలినప్పుడల్లా.

మత్తుగా కనులు మూసుకుని కునికిపాట్లు పడసాగాడు.

అతని పెదవులమీద ఆమె నోటినిపెట్టి నొక్కటంతో ఉలిక్కిపడి లేచాడు షాడో. చేతులు జాచి మీదకు లాక్కున్నాడు.

"మాధవ్! డియర్!" అంటూ మత్తుగా పిలవసాగింది. తమకంతో అతన్ని పెనవేసుకుపోయింది.

ఇద్దరికీ తెలివి వచ్చేసరికి సూర్యుడు పడమటికి పోయాడు. వెచ్చటి ఎండలో పడుకుని రెస్ట్ తీసుకున్నాడు షాడో మోకాళ్ళ చుట్టూ చేతులు చుట్టి ముఖాన్ని మోకాళ్ళమీద ఆనించి దూరంగా కనపడే శృంగానదిని చూస్తూ కూర్చుంది జూలియా. ముఖంమీద పడుతున్న జుట్టును సర్దుకుని, బట్టలను సవరించుకుని అతనిమీదకు వంగింది.

"మాధవ్! ఈరోజును నా జన్మలో మరచిపోలేను. ఏం జరిగినా, ఏమైనా నిన్ను మనసులోనే ప్రతిష్ఠించుకుని ఆరాధించుకుంటాను" అన్నది ప్రేమగా.

షాడో లేచి కూర్చున్నాడు. "ఏం జరుగుతుంది జూలియా? వింతగా మాట్లాడుతున్నావే?" అంటూ.

గట్టిగా నిట్టూర్చింది. ఏదో చెప్పటానికి నోరు తెరిచింది. వారువున్న స్థలానికి పైనవున్న గట్టుమీద నుంచి ఒక రాయి జారి దొర్లుకుంటూ కిందవున్న పొదలలో పడింది.

షాడో చెయ్యి అప్రయత్నంగా జేబులోవున్న రివాల్వరును బయటికి లాగింది.

వారు నిద్రపోతున్న సమయంలో జాన్సన్ వాళ్ళు బిజీగా వెతకటం లో నిమగ్నమయివున్నారు. వాగునించి బయలుదేరటంలో కొంత దూరం ఖాళీస్థలంలో ప్రయాణించాల్సి వచ్చింది. అప్పుడు వారిని చూసి వెంబడించారు గాంగ్ మనుషులు.

ఒక గట్టుకింద వున్నారు షాడో, జూలియాలు. మూడు వైపులా రాళ్ళు వున్నాయి. ఒకవైపు దట్టంగావున్న పొదలు వున్నాయి.

"ఇక్కడే వుండాలి! జాగ్రత్తగా వెతకండి" అన్నమాటలు గాలిలో తేలి వచ్చి షాడో చెవిలో పడ్డాయి.

జూలియా వేళ్ళు షాడో చేతిచుట్టూ బిగుసుకున్నాయి. అది జాన్సన్ గొంతు.

"వెధవ ముఖాలు వేసుకొని నుంచోకండి పొదలన్నీ గాలించండి!" జాన్సన్ కోపంగా అరిచాడు.

"ఈ పొదలలో ఏం లేదు జాన్" అన్నది ఒక గొంతు.

"ఇవిగో అడుగులు గట్టు కిందకి పోయాయి." గట్టు కిందికి దిగుతున్న చప్పుడూ, రాళ్ళు జారుతున్న చప్పుడూ వినవచ్చాయి. జూలియాతో పొదలలోకి దూరాడు షాడో. ఒకచెయ్యి పొదలను తప్పించి చూసింది. షాడోనెత్తిమీద రెండంగుళాల దూరంలో వుందా చేయి. ఏ మాత్రం కిందికి వచ్చినా...

షాడో చేతిలో రివాల్వరు రెడీగా వుంది. ఏ మాత్రం గుర్తించినా కడుపులో కనీసం రెండు గుళ్ళు పేల్పించుకునేవాడు.

షాడో పడుకున్నచోట గడ్డి వత్తుకుని పోయివున్నది. సరిగ్గా చూస్తే, ఎవరో రీసెంట్‌గా పడుకున్నారని తెల్సిపోతుంది. కాని ఆ ఫూల్ అవేమీ చూడకుండా ఎవ్వరులేరని గొణుక్కుంటూ వెనుదిరిగిపోయాడు.

"ముందుకు పదండి. ఆలస్యం చేస్తే తప్పించుకుపోతారు" అంటూ తన పరివారాన్ని తొందరచేస్తున్న జాన్సన్ కంఠం విని, తేలికగా వూపిరి పీల్చుకున్నాడు షాడో.

పైకిలేచి చూశాడు రైఫిల్సు పట్టుకుని, బూట్లు చప్పుడు చేసుకుంటూ పదిమంది దూరంగా పొదలలోకి పోతూ కనిపించారు. వారు పోయేదోవ సరిగ్గా షాడో కాబిన్ కు పోతుంది.

"ఎంత దగ్గిరలో తప్పిపోయింది?" వణుకుతూ షాడోను కౌగిలించు కుంది జూలియా.

జాన్సన్ బృందం కనుచూపు దాటిన తరువాత శృంగానదివైపు దారితీశాడు షాడో. మళ్ళీ 'వాళ్ళు వెనుదిరిగేలోగా అడవినుంచి బయటపడాలి,' అనుకుంటూ.

కొండలమీద ఎక్కకుండా, పల్లపు ప్రదేశాలలో నడుస్తూ, చీకటి పడే సమయానికి నదిని చేరుకున్నారు.

నది ఒడ్డునవున్న ఎండు కొమ్మలను విరిచి, తీగెలతోనూ, వూడల తోనూ కట్టి ఒక బల్లకట్టు తయారుచేశాడు షాడో. దానిమీద ఎక్కి నీటి వాలున కోస్గిల్ వైపు బయలుదేరారు. చుట్టూ కమ్మిన చీకట్లలో వారిని గుర్తుపట్టటం కష్టం అవుతుంది. నిర్భయంగా, జాన్సన్ బారినుంచి తప్పించుకొని ప్రయాణం సాగించారు.

రాత్రి పదకొండు, పన్నెండు గంటలవేళకు కోస్గిల్ చేరుకున్నారు షాడో జూలియాలు. తెడ్డువేసి షాడో చేతులు బొబ్బలెక్కాయి. వేగంగా పోయి కోస్గిల్ చేరుకోవాలనే తలంపుతో ఆయాసాన్ని కూడా లెక్క

చేయకుండా కష్టపడ్డాడు. కోస్గిల్ పట్టణం కనుచూపు మేరలోకి రాగానే హాయిగా నిట్టూర్చాడు.

బల్లకట్టును ఒడ్డుకులాగి కాలినడకన పట్టణంలోకి ప్రవేశించారు. అదృష్టవశాత్తూ, జూలియా హోటలుకు దగ్గిరలో నదిని దాటటంవల్ల , ముందర జూలియాను హోటలువద్ద వదిలిపెట్టాడు షాడో.

జూలియా తనుకూడా వస్తానని మొండికెత్తింది. నచ్చచెప్పి ఆమెను లోపలికి పంపేసరికి నక్షత్రాలు కనపడ్డాయి షాడోకు.

హోటల్ దగ్గిరవున్న టాక్సీలో ఎక్కి గంగారాం భవనం దగ్గిరకు వచ్చాడు. ఈ రాత్రికి తాడోపేడో తేల్చేయాలని నిశ్చయించుకున్నాడు.

టాక్సీని ఒక సందు మొదట ఆపి, వెయిట్ చెయ్యమని చెప్పి, గంగారాం వెనక వాకిలి తట్టాడు.

లోపల గ్రామ్ ఫోను మోగుతుంది. తలుపు తెరుచుకొని ఒక అమ్మాయి బయటకు తొంగి చూసింది.

"గంగారాం వున్నాడా?" అన్నాడు షాడో.

మత్తుగా చూసింది షాడోను. లావుగా చలిమిడి సుద్దలా వుంది ఆ స్త్రీ. వయస్సు దరిదాపు 20 ఏళ్ళు వుండవచ్చు.

"గంగారాం లేడు. నేను వున్నాను" అన్నది.

నవ్వాలో ఏడ్వాలో తెలియక వెనుదిరిగాడు షాడో.

"ఇంకో పావుగంటలో రావచ్చు మిస్టర్. వెయిట్ చేయండి!"

తటపటాయిస్తూ లోపల ప్రవేశించాడు. "ఎవరు నువ్వు డంప్లింగ్?" అడిగాడు.

"సూసీ! గంగారాం కూతుర్ని. వంటికి భలేరంగు వేసుకున్నారే?" అన్నది నవ్వుతూ.

అద్దంలో చూసుకున్నాడు షాడో. వంటినిండా మసి. ముఖం తప్ప, అన్నిచోట్ల మసి అంటుకొనివుంది. బల్లకట్టుమీద నుంచి వచ్చేటప్పుడు నదిలో దూకితే బాగుండేది అనుకున్నాడు.

పదిహేను నిముషాలపాటు ఓపికగా కూర్చున్నాడు షాడో.

కూర్చోలేక అటూ యిటూ పచార్లు చేయసాగాడు. బయటినుండి టాక్సీ హారన్ వినిపించింది.

"గంగారాంను కేక వేయకూడదా సూసీ!" వేడుకున్నాడు.

"లాభంలేదు మిస్టర్. డిస్టర్బ్ చేస్తే వూరుకోడు. అయినా ఏం పని?" అన్నది, గ్రామఫోను రికార్డుకు అనుగుణంగా అడుగులు వేయటానికి ప్రయత్నిస్తూ.

నవ్వాడు షాడో. "పర్సనల్ బిజినెస్ హనీ! ఒక వ్యాపారం గురించి మాట్లాడాలి" అన్నాడు.

"అలాగా!" అంటూ నవ్వుతూ వచ్చి షాడో పక్కన కూర్చుంది. ఉక్కిరి బిక్కిరయ్యాడు షాడో, ఇదెక్కడి ఖర్మరా బాబూ అనుకుంటూ.

గది బయట అడుగుల చప్పుడు వినవచ్చింది.

వెంటనే లేచి ఎదురుగావున్న కుర్చీలో ఏమీ ఎరగనట్టు చూస్తూ కూర్చుంది సూసీ. "హల్లో గురూ!" అంటూ వచ్చాడు గంగారాం. "నువ్వు లోపలికిపో సూసీ" అని షాడోవైపు తిరిగాడు.

"ముందర అర్జెంటుగా ఓ ఐదు కొట్టు!" చెయ్యి జాచాడు షాడో.

మాటాడకుండా జేబులోనుంచి పదిరూపాయల కాగితం తీసి ఇచ్చాడు గంగారాం. బయటకువోయి చిందులు వేస్తున్న టాక్సీడ్రైవరు చేతిలో పెట్టాడు షాడో. స్మార్టుగా శాల్యూట్ కొట్టాడు టాక్సీ డ్రైవరు "వెయిట్ చెయ్యాలా సార్" అంటూ. అక్కరలేదని చెప్పి లోపలికి వచ్చాడు.

గంగారాం కుర్చీలో కాళ్ళుపెట్టుకొని కూర్చుని వున్నాడు.

"గంగూ! నాకో చిన్న సహాయం చెయ్యాలి!" అడిగాడు.

"చెప్పుగురూ! నే నెప్పుడైనా కాదన్నానా?"

"ఒక ఫోన్ కాల్ చెయ్యాలి. నీ గొంతును రకరకాలుగా మార్చటం మర్చిపోలేదుగా?"

"నేను గొంతు మార్చటమా?" షాడో గొంతును అనుకరిస్తూ అనే సరికి షాడో తెల్లబోయాడు. అతని తత్తరపాటును చూసి పకపకా నవ్వాడు గంగారాం సూసీ నవ్వినట్లు. ఏ నెంబరుకు ఫోన్ చెయ్యాలో ఏం చెప్పాలో తెలియచేశాడు షాడో. గంగారాం ఆశ్చర్యపోయాడు. కాని బయటకు కన్పించనీయలేదు.

"నిన్నెవరో తుక్కులేపేస్తారు ఎప్పుడో ఒకప్పుడు" అంటూ ఫోన్ దగ్గరకు పోయాడు.

* * *

కోన్సిల్ టవున్ చివర రైల్వే బ్రిడ్జిక్రింద కాసుకొని కూర్చున్నాడు షాడో. పక్కనేవున్న మున్సిపల్ "డంపింగ్ గ్రౌండ్" నుంచి మురుగు వాసన ముక్కుల్ని బద్దలు చేస్తోంది. బ్రిడ్జిపక్కనుంచి ఒక వొడ్డు శృంగా నది ఒడ్డుకు పోతుంది. ఆ చీకటిలో అడవి మృగాల్ని వేటాడేందుకు మాటువేసే వేటగాడిలాగా కాపువేశాడు షాడో.

తన దగ్గిర రహస్యం ఒకటి వుందని తెల్సి ఎవరో ఒకరు ఇక్కడకు వచ్చి తీరుతారు. కొంతసేపటికి టవున్ లో నుంచి ఒక కారు చీకట్లను చీల్చుకొంటూవచ్చి బ్రిడ్జికి కొంచెం దూరంలో ఆగింది.

చీకటికి అలవాటుపడ్డ షాడో కళ్ళు సునిశితంగా ఆ కారును పరిశీలించసాగాయి. కారు ఇంజను ఆగిపోయింది. ఆ కారు వెనకాల ఇంకో కారుగాని, మనష్యులుగాని, రావటం జరుగలేదు. వచ్చిన

కారులో ఎంతమంది వున్నారో తెలియదు. కారు డోరు తెరుచుకుంది. లోపల డోమ్ లైట్ వెలిగింది. వెనుక సీటులో ఎవ్వరూ కనపడలేదు! ముందు ఒక్కరే వున్నారు.

కాని షాడో కనుమానం వదలలేదు. తనని కాళ్ళు, చేతులు కట్టి డిక్కీలో పడవేశారు. అలాగే ఇంకో మనిషి డిక్కీలో రావటానికి అవకాశం వుందిగదా!

ఫ్రంట్ సీటులో వున్న ఆకారం పెమిలియర్ గా కనుపించింది. కళ్ళు చిట్లించుకొని చూశాడు. షీలా...

ఏదో పొరపాటు జరిగింది. తను పెద్ద చేపకోసం గాలం వేశాడు. ఈ చేప పిల్ల ఎందుకు వచ్చింది?

షీలా కారులోనుంచి దిగి, తలుపు వేసింది. లోపల లైటు ఆరిపోయింది. షాడో జాగ్రత్తగా చెవులు రిక్కించుకొని వినసాగాడు.

నెమ్మదిగా ముందుకు జరిగి, చెత్త డబ్బాల చాటుగుండా కారు వెనుక భాగాన్ని సమీపించాడు. షీలా తప్పితే మరెవ్వరూ కనిపించటం లేదు. కారు డిక్కీ హేండిలు పట్టుకొని తిప్పాడు. చాలా టైట్ గా లాక్ చేసి వుంది. ఎవ్వరూ లోపల లేరన్నమాట!

నెమ్మదిగా షీలావైపు అడుగులు వేశాడు. షీలా వెనుతిరిగి చూసింది.

"మాధవ్! నువ్వా?" కొంచెం ఆశ్చర్యంగా అడిగింది. "అవును" అన్నాడు షాడో.

అదే సమయంలో కారు ముందునుంచి ఒక ఆకారం పైకి లేచింది. షాడోకు తప్పుకోవటానికి వీలులేకపోయింది. జరిగింది కళ్ళకు కట్టినట్లు కనిపించింది.

షీలా నెమ్మదిగా కారు నడుపుకొంటూ వచ్చింది. దాని పక్కనే వంగుని నడుస్తూ వచ్చాడా వ్యక్తి. షాడో కారు లోపల పరీక్షించటంతో ఆ వ్యక్తిని గమనించలేదు.

రివాల్వరు ఎత్తి పాయింట్ బ్లాంక్ గా షాడో గుండెలకేసి గురిపెట్టి కాల్చాడు. "అమ్మా" అంటూ వెనక్కి విరుచుకు పడ్డాడు షాడో.

కిందపడి అలాగే కదలకుండా వారి మాటలను వినసాగాడు.

"అమ్మయ్య ఇప్పటికైనా ఇతన్ని కొట్టగలిగాము. చాలా చక్కగా కాల్చావు!" నవ్వుతూ అన్నది షీలా.

"నా గురికి తిరుగులేదని నీకు తెలియదా" అన్నది ఆ మగ కంఠం.

పళ్ళు కొరుకుతూ వుండిపోయాడు షాడో. "నా గురిని కూడా రుచి చూపిస్తానురా!" అనుకొంటూ ఆ వ్యక్తి షాడో దగ్గరకు వచ్చాడు.

"పూర్తిగా చంపలేదు కదా" కొంచెం ఆందోళనగా అడిగింది షీలా.

"నో! కడుపుకు గురిపెట్టాను. స్పృహ తప్పి వుంటుంది" నమ్మకంగా పలుకుతూ షాడోమీదకు వంగాడు. షాడోకాలు ఒకటిలేచి, మడచి, రెడీగా వుంది.

షాడో దెబ్బతిని హెల్ప్ లెస్ గా పడివున్నాడనుకున్నారు ఆ యిద్దరూ.

కాని వాళ్ళకు గంగారాం సంగతి తెలియదు. అతని విద్యలు, అతని దగ్గరున్న రకరకాల వస్తువులను గురించి అస్సలు తెలియదు.

అంతకుముందే గంగారాం షాడోకు ఒక వస్తువిచ్చాడు. దానినే షాడో ఇప్పుడు వుపయోగించాడు.

మీదికి వంగి పరీక్షగా చూస్తున్న వ్యక్తి మొహంమీద బలమంతా వుపయోగించి తన్నాడు షాడో. పది అడుగులు వెనక్కుపోయి, వెల్లకిలా పడ్డాడు.

షీలా కెవ్వుమని అరిచింది.

వెంటనే లేచి మళ్ళీ ఆ వ్యక్తిమీద కలియపడ్డాడు షాడో. అతనికి ఊపిరి పీల్చుకొనే వ్యవధి కూడా ఇవ్వలేదు. చేతిలో రివాల్వరు లాక్కుని జేబులో పెట్టుకున్నాడు. అటూ ఇటూ గింజుకొనేసరికి ఇంకో దెబ్బవేసి పడుకోబెట్టాడు.

షీలా కారులోకి ఎక్కటానికి ప్రయత్నించటం చూసి, ఆమె చేతిని పట్టుకొని ఆపాడు షాడో.

"నోరు తెరిచి ఏమన్నా శబ్దం చేశావో! పళ్ళన్నీ రాలకొడతాను" బెదిరించాడు. షాడో చేతులలోనుంచి తప్పించుకోవటానికి విశ్వప్రయత్నం చేయసాగింది షీలా! అంత ప్రయత్నంలోనూ షాడో వంక భయంగా, ఆశ్చర్యంగా చూడసాగింది.

"అతను నిన్ను కాల్చాడు." పిచ్చిగా అరవసాగింది. "నిన్ను కాల్చాడు నేను చూసాను!"

నిజమే నన్నాడు షాడో. "అతను నన్ను కాల్చాడు. పాపం గురి కూడా తప్పలేదు. కాకపోతే నా స్నేహితుల సంగతి మీకు తెలియదు. మీలాంటి విషపురుగుల దగ్గిరకు పోతున్నానని తెలిసి, ఒక... బుల్లెట్ ప్రూఫ్ వెస్ట్ ఇచ్చాడు."

షీలా ఆశ్చర్యంతో నోరు తెరిచింది.

"బుల్లెట్ నాకు తగిలి కిందికి తోసింది. అది తగిలిన చోట కొంచెం నెప్పిగా వుంది. కాని గాయమేమీ అవలేదు డియర్" అన్నాడు.

"దుర్మార్గుడా, యూ డర్టీ, రాటెన్!..."

చెంప చెళ్ళుమనిపించాడు షాడో.

తాచు పాములాగా బుసలుకొట్టింది.

మళ్ళీ రెండో చెంప వాయించాడు.

దెబ్బతో నోరు మూసుకొంది. తెగిన పెదిమలను చేతితో తుడుచుకొంది, కన్నీళ్ళు కారుస్తూ.

"కారులో కూర్చో! ఏమన్నా గొడవచేశావో, మళ్ళీ మగవాడు నీ ముఖం చూడకుండా తయారుచేస్తాను నిన్ను. ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవాల్సిందే" అన్నాడు కోపంగా షాడో.

వణుకుతూ కారు ఎక్కింది. "మరి మా మనిషి సంగతేమిటి?" అడిగింది.

"ఆ పెధవను ఇక్కడే వదిలేద్దాం. తెలివిరాగానే ఇంటికి చేరుకుంటాడులే!" అన్నాడు షాడో. 'కాని తను కొట్టిన దెబ్బల ప్రకారం అతన్ని ఎవరైనా చేరిస్తే తప్ప, తనంతట తాను ఇంటికి పోలేడని' షాడోకు తెలుసు.

కారులో కూర్చొని డాష్ బోర్డువైపు చేయి పోనిచ్చింది. చెయ్యి పట్టుకొని బయటకు గుంజాడు షాడో. చప్పుడు చేస్తూ కిందపడింది.

.32పిస్టలు.

"నీ సున్నితమైన హస్తాన్ని దానిమీద వెయ్యబోయావా? ప్రియతమా!" అంటూ దాన్ని తీసి నదిలోకి విసరేశాడు.

"ఊ! ఇక దయచేయండి!" అంటూ కారులోకి తోశాడు. కళ్ళనీళ్ళు కారుస్తూ స్టీరింగ్ ముందు కూర్చుంది షీలా!

ఇటువంటి వేషాల్ని లెక్కచెయ్యదలుచుకోలేదు షాడో. పక్కన కూర్చుని, పోనివ్వమని చెప్పాడు.

కిందవున్న వ్యక్తిని ఒకమారుచూసి, కారును వెనక్కుతిప్పి నది వైపు పోనిచ్చింది షీలా. నెమ్మదిగా సందులను దాటుతూ మరొక్కసారి మౌంటెన్ రోడ్డుకు వచ్చారు. ఒక చెట్టుకింద కారు ఆపింది షీలా.

ఇప్పుడు ఆమె అరిచి, గీ పెట్టినా వినటానికి గుడ్లగూబలు తప్ప మరేంలేవు. ఇంజన్ ఆపి, లైట్లు ఆఫ్ చేసింది.

"మాధవ్!..." అంటూ మెత్తగా పిల్చి షాడోవైపు తిరిగింది, వెచ్చని వక్షోజాలు అతని భుజాలకేసి రుద్దుతూ తొడతో అతని తొడను నొక్క సాగింది. షాడో జవాబు చెప్పలేదు.

"మాధవ్! జగ్గడు ఒట్టి తెలివితక్కువ వెధవ. వాడికి నీకున్న శక్తి ఎలా వస్తుంది?" బిగదీసుకొని కూర్చున్నాడు షాడో. అతని చెయ్యి తీసుకొని చెంపల కానించుకొంది.

చెంపగిల్లి గట్టిగా నవ్వాడు షాడో.

"నువ్వో అడివి మృగానివి!" అంటూ వెక్కిళ్ళు ప్రారంభించింది.

"చూడు షీలా! నీ వేషాలు నా దగ్గర పనిచెయ్యవు. లోగడ నీ అందాలు నా మీద ఒకసారి ప్రయోగించి దెబ్బతిన్నావు. మళ్ళీ ఎందుకు విఫల ప్రయత్నం చేస్తావు. నీ ఏడుపులకు లొంగే ఘటాన్ని కాదు. కనుక దయచేసి నోరు మూసుకొని, నా ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వు. లేకపోతే నీ అందాల ముఖాన్ని..." బూటు లోంచి కత్తితీసి ఆమె బుగ్గలమీద రాశాడు.

గబుక్కున నోరుమూసింది షీలా. చేతులు స్టీరింగ్ వీల్ మీదపెట్టి ఎదురుగా చూస్తూ కూర్చుంది.

"మీ నాయకుడెవరు షీలా?"

"నాకు తెలియదు మాధవ్! మాకు టెలిఫోనులో ఆర్డర్లు వస్తాయి. నిజంగా!" కత్తిని కొంచెం గట్టిగా ఆమె బుగ్గమీద పెట్టాడు- "నాకు కావల్సినది యాక్చువల్ ట్రూత్!" అంటూ.

"దేముడిమీద ప్రమాణం చేస్తాను. నేను చెప్పిందే నిజం!" ఏడ్చింది.

కత్తిని తీశాడు షాడో.

"ఆల్ రైట్! నువ్వు చెప్పకపోతే నాకు తెలియదనుకొన్నావా? నేనొక చిన్న కథ చెప్తాను. విను. నేను ఏమైనా వివరాలు వదిలేస్తే నువ్వు పూర్తి చేద్దువుగాని" అన్నాడు కత్తిని తిరిగి బూటులోకి చేరుస్తూ.

నెర్వస్ గా కదిలింది అటూ ఇటూ. షాడో చెప్పేది ఆమె బుర్ర కెక్కలేదు. "నా మీదకు బొమ్మని స్పైడర్ ను పంపింది ఎవరు?" మళ్ళీ ప్రశ్నించాడు.

"నిన్ను పట్టుకుని ఇన్ ఫర్మేషన్ తెమ్మని మాకు ఆర్డర్లు వచ్చాయి. వాటి సంగతి నీకొక్కడికే...నీకొక్కడికే తెలియాలి. ఇంకేవరికీ తెలియదు. అందుకని మేమే పంపించాం."

"చెత్త! నా దగ్గిర ఆ వజ్రాలు లేవని ఎన్నిసార్లు చెప్పినా మీరు నమ్మరేమిటి?" నిజంగానే ఆశ్చర్యపోయింది షీలా. "కాని...కాని!" వత్తులు కొట్టింది.

"ఇంక నువ్వేమీ చెప్పనక్కరలేదు. నేను చెప్పేది విను. మా స్నేహితుడొకడు న్యుస్ పేపర్లు చదివాడు. నువ్వు విజిట్ చేస్తున్న, బోట్ యాక్సిడెంట్ వ్యక్తిని గురించి పూర్తిగా తెలిసిపోయింది. అది తెలిసిన తర్వాత..."

షీలా నోరు తెరచింది.

"అతనిపేరు పీటర్ జాన్! అతన్ని గురించి నీకేమైనా తెలుసా డియర్?"

"పీటర్ మీ గాంగ్ లో ఒక వ్యక్తి. మీరందరూ కలసి విమానంలో ఆ వజ్రాలను తీసుకువస్తున్నారు. కాని బర్మా ప్రభుత్వం ప్లేనును వెనక్కు తిప్పమని ఆర్డర్ చేసింది. పైలట్ కూడా మీ బ్రాంచివాడే

అయివుంటాడు. అతను వినిపించుకోకుండా ఇండియన్ బౌండరీలోకి ప్రవేశించాడు. ఇక్కడ ఎయిర్ పోర్టులలో మీకోసం పోలీసు మనుషులు రెడీగా వున్నారని వార్త, రేడియోద్వారా అందివుంటుంది. ఎవరు అందించారో ఆఖరికి తెలుస్తుంది."

"ఏమయితేనేం, మీ ప్లానులు మార్చుకోవాల్సి వచ్చింది. మధ్యలో నది ముఖద్వారంవద్ద కొండమీద మైదానంలో ప్లేను దించారు. ఒక మనిషి రన్నింగ్ ప్లేనులోనుంచి కిందకి దూకాడు. అతనే పీటర్ జాన్."

"అంతా అబద్ధం. ఇటువంటిదేమీ జరగలేదు. నో!నో" అరిచింది షీలా. వికటంగా నవ్వాడు షాడో. "కావచ్చు నేను చెప్పేది కథగదా! జాగ్రత్తగా విను. నేను ఆ మైదానంలో ప్లేను టైరుగుర్తులు చూశాను. మొదట జీపు గుర్తులనుకున్నాను. కాని అక్కడికి జీపులెలా వస్తాయి?"

"మళ్ళీ పైకి లేచేసరికి విమానం దెబ్బతిని కూలిపోయింది" ఉలిక్కి పడింది షీలా. ఆ రోజు సంఘటన గుర్తుకు వచ్చివుంటుంది. స్టీరింగ్ మీద తల పెట్టుకొని ఏడవ నారంభించింది.

"నేను చెప్పినా వినిపించుకోలేదు. గాలి అనుకూలంగా లేదు. ఇంకెక్కడయినా దిగుదామంటే నా మాట లక్ష్యపెట్టలేదు!" గొణగ సాగింది. షాడో తనకథ కంటిన్యూ చేశాడు.

"బహుశా పీటర్ జాన్ తన సొంత ప్లానులు తయారు చేసుకొని వుంటాడు. తనే వజ్రాలన్నీ కొట్టేయాలని అనుకొని వుంటాడు. ప్లేను లోనుంచి దూకేసరికి అతనికి కాళ్ళూచేతులూ దొక్కుపోయాయి. అదే మీ రహస్యచర్యను నాకు ఎత్తిచూపాయి. అతని స్నేహితులు బోటులో వచ్చి, అతన్ని పికప్ చేశారు. వారిలో వారికే వజ్రాల భాగంలో తగవు లాట వచ్చివుంటుంది. ఆ తన్నులాటలో బోటు తల్లకిందులయింది. వజ్రాలు నీటిలో పడిపోయాయి. వాటితోపాటు ఆ ఇద్దరూ పడి చనిపోయారు. పీటర్ జాన్ ను ఒక కష్టమ్స్ బోటు రక్షించి హాస్పిటల్లో చేర్పించింది."

"అతను ఇంకా హాస్పిటల్లోనే వున్నాడు. మీ వజ్రాలు ఎక్కడున్నాయో అతనికి తెలుసు. కాని అతను మన స్మారకంలో లేడు. స్పృహ వస్తుందో తెలియదు, రాదో తెలియదు.

"ప్లేను కూలిపోగానే నా ఖర్మగాలి నిన్ను రక్షించాను. అందుకని మీ పీటర్ జాన్ ని కలిసి, నేనే ఆ వజ్రాలను దొంగిలించి వుంటానని, నా వెంటపడ్డారు మీరందరూ. అంతేకదూ! హనీ!"

"మీ వజ్రాలు భద్రంగా నదీ గర్భంలో విశ్రాంతి తీసుకుంటున్నాయి"
"నో! నో!" అని అరిచింది షీలా! జాగ్రత్తగా ఆమెను గమనించసాగాడు షాడో.

"ఏం? మునిగిపోలేదని ఎట్లా అనుకుంటున్నావు? అవేమయినా రబ్బరా తేలేందుకు?" షీలా సమాధానం చెప్పలేదు. "లేకపోతే పీటర్ జాన్ చేతుల్లో నీకుకూడా వాటావుందా? అతను తనబలాన్నీ నువ్వు నీ సెక్స్ నీ..."

షాడోమీదపడి రక్కటానికి ప్రయత్నించింది. మళ్ళీ చెంప పగల గొట్టాడు. స్టీరింగుకు కొట్టుకుంది షీలా.

నవ్వాడు షాడో. "పాపం అష్టకష్టాలు పడి వజ్రాలు దొంగిలించారు. ఎందుకు? శృంగానదిలో పారెయ్యటానికి, మునిగిపోలేదని ఎట్లా అనుకుంటున్నావు షీలా!"

"బోటు పూర్తిగా తిరగబడింది. దాంట్లో ఏమీలేదు. పీటర్ జాను దగ్గిర లేవు. నీటిలో పడక ఎక్కడికి పోతాయి?"

చెయ్యి గట్టిగా పట్టుకున్నాడు. విడిపించుకోవటానికి ప్రయత్నించ సాగింది.

"మాట్లాడు షీలా! నా ప్రశ్నకు సమాధానం చెప్పు! లేకపోతే చెయ్యి విరిచేస్తాను!"

"నాకు తెలియదు.....ప్లీజ్!"

"టాక్!"

"ప్లీజ్..."

"నువ్వు బ్రతిమాలితే ఎందుకు సమాధానం చెపుతావ్? నీ పని ఇలా కాదు" బూటులోనుంచి కత్తితీసి ఆమెముఖం మీద పెట్టాడు.

ఖంగారుపడింది షీలా.

"చెపుతాను...వదులు...ఆ వజ్రాలు ఒక ఫోమ్ రబ్బర్ బాగ్ లో పెట్టాము."

* * *

షాడో ఒక్కసారి గతుక్కుమన్నాడు. "లైఫ్ బాయ్" లో పెట్టారా? అయితే అది ఈపాటికి గంగలో కలిసివుంటుంది.

సడన్ గా అతని మెదడులో ఒక మెరుపు మెరిసింది. ఈలవేసి కూర్చున్నాడు.

"ఆ! దొరికింది. మీ వజ్రాలు ఎక్కడున్నాయో నాకిప్పుడర్థ మయింది" అన్నాడు ఉత్సాహంగా.

ఆమె వేళ్ళు షాడో చేతిలో గుచ్చుకు పోయాయి. "మాధవ్...ప్లీజ్ వాటి కాస్టు తెలుసు గదా! సగం నీకిస్తాము..."

"నథింగ్ డూయింగ్ హనీ! అదేమీ కుదరదు. పోనీ కారును" అన్నాడు. అతని దృష్టంతా వజ్రాలమీద వుంది.

కారు వేగంగా మౌంటెన్ రోడ్ మీద పోసాగింది. రోడ్ వున్నంత వరకూ పోనిచ్చి అడవి మొదలు కాగానే ఆపమన్నాడు.

ఒక చెట్టుకింద ఆపి ఇంజన్ ఆఫ్ చేసింది షీలా. నీరసంగా సీటు కానుకొని కూర్చుంది.

గంగారాం ఇచ్చిన సిగిరెట్ ప్యాకెట్టు తీసి సిగిరెట్టు వెలిగించాడు షాడో. గుండెలనిండా పొగలాగి వదిలాడు, 'ఇన్ని రోజుల నుండి పడిన కష్టం ఫలించింది' అనుకుంటూ.

"మాధవ్" అన్నది షీలా.

"ఇక ఆ ప్రయత్నాలు చాలు షీలా! నాకు తలనొప్పి తెప్పించకు" అన్నాడు విసుగ్గా.

కోస్గిల్లో రకరకాలయిన వింతలు జరుగుతూ ఉంటాయి. జగ్గడు అనే వ్యక్తి ఈ పాటికి హాస్పిటల్లో చేరి వుంటాడు. ఒక గాంగ్ లీడర్ తన కుడి భుజం ఏమయిందీ తెలియక గంతులేస్తూ వుంటాడు. జూలియా ఏం చేస్తోందో తెలియదు. బుద్దూ ఏమయ్యాడో అంతకన్నా తెలియదు.

ఆ వజ్రాలు?

వాటికోసం వెతకటానికి షాడోను అడవిలోకి పంపి, నదిలోనూ, ఒడ్డునా, షాడో కాబిన్ లోను తెగ వెతికారు కొందరు. ఎవరు?

పైకి నవ్వేశాడు షాడో.

అనుమానం వున్నా ఇంతవరకూ కరెక్ట్ గా గుర్తుపట్టలేని మంద బుద్ధిని తలచుకుంటూ "మీ లీడర్ ఎవరో ఇప్పుడు నిజంగా తెలిసి

పోయింది షీలా! పైకి పెద్ద మనిషిలా చలామణీ అవుతున్న మీ ఫాదరే కదూ!" ప్రశ్నించాడు.

"అవును. నువ్వు కనిపెడతావని అనుకొంటూనే వున్నాను" తల వంచుకొని సమాధాన మిచ్చింది షీలా.

"మీలాంటి చీడపురుగులున్నంత కాలం మన దేశం ఇలాగే వుంటుంది. మన దేశంలో చేసిన పనులు చాలలేదనా? ఇంకోదేశం వెళ్ళి దొంగతనాలు మొదలు పెట్టారు?" ఆవేశంగా అన్నాడు షాడో.

"నీ జీవితం పవిత్రమయినదా? మాకు నీతులు చెపుతున్నావు?" రెట్టించి ప్రశ్నించింది షీలా.

"నా జీవితాన్ని గురించి నీకేం తెలుసు? ముందు ముందు తెలుస్తుంది, తొందరపడకు. ఆ! ఇక మనం బయలుదేరాలి!" అన్నాడు సిగిరెట్టు క్రిందపడేస్తూ.

"ఎక్కడికి!" ప్రశ్నించింది.

"నా కాబిన్ కు. వజ్రాలు వెతకటానికి!"

మళ్ళీ చేతిని అతని భుజంపై వేసింది. పురుగును విదిలించినట్లు విదిలించాడు షాడో. కొండలు ఎక్కి దిగి, పొదలుదాటి, శృంగానదిని చేరేసరికి తెల్ల తెల్ల వారింది. నదిలో అడవిబాతులు రెక్కలు తప తప

కొడుతూ జలకాలాడుతున్నాయి. పక్షులు పగటి కాహ్వానాలు పలుకుతూ పాటలు పాడుతున్నాయి.

జగ్గడి రివాల్వరును ఒకసారి తడిమి చూసుకున్నాడు షాడో. కొండ దిగి తనకు బాగా తెలిసిన దారిలో నడువసాగాడు. కొండప్రక్కనే శృంగా నది ప్రశాంతంగా ప్రవహిస్తున్నది. కాబిన్ కు ఫర్లాంగు దూరంలో ఆగి పరికించాడు షాడో. చుట్టూవున్న పక్షులు, అడవి వాతావరణం ప్రమాదమేమీ లేదని సూచించాయి కాబిన్ దగ్గిర.

షీలా పూర్తిగా అలసిపోయింది. చేతితో కాళ్ళు పిసుక్కుంటూ- "ఇంకెంత దూరం మాధవ్?" అని అడిగింది.

"ఇక్కడే దగ్గిరలో కొచ్చేశాం!" అంటూ ముందుకు దారి తీశాడు. జాగ్రత్తగా చూసుకుంటూ కాబిన్ ను సమీపించాడు. ఎవ్వరూలేరు ముఖేష్ ఏమయినట్లు?

అడుగులో అడుగు వేసుకుంటూ కాబిన్ దగ్గరకు వచ్చాడు. ఎక్కడి నుండైనా రివాల్వరు పేలవచ్చని వూహిస్తూ, కాని ఏం జరగలేదు.

లోపలికి పోయి తనకి వచ్చిన ఐడియాను తరచి చూడాలని ఆతృత పడసాగాడు. అది అసంభవం కావచ్చు. కాని ప్రయత్నించటం లో తప్పేమీ లేదుకదా!

ద్వారం దగ్గిరకు వచ్చాడు. ఏమీ జరుగలేదు.

తలుపు తీసుకుని లోపలకు ప్రవేశించాడు. రెండు కిటికీలు తెరిచి వున్నాయి. రీసెంట్‌గా ఎవరోవున్న గుర్తులు కనుపించాయి.

లోపలికిపోయి చుట్టూ కలియచూశాడు. ఫర్నిచర్ ఎక్కడిదక్కడే వుంది. షీలా లోపలికి వచ్చి కుర్చీలో కూలబడి కళ్ళు మూసుకుంది.

రివాల్వర్ టేబిల్ మీద పెట్టి బంకు కిందవున్న అట్టపెట్టెను బయటకు లాగాడు. అందులో రకరకాల వస్తువులున్నాయి. నదిలో కొట్టుకువచ్చిన వస్తువులన్నిటినీ పట్టుకుని తీసుకువచ్చి కాబిన్‌లో పడేసాడు మాధవ్. బోటు స్పేర్ పార్టులు, చెక్కముక్కలు, ఖాళీ సీసాలూ-

రెండు లైఫ్ బాయ్‌లు— అవి మామూలు ఆర్డినరీవి. వాటిలో ఏమీ లేదు. గిరుక్కున వెనుతిరిగి మూలకుచూశాడు. తను ఆఖరిసారి వచ్చినప్పుడు విసిరేసిన బ్లూ లైఫ్ బోయ్ మూలనవుంది.

తడబడుతున్న అడుగులతో, వణుకుతున్న చేతులతో వెళ్ళి అందుకున్నాడు. అదికూడా మాధవ్ నదిలోనించి పట్టుకువచ్చిందే.

షీలా కళ్ళు తెరిచి షాడోను గమనిస్తూవుంది.

ఆ లైఫ్ బాయ్‌కి లోపల మడతలో ఒక "జిప్పర్" వుంది. లాగి లోపల చెయ్యిపెట్టాడు. దాన్ని తలకింద వేసుకొని అనేకసార్లు పడుకున్నాడు. గట్టిగా రాయిలా వుందని మూలకు విసిరేశాడు.

లోపల ఒక గుడ్డమూటవున్నది. బయటకు లాగి మూట విప్పాడు.

వజ్రాలు! కళ్ళు మిరుమిట్లు గొలుపుతూ మెరుస్తున్నాయి.

"మైగాడ్" అంటూ నోరు తెరిచింది షీలా.

పీటర్ జాన్ చాలా తెలివైనవాడు. ఫోమ్ రబ్బర్ లో పెట్టినది తీసి లైఫ్ బాయ్ లో దాచాడు. వాటర్ లో పడినా మునిగిపోకుండా వీళ్ళు ఆ బాగ్ కోసం వెతుకుతూ, లైఫ్ బాయ్"లను వదిలేశారు.

"దుర్మార్గుడు బాగ్ లోనుంచి తీసి లైఫ్ బాయ్ లో పెట్టాడు. మమ్మల్ని డబుల్ క్రాస్ చేశాడు" అంటూ పిచ్చిగా పీటర్ ని నిందించ సాగింది షీలా.

నవ్వాడు షాడో, వజ్రాలను మూట కడుతూ.

ద్వారంవద్ద శబ్దం వినవచ్చింది. ఒక్క గంతులో బల్లమీద పిస్టల్ ను చేరుకోబోయాడు. కాని లాభం లేక పోయింది. ఎవరో చాలా నాక్ గా వచ్చి కాబిన్ లోకి ప్రవేశించారు. ఒక ఆకారం ద్వారంలో నిలబడివుంది. చేతిలో .44 రైఫిల్ నోరు తెరుచుకొని షాడోవైపు ఆకలిగా చూస్తున్నది.

షీలా రెండు చేతులతోనూ తలపట్టుకుని కూర్చుంది.

ఆశ్చర్యంతో నోరు తెరిచాడు షాడో.

"హేండ్సప్!" అన్నదా ఆకారం.

నాతో సమానంగా అడవిలో ప్రయాణించ గలవని వేగంగా నన్ను అనుసరిస్తావని నేను వూహించలేదు" అన్నాడు షాడో.

"ఒక్కోసారి యిటువంటి పనులు చేయక తప్పదు మాధవ్" అన్నది జూలియా. ఎప్పటిలాగా ఎంతో ఆకర్షణీయంగా, అమాయకంగా వుంది. చేతిలో రైఫిల్ మాత్రం అటువంటి ఆలోచనలకడ్డు నిలుస్తుంది.

"నో! ఆ రైఫిల్ ను జాగ్రత్తగా కిందికి దించు బేబీ!" అన్నాడు ముఖేష్, ఆమె వెనుకాల ఒక రివాల్వరు ఆమె వీపుకానించి నిలుచుని, షాడో ఎంతో ఆనందపడ్డాడు.

"గుడ్ ఫర్ యూ ముఖేష్ సమ..."

"నెమ్మదిగా రివాల్వరును కిందపెట్టు మిస్టర్! మిస్టర్ మాధవ్ కదలవద్దు!" చేతిలో పిస్టల్ ముఖేష్ వీపుకానించి అన్నాడు బుద్ధూ.

జూలియా నవ్వింది. "చూశావా మాధవ్! మానుంచి తప్పించు కోలేవు!"

"అందరూ చేతులెత్తి నిలబడండి. కదిలితే పేకముక్కలు ఎగరేసినట్లు గాలిలోకి ఎగరేస్తాను- నాచేతిలో వున్నది బొమ్మకాదు. మిషన్ గన్, మి-ష-న్-గ-న్" అంటూ అరిచాడు ఒకవ్యక్తి బుద్ధూ వెనకాలనుంచి.

షాడో ఎగిరి గంతేశాడు. గంగారాం! దుర్మార్గుడు సమయానికి ఎలా రాగలిగాడు! షీలా టేబుల్ మీద వున్న రివాల్వర్ వైపు దూకింది. కదలటానికి వీలులేక కాలెత్తి బలంగా విసిరాడు షాడో. బూటు తగిలి మూలకెగిరి పడింది షీలా. స్పృహతప్పి నేలకు జారిపోయింది.

బల్లమీద పెట్టిన రివాల్వరు తీసుకున్నాడు షాడో.

జూలియా రైఫిల్ వదిలి నిలబడింది. బుద్దూ చేతిలోనుంచి ఫిస్టల్ జారి నేలమీద పడింది. ముఖేష్ ఆ రెండింటినీ తీసి జేబులో వేసుకున్నాడు.

జూలియా బుద్దూలను వచ్చి మంచంమీద కూర్చోమని సైగచేశాడు షాడో. చేతిలో మిషన్ గన్ తో లోపలికి వచ్చాడు గంగారాం.

"ఏం గురూ! కులాసాగా వున్నావా?" అన్నాడు నవ్వుతూ.

తన సంతోషాన్ని చేతులతో చూపించాడు షాడో గట్టిగా కౌగిలించుకొని.

"నీతో ఏది వచ్చినా కష్టమే స్వామీ!" అన్నాడు గంగారాం మెడ సవరించుకుంటూ.

"నువ్వు కొండమీదకు రాగానే బైనాక్యూలర్స్ లో చూశాను రాజు! మన అతిధులు ముగ్గురూ నిన్ననే ఇక్కడికి వచ్చారు. చితక గొట్టి పడేసాను. వాళ్ళను తీసుకుని పక్కనున్న పొదలలో దాక్కున్నాను.

ఎందుకయినా మంచిదని. వద్దామని అనుకుంటుండగా బేబీ నది ఈ వైపునుండి రావటంచూసి ఆగాను ఆమె నిన్ను బెదిరించగానే నేనూ వచ్చి ఒక వూపు వూపాను. ఆ పెద్దమనిషి చెడగొట్టాడు" అన్నాడు ముఖేష్.

"నేను నిన్ను మీ ఇంటి దగ్గర్నుంచి అనుసరిస్తూనే వున్నాను గురూ! నువ్వు జగ్గడ్ని చితకగొట్టిన తరువాత, వాణ్ని హాస్పిటల్ లో చేర్చమని మా వాళ్ళకు ఫోన్ చేసి నిన్ను అనుసరించాను. బేబీ రావటం, చిన్నాడు బిత్తరపోవటం, బుద్ధూ గురుగారు పిస్టల్ తో ప్రత్యక్ష మవటంచూసి నేనూ ముందుకు వచ్చాను" అన్నాడు గంగారాం.

"ఇప్పుడేం చేద్దాం రాజు?" జాన్సన్ నీ, వాడి అనుచరుల్ని తీసుకొచ్చి కాబిన్ లో పడవేసి అడిగాడు ముఖేష్.

జూలియా గొంతు సవరించుకొని లేచి నిలబడింది.

"ఎక్స్క్యూజ్ మీ!" అంటూ స్కర్టు పాకెట్ లోంచి ఒక కార్డుతీసి ముఖేష్ చేతికిచ్చింది.

ఆశ్చర్యపోయాడు ఆ కార్డు చూసి ముఖేష్.

"బుద్ధూ కూడానా" అన్నాడు బుద్ధూకేసి చూస్తూ. అవునని తలవూపి, బుద్ధూ యింకో కార్డుతీసి చూపించాడు.

ఆ రెండు కార్డులూ షాడోకిచ్చాడు ముఖేష్. వారిద్దరూ బర్మా సీక్రెట్ సర్వీస్ ఏజెంట్లు "మా ప్రభుత్వం మమ్మల్ని పంపింది. భారతదేశపు ఏజెంట్లు చేసే పనులకు సహాయంగా వుండి వజ్రాలను తిరిగి బర్మా చేర్చమని మాకు ఆదేశాలు వచ్చాయి. మాకు ఎవ్వరు ఏజెంట్లో, ఎవ్వరు గాంగ్ వాళ్ళో తెలియలేదు. అందుకని యిక్కడే స్థావరం ఏర్పరచుకొని మేమూ పరిశోధనలో దిగాము. మన మాధవ్ శక్తి యుక్తుల మూలంగా ఈ కేసు సాల్వ్ అయింది. ఈ అధికారుల వద్దకు మమ్మల్ని తీసుకుపోతే అన్ని విషయాలు క్లియర్ చేసుకొని మేము మా దేశానికి పోతాం!" అన్నది జూలియా.

తనవైపు తిరిగిన ముఖేష్ కు కన్నుకొట్టాడు షాడో. అర్థం చేసుకున్నాడతను. "ఆల్ రైట్ బేబీ! సారీ మిస్ జూలియా, పదండి యింకా యిక్కడెందుకు? థాంక్యూ వెరీమచ్ మిస్టర్ మాధవ్!" అంటూ నిందితుల్ని షాడో వచ్చిన డింగీలోకి చేరవేయసాగాడు ముఖేష్. బుద్ధూ, గంగారాం ముఖేష్ కు సాయపడుతున్నారు.

జూలియా షాడో దగ్గరకు వచ్చింది. ఒక్కక్షణం కళ్ళలోకి చూసి అతన్ని పెనవేసుకుపోయింది. "మాధవ్, మాధవ్! " అంటూ.

ఆమె తల నిమురుతూ మౌనంగా వుండిపోయాడు.

"మాధవ్ నిన్న కొండల్లో చెప్పాను గుర్తుందా? ఏం జరిగినా మనిద్దరిమధ్య అనుబంధం మర్చిపోలేనని, నన్ను క్షమించు మాధవ్,

నా దేశంకోసం వేరే దారిలేక అలా చేయాల్సివచ్చింది. నా మనసు మాత్రం ఎప్పటికీ నీదే! కిస్ మీ డార్లింగ్. కిస్ మీ హనీ!" అంటూ ఆవేశంతో అతని గుండెల కతుక్కుపోయింది జూలియా.

ఆమె ముఖాన్ని చేతులలోకి తీసుకొని సున్నితంగా ముద్దు పెట్టుకున్నాడు షాడో.

బయటనుంచి "జూలియా!" అని బుద్దూ కేక వేశాడు.

వదలలేకవదిలి, వెనుతిరిగిచూస్తూ, చెమ్మగిల్లిన కనులను తుడుచుకుంటూ వెళ్ళింది జూలియా.

* * *

"వెల్ మిస్టర్ బియాన్! మీ కథ కూడా చాలా విచిత్రంగా వుంది" అంటూ కుర్చీకి చేరగిలబడి నవ్వారు సి.ఐ.బి. డైరెక్టరు కులకర్ణి.

అంతకు ముందురోజే వజ్రాలు దొంగిలించిన గాంగ్ నంతా బంధించటం జరిగింది. షీలా ఫాదర్ తో సహా జైలు ప్రవేశించింది. అన్ని పనులు పూర్తి అయిన తర్వాత జూలియా, బుద్దూలకు యింటర్వ్యూ యిచ్చారు కులకర్ణి.

ఆ రూంలో జూలియా, బుద్దూ(బియాన్ షూ) ముఖేష్, మాధవ్ కూర్చుని వున్నారు.

"విమాన ప్రమాదం గురించి తెలియగానే మా డిపార్టుమెంటు అక్కడికి చేరింది. అప్పటికే మీ ప్రభుత్వంనుండి మాకు వజ్రాల చోరీని గురించి రిపోర్టు చేరివుంది. కాకతాళీయంగా విమానాన్ని ముందు చూసింది వీరు. మిస్టర్ మాధవ్. సైకాలజీ ప్రొఫెసర్. ఆయన ఒక గ్రంధం వ్రాస్తూ, ఏకాంతంకోసం అడవిలో ఒక కాబిన్ కట్టుకొని వుంటున్నారు. కూలిపోయిన విమానాన్ని చూసి, షీలాను రక్షించారు. తరువాత మా ఏజెంట్లు ఆయనను కలుసుకొని కొన్ని అరేంజిమెంట్లు చేసుకున్నారు."

జూలియా తెల్లబోయింది! "అయితే ఆ మాధవ్—" "నేను!" అంటూ యూనిఫారంలో ప్రవేశించి కులకర్ణిగారికి స్మార్ట్ గా శాల్యూట్ కొట్టి నిలబడ్డాడు షాడో.

"మాధవ్ గారి చుట్టూ కథ నడపటానికి అవకాశం వుంటుందని గ్రహించి, ఆయనస్థానంలో నేను ప్రవేశించాను. ఆ తరువాత కథ మీకు తెలిసిందే" అన్నాడు నవ్వుతూ.

"మిస్ జూలియా! యితడు షాడో అని మా ఏజంటు. అయితే ఈ రహస్యం భేదించటానికి అతని గత చరిత్ర, పాత స్నేహాలు కొంత వుపయోగించాయి అనుకోండి." అన్నారు కులకర్ణి.

జూలియా తత్తరపాటును చూసి అందరూ నవ్వారు.

వారితోపాటు తనూ జతకలిపిందామె. తను మోసం చేశాను అనుకుంటే తననే మోసం చేశాడు మిస్టర్ షాడో!

వాలుచూపులు షాడోపై పంపింది. ఆ చూపుల్లో వున్న వాగ్దానాలు, వీడికోలూ గమనించి నవ్వుకున్నాడు షాడో_ ది సీక్రెట్ ఏజెంట్.

—:జైహింద్:—